




www.navabhoomi.in | epaper.navabhoomi.in | RNI No:TELTEL:82083

# నవభూమి

ANUKSHANAM

NAVABHOOMI TELUGU DAILY — నవతరం తెలుగు దినపత్రిక

Published from Hyderabad and Vijayawada

ఎడిటర్ : అజీద్

హైదరాబాద్ | 03 గురువారం | ఏప్రిల్ 2025 | పేజీలు 12 | వెల: రూ.6 | సంపుటి:2 సంచిక: 199

Navabhoomi daily fallows..

Circulated at: Hyderabad, Rangareddy, Adilabad, Karimnagar,Warangal,Khammam, Nalgonda, Mahabubnagar,Medak, Nizamabad, Krishna,Guntur,Easrt Godavari, West Godavari,Prakasam, Nellore,Srikakulam,Vizianagaram,Visakhapatanam,Kurnool,Chittoor,Kadapa,and Anantapur







## స్పీకర్‌దే తుది నిర్ణయం

- నాలుగేళ్లు స్పీకర్ ఎలాంటి చర్యలు తీసుకోకపోతే చూస్తూ ఉండిపోవాలా?
- ఎమ్మెల్యేల అనర్హతపై సుప్రీంకోర్టు సంచలన వ్యాఖ్యలు
- న్యాయ స్థానాలు రాజ్యాంగ పరిరక్షకులుగా వ్యవహరిస్తాయన్న జస్టిస్ బీఆర్ గవాయ్
- తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ తరఫున న్యాయవాది జస్టిస్ ముకుల్ రోహత్గీ వాదనలు

2



**న్యూఢిల్లీ-నవభూమిబ్యూరో**

ఎమ్మెల్యే అనర్హత కేసులో సుప్రీం కీలక వ్యాఖ్యలు చేసింది. ఎమ్మెల్యేల అనర్హతపై నాలుగేళ్లు స్పీకర్ ఎలాంటి చర్యలు తీసుకోకపోయినా కోర్టులు చూస్తూ ఉండాల్సిందేనా అంటూ సుప్రీం ప్రశ్నించింది. న్యాయ స్థానాలు రాజ్యాంగ పరిరక్షకులుగా వ్యవహరిస్తాయని జస్టిస్ బీఆర్ గవాయ్ స్పష్టం చేసారు. ఈ కేసులో తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ తరఫున సీనియర్ న్యాయవాది జస్టిస్ ముకుల్ రోహత్గీ వాదనలు వినిపించారు. స్పందించిన జస్టిస్ గవాయ్ ఆసక్తికర ప్రశ్నలు సంధించారు. బీఆర్ఎస్ కు కు చెందిన ఎమ్మెల్యేలు పార్టీ మారిన వ్యవహారంపై ఈరోజు సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. స్పీకర్‌కు రాజ్యాంగం కల్పించిన విశేషాధికారాలను కోర్టులు హరించలేవని, ఒకసారి ఆయన నిర్ణయం తీసుకున్నాకే న్యాయ సమీక్షకు అవకాశముంటుందని ముకుల్ రోహిత్గీ కోర్టు లో వాదించారు. స్పీకర్ కాలపరిమితితో నిర్ణయం తీసుకోవాలని కోర్టు చెప్పడం భావ్యం కాదని రోహత్గీ తెలిపారు. ఒక రాజ్యాంగ వ్యవస్థపై మరో

## వక్ఫ్ సవరణ బిల్లుకు లోక్‌సభ ఆమోదం



- అనుకూలంగా 282 మంది సభ్యులు ఓటు వేయగా.. బిల్లును వ్యతిరేకించిన 232 మంది సభ్యులు
- దాదాపు 12 గంటల పాటు సుదీర్ఘ చర్చ తర్వాత ఓటింగ్
- నేడు రాజ్యసభలో కూడా ప్రవేశపెట్టనున్న వక్ఫ్ బిల్లు
- బిల్లు సమర్థనకు ముస్లిం ఎంపీ ఒక్కరు బీజేపీలో లేరన్న డీఎంకే

2

**న్యూఢిల్లీ-నవభూమిబ్యూరో**

దేశ వ్యాప్తంగా సంచలనంగా మారిన వక్ఫ్ సవరణ బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. అనుకూలంగా 282 మంది సభ్యులు ఓటు వేయగా.. 232 మంది సభ్యులు బిల్లును వ్యతిరేకించారు. దీంతో లోక్ సభలో బిల్లుకు ఆమోద ముద్ర పడింది. ఈ బిల్లును ఆమోదించడానికి ఎన్డీఏ ప్రవేశపెట్టగా.. ఇండియా కూటమి తీవ్రంగా వ్యతిరేకించింది. బుధవారం మధ్యాహ్నం ఈ బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టగా వాడీవేడీ చర్చ నడిచింది. ఈ విషయంలోనే అధికార, విపక్ష పార్టీలు ఒకరిపై మరొకరు మాటల యుద్ధానికి తెర లేపారు. దాదాపు 12 గంటల పాటు సుదీర్ఘ చర్చ జరిగిన తర్వాత బిల్లు ఆమోదం కోసం స్పీకర్ ఓం బిర్లా పిలుపునిచ్చారు. అనుకూలంగా 282, వ్యతిరేకంగా 232 మంది సభ్యులు ఓటు వేశారు.

ఇక బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే పక్షాలు, ప్రతిపక్ష ఇండియా కూటమిలోని ప్రధాన పార్టీలు తమ ఎంపీలు అందరికీ విప్ జారీ చేసిన విషయం తెలిసిందే. గురువారం నాడు వక్ఫ్ బిల్లును రాజ్యసభలో కూడా ప్రవేశపెట్టనున్నారు. ఎగువసభలో ఈ బిల్లుపై చర్చకు 8 గంటల సమయాన్ని కేటాయించారు.

వక్ఫ్ సవరణ బిల్లుపై చర్చ సందర్భంగా డీఎంకే ఎంపీ ఎ.రాజా బీజేపీపై తీవ్ర విమర్శలు గుప్పించారు. ఒక్క ముస్లిం ఎంపీ కూడా లేని పార్టీ మైనారిటీల హక్కులను కాపాడేందుకు బిల్లును తీసుకురావడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. ప్రవేశపెట్టిన బిల్లును సమర్థించడానికి ముస్లిం ఎంపీ ఒక్కరు కూడా బీజేపీలో లేరన్నారు. కానీ బీజేపీ మాత్రం మనకు లౌకికవాదాన్ని బోధిస్తుందని ధ్వజమెత్తారు.

## ఆదిలాబాద్‌కు విమానాశ్రయం

- తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం మరో శుభవార్త!
- ఆదిలాబాద్ విమానాశ్రయానికి ఉత్తర్వులు జారీ
- ఆదిలాబాద్ జిల్లాతో పాటు తెలంగాణ ప్రజలకు శుభవార్త అన్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

2



**హైదరాబాద్-నవభూమిబ్యూరో**

తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం శుభవార్తను అందించింది. ఆదిలాబాద్ విమానాశ్రయానికి అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇదివరకే మామునూరు విమానాశ్రయానికి కేంద్రం ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే. తాజాగా, రాష్ట్రంలో మరో విమానాశ్రయానికి భారత వాయుసేన అనుమతి మంజూరు చేసింది. ఈ మేరకు తెలంగాణ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు. ఆదిలాబాద్ జిల్లా ప్రజలతో పాటు తెలంగాణ ప్రజలందరికీ ఇది శుభవార్త అని ఆయన పేర్కొన్నారు. ఇంతకుముందు మామునూరు విమానాశ్రయానికి అనుమతులు సాధించిన తెలంగాణ ప్రభుత్వం, ఇప్పుడు ఆదిలాబాద్ విమానాశ్రయానికి కూడా

## పాస్టర్ ప్రవీణ్ మృతిపై సీబీఐ విచారణ?

- ఏపీ హైకోర్టుకు పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతి వ్యవహారం
- 2 తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన ప్రవీణ్ మృతి
- హత్యకు గురై ఉండొచ్చనే వెల్లువెత్తుతున్న అనుమానాలు
- క్రైస్తవ సంఘాలు, పాస్టర్లు కూడా పెద్ద ఎత్తున ఆందోళన,నిరసన
- సమగ్ర దర్యాప్తుకు పోలీసులను ఆదేశించిన ఏపీ సర్కార్

2



**విజయవాడ-నవభూమిబ్యూరో**

ప్రముఖ క్రైస్తవ మత ప్రబోధకుడు, ఎవాంజలిస్ట్ పాస్టర్ ప్రవీణ్ పగడాల అనుమానాస్పద మృతి.. రెండు తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించింది. ఆయన మరణంపై అన్ని కోణాల్లోనూ దర్యాప్తు జరిపించాలనే డిమాండ్ ఊపందుకుంటోంది. ఆయన హత్యకు గురై ఉండొచ్చనే అనుమానాలు వెల్లువెత్తుతున్నాయి. రాజమండ్రి సమీపంలో.. తూర్పు గోదావరి జిల్లా చాగల్లులో క్రైస్తవ మహాసభలకు హాజరు కావడానికి బుల్లెట్‌పై రాజమండ్రికి బయలుదేరిన ఆయన అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన విషయం తెలిసిందే. కిందటి నెల 25వ తేదీన రాత్రి రాజమండ్రి సమీపంలోని కొంతమూరు వద్ద రోడ్డు పక్కన ఆయన మృతదేహాన్ని గుర్తించారు. ప్రవీణ్ శరీరంపై గాయాలు ఉండటం, బలమైన వస్తువులతో కొట్టినట్టు కనిపించడం వల్ల పలు అనుమానాలు వ్యక్తం అయ్యాయి. గుర్తు తెలియని వ్యక్తులెవరైనా ఆయనను హత్య చేసి, రోడ్డు ప్రమాదంగా సృష్టించే ప్రయత్నం చేసి ఉండొచ్చంటూ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లపై ఆందోళనలు వ్యక్తం అయ్యాయి. ఆందోళన.. పాస్టర్ ప్రవీణ్ మృతి చెందిన విషయం తెలిసిన వెంటనే అటు క్రైస్తవ సంఘాలు, పాస్టర్లు కూడా పెద్ద ఎత్తున ఆందోళనలకు దిగారు. ప్రభుత్వ ఆసుపత్రి వద్ద నిరసన చేపట్టారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర దర్యాప్తు జరిపించాల్సిన అవసరం ఉందంటూ డిమాండ్ చేశారు. పాస్టర్ ప్రవీణ్ మృతి ఉదంతం.. రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయనడానికి నిలువెత్తు నిదర్శనమంటూ విమర్శించారు. సమగ్ర దర్యాప్తునకు.. ఈ పరిణామాలన్నింటిపై తాజాగా ఏపీ ప్రభుత్వం స్పందించింది. సమగ్ర దర్యాప్తునకు ఆదేశించింది. ఈ ఉదంతం పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత, మంత్రి నారా లోకేష్.. దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## మూసీ పరిసరాల్లో నిర్మాణాలపై సర్కారు దృష్టి

- మూసీ నది పరిసరాల్లో నిర్మాణ అనుమతులపై నియంత్రణలకు శ్రీకారం
- నలుగురు సీనియర్ అధికారులతో కమిటీ నియామకం
- కమిటీలో మూసీ రివర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ జాయింట్ ఎం.డి,
- డీటీసీపీ, జీహెచ్‌ఎంసీ చీఫ్ ప్లానర్, హెచ్‌ఎండీఏ ప్లానింగ్ డైరెక్టర్లు
- మూసీ పరిసరాల్లో అభివృద్ధి పనులు, నీటి కాలుష్య నియంత్రణ,
- వరద నివారణ చర్యలపై ఈ కమిటీ సమీక్ష నిర్వహించి సిఫారసులు



2

**హైదరాబాద్-నవభూమిబ్యూరో**

మూసీ పరిసరాల్లో నిర్మాణాలను నియంత్రణపై ప్రభుత్వం ఫోకస్ పెట్టింది. ఈ క్రమంలోనే మూసీ నది పరిసరాల్లో నిర్మాణ అనుమతులపై కఠిన నియంత్రణలకు శ్రీకారం చుట్టింది. ఇందుకోసం నలుగురు సీనియర్ అధికారులతో కమిటీ ఏర్పాటు

## ఢిల్లీ కేంద్రంగా మద్దతు కూడగడుతున్న రేవంత్

- బీసీ రిజర్వేషన్ బిల్లు ఆమోదానికి రోడ్డెక్కిన తెలంగాణ కాంగ్రెస్, బీసీ సంఘాల నేతలు
- బీసీ పోరు గర్జన పేరుతో ఢిల్లీ వేదికగా జాతీయ స్థాయి ఆందోళన..నిరసన ప్రదర్శనలు..
- బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచాలనేది తెలంగాణ కాంగ్రెస్ ప్రధాన డిమాండ్
- జంతర్‌మంతర్ వద్ద బైఠాయించిన సీఎం రేవంత్‌రెడ్డి,టీపీసీసీ నేత మహేశ్‌కుమార్‌గౌడ్



2

**న్యూఢిల్లీ-నవభూమిబ్యూరో**

బీసీ రిజర్వేషన్ బిల్లు ఆమోదం కోసం తెలంగాణ కాంగ్రెస్, బీసీ సంఘాల నాయకులు రోడ్డెక్కారు. పోరు బాట పట్టారు. బీసీ పోరు గర్జన పేరుతో ఢిల్లీ వేదికగా జాతీయ స్థాయి ఆందోళనకు దిగారు. నిరసన ప్రదర్శనలను నిర్వహిస్తోన్నారు. మహా ధర్నాను చేపట్టారు. బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచాలనేది తెలంగాణ కాంగ్రెస్ ప్రధాన డిమాండ్. దీనిపై ఇదివరకే రెండు బిల్లులను అసెంబ్లీ ఆమోదించింది కూడా. దీన్ని కేంద్రానికి పంపించింది. ఈ రెండింటినీ కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఆమోదించాలంటూ కాంగ్రెస్, బీసీ సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. ప్రస్తుత లోక్‌సభ బడ్జెట్ సమావేశాల్లోనే బీసీ రిజర్వేషన్ బిల్లును ఆమోదించాలంటూ తెలంగాణ కాంగ్రెస్, బీసీ సంఘాల నాయకులు కొంతకాలంగా డిమాండ్ చేస్తూ వస్తోన్న విషయం తెలిసిందే. కేంద్రం నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో ఈ బీసీ పోరు గర్జన బాట పట్టారు. ఢిల్లీ జంతర్‌మంతర్ వద్ద బైఠాయించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. బీసీ సంఘాల ధర్నాకు హాజరయ్యారు. తన సంఘీభావాన్ని తెలియజేశారు.

## నిత్యానంద బతికే ఉన్నారు

- కైలాస దేశం సంచలన ప్రకటన
- నిత్యానంద మేనల్లుడు సుందరేశ్వరన్ ప్రకటన ఫేక్
- ఉగాది ఉత్సవాలలో కూడా ఆయన పాల్గొన్నారని లైవ్ స్ట్రీమ్ లింకును కూడా జత చేసిన భక్తులు

2



**చెన్నై-నవభూమిబ్యూరో**

వివాదాస్పద ఆధ్యాత్మికవేత్త స్వామి నిత్యానంద కైలాస దేశం పేరుతో ఒక కొత్త దేశాన్ని ఏర్పాటు చేసుకొని ఓ కొత్త ప్రపంచాన్ని సృష్టించిన విషయం అందరికీ తెలిసిందే. నిత్యానంద ఏర్పాటు చేసిన కైలాస దేశం ఎక్కడ ఉంది అనేది ఇప్పటివరకు ఎవరికీ తెలియదు. ఇక అటువంటి నిత్యానంద స్వామికి సంబంధించిన ఒక వార్త తాజాగా సోషల్ మీడియాలో హల్చల్ చేసింది. నిత్యానంద మరణ వార్తలపై సంచలన ప్రకటన నిత్యానంద మేనల్లుడు సుందరేశ్వరన్ నిత్యానంద మృతి చెందినట్టు మీడియాకు సమాచారం పంపించినట్లు సమాచారం. హిందూ ధర్మాన్ని కాపాడుకోవడానికి ఆయన తన ప్రాణాలను త్యాగం చేసినట్టు చెబుతున్నట్టు కొన్ని వార్తలు వైరల్ అయ్యాయి. ఇక ఈ క్రమంలో తాజాగా కైలాస దేశం నుండి నిత్యానంద మరణ వార్తలపైన సంచలన ప్రకటన వెలువడింది.

## ప్రియుడికోసం పిల్లలకు విషమిచ్చి చంపింది

- తృటిలో తప్పించుకున్న భర్త చెన్నయ్య
- పిల్లలు చనిపోయిన తర్వాత కడుపునొప్పి నాటకం
- పోలీసుల విచారణలో తానే చంపినట్లు అంగీకారం
- భర్తతో 20 ఏళ్ల వ్యత్యాసముండటం వల్లే..ఈ ఘాతుకం



2

**సంగారెడ్డి-నవభూమిబ్యూరో**

ప్రియుడి మోజులో కన్నతల్లే ముగ్గురు పిల్లలకు విషమిచ్చి చంపిన ఘటన సంగారెడ్డి జిల్లా అమీన్ పూర్ లో జరిగింది. అంతేకాదు, ఆ మహిళ తన భర్తను కూడా హతమార్చాలని ఆమె పథకం వేసింది. చెన్నయ్య, రజిత (38) దంపతులు అమీన్‌పూర్‌లో నివాసం ఉంటున్నారు. చెన్నయ్య వాటర్ ట్యాంకర్ డ్రైవర్‌గా పనిచేస్తుండగా, రజిత స్థానిక పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తోంది. వీరికి ముగ్గురు పిల్లలు ఉన్నారు.

ఇటీవల జరిగిన పదో తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో రజిత తన పాత స్నేహితుడు శివకుమార్‌ను కలిసింది. వారిద్దరి మధ్య వివాహేతర సంబంధం ఏర్పడింది. ప్రియుడితో కలిసి జీవించాలని నిర్ణయించుకున్న రజిత, భర్తను, పిల్లలను అడ్డు తొలగించాలని పథకం వేసింది. మార్చి 27న రాత్రి భోజనంలో పిల్లలకు పెరుగులో విషం కలిపింది. భర్త చెన్నయ్య పప్పు మాత్రమే తిని పనిమీద బయటకు

## జపాన్‌లో భూకంపం

- వణుకు పుట్టిస్తున్న వరుస భూకంపాలు
- జపాన్‌లో రిక్టర్ స్కేలుపై 6.0 తీవ్రతగా నమోదు
- అప్రమత్తమైన జపాన్..సహాయక చర్యల్లో నిమగ్నం
- ప్రాణ,ఆస్థినష్టం సంభవించలేదని ప్రభుత్వ ప్రకటన

2



**టోక్యో-నవభూమిబ్యూరో**

భూకంపాలు ప్రజల్లో వణుకు పుట్టిస్తున్నాయి. మయన్మార్, థాయ్‌లాండ్‌లలో ఇటీవల 7.7 తీవ్రతతో వచ్చిన భూకంపం పెను విధ్వంసం సృష్టించి వేలాది మంది ప్రాణాల్ని బలితీసుకున్న విషయం తెలిసిందే. ఆ తర్వాత టాంగో ఐల్యాండ్ లో భూకంపం సంభవించింది. ఇప్పుడు తాజాగా జపాన్ లోని క్యుషులో భూకంపం సంభవించింది. స్థానిక కాలమానం ప్రకారం రాత్రి 7.34 గంటలకు ప్రకంపనలు రాగా.. రిక్టర్ స్కేలుపై 6.0 తీవ్రతగా నమోదైంది. జపాన్‌లో భూకంపాలు, సునామీలు సాధారణంగా సంభవిస్తూ ఉంటాయి. కానీ అనూహ్య ఘటనతో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. మరోవైపు అధికారులు కూడా అప్రమత్తమై ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. అయితే ఈ భూకంపం ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్ట వివరాలు ఇంకా వెల్లడించలేదు. ఎలాంటి సునామీ హెచ్చరికలు లేవని వెల్లడించారు. ఇక ఇటీవలే పసిఫిక్ తీరంలో మెగా భూకంపం సంభవిస్తే... దేశం భారీగా ఆర్థిక నష్టాన్ని ఎదుర్కోవలసి ఉంటుందని జపాన్ ప్రభుత్వం ఒక నివేదిక విడుదల చేసింది. ఇక సునామీలు సంభవిస్తే వందలాది భవనాలు కూలిపోయే అవకాశం ఉందని.. 1.81 ట్రిలియన్ డాలర్ల మేర నష్టం వాటిల్లవచ్చని

## మధురవాడలో ప్రేమోన్మాది ఘాతుకం

- యువతిపై దాడి, అడ్డొచ్చిన తల్లి హత్య!
- విశాఖపట్నం జిల్లా మధురవాడ పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణ ఘటన
- శ్రీకాకుళం బూర్జ వద్ద అదుపులోకి నిందితుడు



2


**విశాఖపట్నం-నవభూమిబ్యూరో:** విశాఖపట్నం జిల్లా మధురవాడ పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణ ఘటన చోటు చేసుకుంది. స్వయంకృషి నగర్ లో ఒక యువతి పైన, ఆమె తల్లి పైన ఒక ఉన్మాది ఘాతుకానికి పాల్పడ్డాడు. ప్రేమ పేరుతో యువతిపైన దాడి చేసిన వ్యక్తి అడ్డొచ్చిన తల్లిని కూడా హతమార్చాడు. మధురవాడలో గత కొంతకాలంగా నవీన్ అనే వ్యక్తి దీపిక అనే యువతిని ప్రేమిస్తున్నానని వేధింపులకు పాల్పడుతున్నాడు. అయితే దీపిక నవీన్ ప్రేమను నిరాకరించింది. ప్రేమ పేరుతో యువతిపైన, ఆమె తల్లిపైన దాడి దీంతో ఈరోజు మధ్యాహ్నం దీపిక ఇంటికి నేరుగా వెళ్లిన నవీన్ ఆమెపైన దాడికి పాల్పడ్డాడు. దీపిక పైన, ఆమె తల్లి పైన విచక్షణ రహితంగా కత్తితో దాడి చేశాడు. దీపిక గొంతు కట్ చేసిన నవీన్, ఈ దాడిలో అడ్డొచ్చిన యువతి తల్లి లక్ష్మి పైన కూడా దాడి చేశాడు. దీంతో ప్రేమోన్మాది దాడిలో యువతి తల్లి లక్ష్మి మృతి

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
2 హైదరాబాద్ గురువారం 03 ၊ ఏప్రిల్ ၊ 2025



# మెట్రో ప్రయాణికులకు గుడ్ న్యూస్..

**హైదరాబాద్-నవభూమి:**హైదరాబాద్ లాంటి మహానగరాల్లో ప్రయాణికుల రాకపోకలు భారీగా ఉంటాయి. 24 గంటలు పాటు మేల్కొని ఉండే ఇలాంటి సిటీల్లో రాత్రిపూట కనీసం 12 గంటల వరకైనా ప్రయాణ సేవలు అందుబాటులో ఉండాలని చాలా మంది కోరుకుంటున్నారు. మన భాగ్యనగరంలో తక్కువ కాలంలోనే పాపులర్‌గా మారిన మెట్రో రైలు సర్వీసులు విషయంలోనూ అనేక మంది ప్రయాణికులు రాత్రి 12 గంటల వరకు సేవలు సేవలు అందుబాటులో ఉండాలని కోరుతున్నారు. ఎట్టకేలకు అది నెరవేరింది. ప్యాసింజర్లకు అదిరిపోయే గుడ్‌న్యూస్ చెప్పింది హైదరాబాద్ మెట్రో.కొత్త టైమింగ్స్ ఇవే..మెట్రో రైల్ సమయం పొడిగించారు. పెరుగుతున్న ప్రయాణికుల సంఖ్యను దృష్టిలో పెట్టుకొని మెట్రో రైల్ సమయాన్ని పొడిగించారు హైదరాబాద్ మెట్రో అధికారులు. మారిన టైమింగ్స్ ప్రకారం.. ఇక మీదట సోమవారం నుంచి శుక్రవారం వరకు.. ఆయా టెర్మినల్ స్టేషన్స్ నుంచి ఉదయం 6 గంటలకు మొదటి మెట్రో రైలు ప్రారంభం అవుతుంది. అప్పటి నుంచి రాత్రి 11 గంటల 45 నిమిషాల దాకా రైళ్ల రాకపోకలు సాగిస్తాయి. శనివారం నాడు ఆయా టెర్మినల్ మెట్రో స్టేషన్ నుంచి ఉదయం 6 గంటలకు తొలి మెట్రో స్టార్ట్ అవుతుంది. రాత్రి 11 గంటల వరకు రైళ్ల సేవలు అందుబాటులో ఉంటాయి. ఇక నుంచి ఆదివారం నాడు ఉదయం 7 గంటలకు ఆయా టెర్మినల్ స్టేషన్ నుంచి ఫస్ట్ మెట్రో రైలు మొదలవుతుంది. సండే కూడా రాత్రి 11 గంటల వరకే రైళ్ల రాకపోకలు ఉంటాయి.



## ఎల్ఆర్ఎస్ రాయితీ గడువు పొడిగింపు..



**హైదరాబాద్-నవభూమి:**తెలంగాణ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. లేఅవుట్ల క్రమబద్ధీకరణ పథకం(ఎల్ఆర్ఎస్) రాయితీ గడువును పొడిగించింది. ఏప్రిల్ 30 వరకు అవకాశం కల్పించింది. గత నాలుగేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ప్లాట్లకు రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు ప్రజలకు ప్రభుత్వం అవకాశం కల్పిస్తూ ఎల్ఆర్ఎస్ క్రమబద్ధీకరణకు అవకాశం కల్పించింది ప్రభుత్వం. మొదట మార్చి 31వ తేదీ వరకు అవకాశం కల్పించింది. ఆ లోపు ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లించిన వారికి 25 శాతం మేర రాయితీ ప్రకటించారు. అయితే ఈ గడువు ముగిసింది. కొత్త ఆర్థిక సంవత్సరం కూడా మొదలైంది. ఈ నేపథ్యంలో ఏప్రిల్ నెలాఖరు వరకు పొడిగిస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేసింది.అయితే రాయితీపై ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లించేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించినా ఆశించినంత మేర రిజిస్ట్రేషన్లు జరగలేదు. ప్రజల నుంచి ప్రభుత్వం అనుకున్న మేర స్పందన కూడా రాలేదు. దీనిలో భాగంగానే.. మరో సారి ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లించేందుకు గడువును పొడిగించింది.

ఇప్పటి వరకు 4 లక్షల మంది దరఖాస్తుదారులు రూ.1200 కోట్ల వరకు ఫీజు చెల్లించారు. పథకం అమలు తర్వాత కొన్ని సాంకేతిక సమస్యలు కూడా ఎదురయ్యాయి. దీనిని అధికారులు పరిష్కరించేలోపే గడువు తేదీ సమీపించింది. దీంతో వరుసగా ఉగాది, రంజాన్ పండుగల నేపథ్యంలో చివరి రెండు రోజులు కార్యకలాపాలు సాగలేదు. ఈ నేపథ్యంలో గడువు పొడిగించాలని ప్రజల నుంచి వినతులు వెల్లువెత్తడంతో.. వీటిని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం ఓటీఎస్‌ను మరో నెల రోజులు పొడిగించింది.

ఆర్థిక సంవత్సరం చివరి రోజున కూడా..

2024-25 ఆర్థిక సంవత్సరం చివరి రోజున అంటే మార్చి 31న 43,700 మంది ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల ఫీజు చెల్లించారు. ఆ ఒక్క రోజే ఫీజు కింద దాదాపు రూ.124 కోట్ల మేర ఆదాయం వచ్చినట్లు అధికారాలు తెలిపారు. అయితే ఈ గడువు పొడిగిస్తూ ప్రభుత్వం నేడు నిర్ణయం తీసుకోగా.. ఏప్రిల్ 1వ తేదీన కూడా ఎల్ఆర్ఎస్ కింద ఫీజు చెల్లించిన దరఖాస్తుదారులకు 25 శాతం రాయితీని వర్తింపజేశారు.

## సన్నబియ్యం కోసం సందెవేళలోనూ..



**హైదరాబాద్-నవభూమి:** గ్రేటర్ శివారు జిల్లాల రేషన్ షాపుల్లో సన్నబియ్యం పంపిణీ మొదలైంది. తొలిరోజు కావడంతో మంగళవారం ఉదయం 8 గంటల నుంచే రేషన్‌షాపుల వద్ద భారీ సంఖ్యలో లబ్ధిదారులు క్యూలలో నిల్చున్నారు. సన్న బియ్యం కోసం సందెవేళలోనూ బారులు తీరారు. ఎలక్షన్ కోడ్ నేపథ్యంలో హైదరాబాద్ జిల్లాలో మాత్రం సన్నబియ్యం పంపిణీ జరగలేదు. నగర శివారు ప్రాంతాలైన కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి, ఉప్పల్, ఎల్బీనగర్, రాజేంద్రనగర్ వంటి శివారు పట్టణ ప్రాంతంలోని రేషన్‌షాపుల వద్ద సన్నబియ్యం తీసుకునేందుకు రేషన్ కార్డుదారులు బారులు తీరారు. ఉదయం 8 నుంచి 12 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 8 గంటల వరకు రేషన్ షాపుల్లో సన్న బియ్యం పంపిణీ చేశారు.

## మరోసారి సిట్ విచారణకు శ్రవణ్ రావు

**హైదరాబాద్-నవభూమి:**తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులోదర్యాప్తు కొనసాగుతోంది. జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌కు శ్రవణ్ రావు వెళ్లారు. సిట్ విచారణకు హాజరయ్యారు. ఇప్పటికే శ్రవణ్‌రావును ఆరున్నర గంటల పాటు పోలీసులు విచారించారు. ఈరోజు మరోసారి ఆయనను పోలీసులు ప్రశ్నించనున్నారు. గత శనివారం శ్రవణ్‌రావును సిట్ బృందం సుదీర్ఘంగా విచారించింది. ఆరున్నరగంటల పాటు విచారించిన సిట్.. శ్రవణ్ రావు నుంచి కొంత సమాచారాన్ని రాబట్టింది. అయితే ఆరోజు పోలీసుల విచారణకు శ్రవణ్ రావు సహకరించకపోవడం, పోలీసులు అడగిన ప్రశ్నలకు దాటవేత ధోరణి అవలంభించడంతో మరోసారి విచారించాలని సిట్ బృందం భావించింది. అందులో భాగంగానే మరోసారి నోటీసులు జారీ చేసింది. ఈ క్రమంలో కాసేపటి క్రితమే సిట్ విచారణకు శ్రవణ్ రావు హాజరయ్యారు.కాగా.. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో శ్రవణ్ రావు చాలా కీలకంగా వ్యవహరించారని సిట్ బృందం భావిస్తోంది. ఫోన్ ట్యాపింగ్ కేసులో ఇప్పటి వరకు ఆరుగురు నిందితులు ఉండగా.. అందులో ఐదుగురు పోలీస్ డిపార్ట్‌మెంట్‌కు చెందిన వారే. కేవలం శ్రవణ్ రావు మాత్రమే ప్రైవేటు వ్యక్తి. అయితే పోలీసుశాఖ వ్యక్తులతో శ్రవణ్ రావు కుమక్కై ఏ విధంగా ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం నడిపించారనే దానిపై సిట్ బృందం ఫోకస్ చేసింది. కొంతమంది కాంటాక్ట్ లిస్టును శ్రవణ్ రావు సీఐబీ అధికారులకు ఇచ్చినట్లు తెలుస్తోంది. అయితే ఎవరు ఈ కాంటాక్ట్ నెంబర్స్‌ను సమకూర్చారు, రాజకీయ నాయకులకు సంబంధించిన కాంటాక్ట్ వివరాలతో పాటు వారి సంభాషణలు వినాలని ఎవరు శ్రవణ్‌కు సూచించారు అనే అంశాలపైనే సిట్ బృందం ప్రధానంగా దృష్టి సారించింది. శాసనసభ ఎన్నికలకు ముందు సీఎం రేవంత్ రెడ్డికి చెందిన బంధువుల ఫోన్ నెంబర్లు సేకరించి.. వారి ఫోన్లపై కూడా నిఘా ఉంచినట్లు తెలుస్తోంది.అలాగే ఫోన్ ట్యాపింగ్ చేసేందుకు ప్రత్యేకంగా పరికరాలను తీసుకొచ్చి, వాటిని వివిధ ప్రాంతాల్లో సర్వర్ రూంలుగా ఏర్పాటు చేసి అక్కడి నుంచి ఫోన్ ట్యాపింగ్ వ్యవహారమంతా నడిపించారు. శ్రవణ్ రావుకు ఓ మీడియా సంస్థ ఉంది. ఆ మీడియా సంస్థ కార్యాలయంలోనే ప్రత్యేకంగా సర్వర్ రూంలను ఏర్పాటు చేసి.. అక్కడి నుంచే ఈ వ్యవహారాన్ని నడిపారు. ఈ వ్యవహారంలో శ్రవణ్ రావుకు ప్రణీత్ రావు సహకరించారు. ప్రణీత్ రావు నేతృత్వంలోనే శ్రవణ్‌రావుకు చెందిన కార్యాలయాల్లో ఫోన్ ట్యాపింగ్ పరికరాలను ఏర్పాటు చేసి.. అక్కడి నుంచే ఫోన్ ట్యాపింగ్‌కు తెరలేపారు. అయితే ఫోన్ ట్యాపింగ్ వ్యవహారాన్ని నడిపించినందుకు శ్రవణ్ రావు ఏమైనా ఆర్థికంగా లబ్ధిపొందారా.. ఇదే నిజమైతే ఎవరు ఆయనకు ఆర్థికంగా మద్దతు ఇచ్చారు.. అన్న అంశాలపై సిట్ బృందం విచారించనుంది. గత విచారణలో వీటిపై శ్రవణ్‌ను ప్రశ్నించగా.. సరైన సమాధానాలు చెప్పనట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో మరోసారి శ్రవణ్‌కు నోటీసులు ఇచ్చి విచారణకు పిలిపించిన సిట్.. ఆయన నుంచి పూర్తి సమాచారాన్ని రాబట్టే పనిలో పడ్డారు. ఈరోజు సాయంత్రం వరకు సుదీర్ఘంగా శ్రవణ్‌రావును సిట్ అధికారులు విచారించే అవకాశం ఉంది.

# హైదరాబాద్‌లో బర్డ్ ఫ్లూ కలకలం.. నిర్ధారించిన అధికారులు..!



**హైదరాబాద్-నవభూమి:**తెలుగు రాష్ట్రాలను మొన్నటి వరకు భయపెట్టిన బర్డ్ ఫ్లూ.. మధ్యలో కాస్త గ్యాప్ ఇచ్చినట్టే ఇచ్చి, అందరూ హమ్మయ్యా అని ఊపిరి పీల్చుకునేలోపే.. "నేనున్నానని.. ఎటు పోలేదని.." అంటూ మరోసారి సైలెంట్‌గా రెక్కలు విధిలిస్తోంది. ఏపీలోని పల్నాడు జిల్లా నర్సరావుపేటలో రెండేళ్ల చిన్నారి బర్డ్‌ఫ్లూ సోకి ప్రాణాలు వదిలిన ఘటన అందరినీ ఉలిక్కిపడేలా చేసింది. ఆ ఘటన వెలుగులోకి వచ్చిన గంటల సమయంలోనే.. మరో బాంబు పేల్చారు హైదరాబాద్ అధికారులు. హైదరాబాద్ శివారులోని అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలో బర్డ్ ఫ్లూ కలకలం రేపింది. అబ్దుల్లాపూర్ మెట్ పరిధిలో ఉన్న ఓ పౌల్ట్రీ ఫార్మ్‌లో నాలుగు రోజుల క్రితం వేల సంఖ్యలో కోళ్లు మృత్యువాత పడ్డాయి. దీంతో.. కోళ్ల శాంపిల్స్ సేకరించిన అధికారులు.. ల్యాబ్‌లో పరీక్షలు నిర్వహించగా బర్డ్ ఫ్లూ అని తేలింది. ఈ విషయం బయటికి రావటంతో.. పౌల్ట్రీ యజమానులంతా ఇప్పుడు ఆందోళనలో ఉన్నారు. మరోవైపు.. ఇప్పుడిప్పుడే చికెన్ తింటున్న ప్రజలు.. భయాందోళనలకు గురవుతున్నారు.

**ఏపీలో బర్డ్‌ఫ్లూ తొలి మరణం..**

ఆంధ్రప్రదేశ్‌లో బర్డ్‌ఫ్లూ కారణంగా ఓ చిన్నారి మృతి చెందిన ఘటన తీవ్ర కలకలం రేపింది. పల్నాడు జిల్లా నరసరావుపేటలో రెండేళ్ల బాలిక బర్డ్‌ఫ్లూ వైరస్ బారినపడటంతో మార్చి 16న మృతి చెందింది. బాలిక మరణానికి బర్డ్‌ఫ్లూ కారణమని అధికారికంగా ధృవీకరించింది. ఆంధ్రప్రదేశ్‌లో బర్డ్‌ఫ్లూతో మృతి చెందిన తొలి కేసుగా ఇది నమోదైంది. పచ్చి కోడి మాంసం తినడం, రోగనిరోధక శక్తి తక్కువగా ఉండటం వల్ల బాలిక వైరస్‌కి బలైందని వైద్యులు తెలిపారు. దీంతో.. అప్రమత్తమైన ఏపీ ప్రభుత్వం.. బర్డ్‌ఫ్లూ మరింత వ్యాపించకుండా రాష్ట్ర ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టింది. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ప్రభుత్వం స్పష్టం చేసింది. పచ్చి మాంసం తినడం, రోగపడి చనిపోయిన పక్షులను తాకడం ప్రమాదకరం అని వైద్య నిపుణులు హెచ్చరించారు. అనుమానాస్పద లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని అధికారులు సూచించారు.

బర్డ్‌ఫ్లూ లక్షణాలు.. జాగ్రత్తలు

లక్షణాలు:

జ్వరం, దగ్గు, గొంతు నొప్పి, శ్వాసకోశ ఇబ్బందులు

జాగ్రత్తలు:పచ్చి కోడి మాంసం, ఆహారం సరిగ్గా ఉడికించుకోవాలి.


కోళ్ల ఫార్మ్‌లకు దూరంగా ఉండాలి.

రోగానపడి చనిపోయిన పక్షులను తాకరాదు.

ఎటువంటి అనుమానం వచ్చినా వెంటనే వైద్య పరీక్షలు చేయించుకోవాలి.

ఆగని వైరస్ వ్యాప్తి మరిన్ని జాగ్రత్తలు అవసరం ఈ ఘటన నేపథ్యంలో తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు మరింత అప్రమత్తయ్యాయి. నియంత్రణ చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించాయి. పౌల్ట్రీ పరిశ్రమపై బర్డ్‌ఫ్లూ ప్రభావం పడే అవకాశం ఉన్నప్పటికీ, సరైన నియంత్రణ చర్యలు తీసుకుంటే వైరస్ వ్యాప్తిని అడ్డుకోవచ్చని వైద్య నిపుణులు చెబుతున్నారు.

# వాహనదారులకు గుడ్‌న్యూస్.. డ్రైవింగ్ లైసెన్స్‌లు, ఆర్సీ కార్డుల జారీపై సర్కార్ కీలక నిర్ణయం..!




**హైదరాబాద్-నవభూమి:**తెలంగాణలో వాహనదారులకు గుడ్‌న్యూస్. డ్రైవింగ్ లైసెన్స్‌లు, ఆర్సీ (రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్)ల జారీపై రేవంత్ సర్కార్ కీలక నిర్ణయం తీసుకునేందుకు సిద్ధమైంది. ప్రస్తుతం కార్డుల జారీలో జరుగుతున్న ఆలస్యాన్ని తగ్గించడానికి రవాణా శాఖ కొత్త విధానాన్ని తీసుకురానుంది. మహారాష్ట్రలో అమలవుతున్న కేంద్రీకృత విధానాన్ని తెలంగాణలో ప్రవేశపెట్టడానికి అధికారులు సిద్ధమవుతున్నారు. దీని ద్వారా వాహనదారులకు త్వరగా కార్డులు అందుతాయి. అంతేకాకుండా, ప్రక్రియలో పారదర్శకత కూడా ఉంటుందని రవాణా శాఖ అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం ఉన్న విధానంలో కార్డుల జారీ విధానంలో చాలా ఆలస్యం జరుగుతోందని వాహనదారుల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయి. దీనిని దృష్టిలో ఉంచుకుని రవాణా శాఖ ఈ నిర్ణయం తీసుకుంది. జేటీసీ చంద్రశేఖర్‌గౌడ్ నేతృత్వంలో ఒక బృందం మహారాష్ట్రకు వెళ్లి అక్కడ అమలవుతున్న విధానాన్ని పరిశీలించింది. ఆ తరువాత ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. ప్రభుత్వం ఆ నివేదికను తాజాగా ఆమోదించింది. తెలంగాణ వ్యాప్తంగా 62 ఆర్టీవో కార్యాలయాలు ఉండగా.. ప్రతిరోజు 9 వేల నుంచి 12 వేల వరకు ఆర్సీలు, డ్రైవింగ్ లైసెన్సులు జారీ అవుతుంటాయి. కానీ, అవి వాహనదారులకు సకాలంలో అందడం లేదు. కొన్నిసార్లు రెండు, మూడు నెలలు కూడా పడుతోంది.ఏజెంట్ల ద్వారా వెళ్తే పని త్వరగా అవుతుందని, లేకపోతే కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోందని వాహనదారులు అంటున్నారు. దీనిపై రవాణా శాఖ అధికారులు స్పందించారు. సాంకేతిక కారణాల వల్లనే ఆలస్యం జరుగుతోందని అంటున్నారు. కాట్రిడ్జ్‌లకు ఒకరు, రిబ్బన్‌కు మరొకరు, కార్డుకు ఇంకొకరు.. ఇలా చాలామంది వెండర్లు ఉంటారు. వీటికి వేర్వేరు టెండర్లుంటాయి. ఎవరు ఆలస్యం చేసినా ఆలస్యమవుతుందని అధికారులు చెబుతున్నారు. అయితే, ఏజెంట్లను ఆశ్రయించిన వారికి త్వరగా ఎలా అందుతున్నాయని వాహనదారులు ప్రశ్నిసున్నారు.ప్రస్తుతం మహారాష్ట్రలో కేంద్రీకృత (సెంట్రలైజ్డ్) విధానం అమలవుతోంది. ఒకే కేంద్రం నుంచి కార్డుల ప్రింటింగ్, జారీ వల్ల ఇబ్బందులు వస్తాయన్న ఉద్దేశంతో ముంబయి, ఛత్రపతి సంభాజీనగర్, నాగ్‌పుర్‌లలోని ఆర్టీవో కార్యాలయాల్లో సెంట్రలైజ్డ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. వీటి ద్వారానే రాష్ట్రవ్యాప్తంగా డ్రైవింగ్ లైసెన్స్‌లు, ఆర్సీలు జారీ చేస్తున్నారు. తెలంగాణలో మాత్రం ఒక్క హైదరాబాద్‌లోనే ప్రింటింగ్ చేయాలని తాజాగా రవాణాశాఖ డిసైడ్ అయింది. వారం, పది రోజుల్లో అందుకు సంబంధించిన టెండర్ల ప్రక్రియ ప్రారంభమవుతుందని అధికారులు వెల్లడించారు.

# పాస్టర్ ప్రవీణ్ మృతిపై సీబీఐ విచారణ?

**(1వపేజీ తరువాయి)**అన్ని కోణాల్లోనూ.. పాస్టర్ పగడాల ప్రవీణ్ మృతి ఘటనపై అన్ని కోణాల్లోనూ దర్యాప్తు జరిపిస్తామని చంద్రబాబు, నారా లోకేష్ హామీ ఇచ్చారు. ఈ మేరకు చంద్రబాబు.. డీజీపీ హరీష్ కుమార్ గుప్తాతో ఫోన్‌లో మాట్లాడారని తెలుస్తోంది. సమగ్ర విచారణ జరిపించాలంటూ ఈ సందర్భంగా చంద్రబాబు ఆయనకు ఆదేశించినట్లు చెబుతున్నారు. పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో.. పాస్టర్ పగడాల ప్రవీణ్ హఠాన్మరణం దిగ్భ్రాంతికి గురి చేసిందని మంత్రి లోకేష్ అన్నారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. కుటుంబ సభ్యులకు మంత్రి తన ప్రగాఢ సంతాపం తెలియజేశారు. పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో రోడ్డు ప్రమాదంగా గుర్తించారని అన్నారు. . ప్రముఖ క్రైస్తవ మత ప్రబోధకుడు, ప్రజా శాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ రంగంలోకి దిగారు. హైకోర్టులో ప్రజా ప్రయోజనాల వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. ప్రవీణ పగడాల మృతిపై సమగ్ర విచారణ జరిపించేలా ఆదేశాలు జారీ చేయాలంటూ విజ్ఞప్తి చేశారు. ఈ ఉదంతం మొత్తాన్నీ సీబీఐతో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. దారుణ హత్యగా.. ప్రవీణ పగడాల అనుమానాస్పద మృతిని దారుణ హత్యగా అభివర్ణించారు కేఏ పాల్. దీనిపై ఎనిమిది రోజుల పాటు గడువు ఇచ్చానని, అయినప్పటికీ ప్రభుత్వం నుంచి స్పందన రాకపోవడం వల్ల హైకోర్టును ఆశ్రయించనట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా లక్షలాదిమంది క్రిస్టియన్లు.. ప్రవీణ పగడాల మృతిపై అనేక అనుమానాలను వ్యక్తం చేస్తోన్నారని, విదేశాల్లోనూ దీనిపై చర్చ జరుగుతోందని అన్నారు. దేశ పరువు ప్రతిష్ట సైతం.. ఎవాంజలిస్ట్ పాస్టర్ ప్రవీణ పగడాల అనుమానాస్పద మృతి వెనుక వాస్తవం ఏమిటనే విషయాన్ని తెలుసుకోవాలని ప్రతి క్రైస్తవుడూ కోరుకుంటోన్నారని కేఏ పాల్ చెప్పారు. ఈ ఘటన వల్ల దేశ పరువు ప్రతిష్ట సైతం మంటగలుస్తోందంటూ ఆందోళన వ్యక్తం చేశారు. అది హత్యే.. అది హత్యా లేక ప్రమాదమా అనేది తెలియట్లేదని, తనకు అందిన సమాచారం, ఫొటోలు, వీడియోలు, మృతదేహంపై ఉన్న గాయాలు, మరణించిన తీరును బట్టి చూస్తే అది హత్యేనని కేఏ పాల్ అన్నారు. అది ప్రమాదమే అనడానికి ఉద్దేశించిన ఎలాంటి వీడియోలను కూడా విడుదల చేయడంలో పోలీసులు సైతం విఫలం అయ్యారని చెప్పారు. మద్యం కొనడానికి.. హైదరాబాద్ నుంచి రాజమండ్రిపై బైక్‌పై వెళ్తోన్న ఫొటోలు, వీడియోలు మాత్రమే ఇప్పటివరకు విడుదల అయ్యాయని అన్నారు. మద్యం కొనడానికి ఓ షాప్‌కు వెళ్లారంటూ సోషల్ మీడియాలో సర్కులేట్ అవుతున్న వీడియోలో ఉన్నది తన సోదరుడు కాదంటూ ప్రవీణ్ పగడాల చెల్లెలు స్పష్టం చేశారని గుర్తు చేశారు.

## స్పీకర్‌దే తుది నిర్ణయం


**(1వపేజీ తరువాయి)**రాజ్యాంగ వ్యవస్థ పెత్తనం చేయలేదని వాదనలు వినిపించారు. రోహిత్గీ వాదనల పైన జస్టిస్ గవాయ్ స్పందించారు. సరైన సమయంలో నిర్ణయం తీసుకోవాలని స్పీకర్‌కు చెప్పలేమా అని ప్రశ్నించారు. ఈ మేరకు స్పీకర్ కు విజ్ఞప్తి చేయడం లేదా ఆదేశించడమో చేయలేమా అంటూ వ్యాఖ్యానించారు. దీనిపై రోహత్గీ స్పందిస్తూ ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలని స్పీకర్‌కు ఫిర్యాదు చేసిన వారం లోనే న్యాయస్థానంలో పిటిషన్ వేశారన్నారు. ఒకదాని తర్వాత మరొక రిట్ పిటిషన్లు దాఖలు చేస్తూ వచ్చారని కనీసం పరిశీలించే అవకాశం కూడా లేకుండా పిటిషన్లు వేశారని తెలిపారు. ముకుల్ రోహత్గీ వాదనలపై జస్టిస్ బీఆర్ గవాయ్ జోక్యం చేసుకున్నారు. న్యాయస్థానాలు రాజ్యాంగ పరి రక్షకులుగా వ్యవహరిస్తాయని చెప్పారు. నాలుగేళ్ల పాటు స్పీకర్ పార్టీ మారిన ఎమ్మెల్యేలపై ఎలాం టి చర్యలు తీసుకోకపోతే కోర్టులు చూస్తూ ఉండాలా అంటూ ప్రశ్నించారు. ఫిరాయింపుపై పిటిషనర్ల ఇష్టానుసారం స్పీకర్ వ్యవహరించలేరని రోహత్గీ చెప్పారు. 10 మంది ఎమ్మెల్యేలకు నోటీసులు జారీ చేసి స్పీకర్ తన విధులు నిర్వర్తిస్తున్నారని ఆయన అని కోర్టుకు వివరించారు.

## రాచరికానికి వ్యతిరేకంగా పోరాడిన యోధుడు సర్దార్ పాపన్న

**- పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ**

**శేరిలింగంపల్లి-నవభూమి ప్రతినిధి, ఏప్రిల్ 2:** బహుజన చక్రవర్తి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 315వ వర్ధంతి సందర్భంగా మియాపూర్ డివిజన్ పరిధిలోని ఇంద్రారెడ్డి ఆల్విన్ కాలనీ క్రాస్ రోడ్డు వద్ద గల ఆయన విగ్రహానికి బుధవారం పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఎంబీసీ చైర్మన్ జెరిపేటి జైపాల్, కార్పొరేటర్లు ఉప్పలపాటి శ్రీకాంత్, దొడ్ల వెంకటేష్ గౌడ్, సీనియర్ నాయకులు రెడ్డి రఘునాథ్ రెడ్డి, గౌడ సంఘం నాయకులతో కలిసి పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ సర్దార్ పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా పిఎసి చైర్మన్ గాంధీ మాట్లాడుతూ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జీవితం ఎంతో మందికి స్ఫూర్తిదాయకమని అన్నారు. శతాబ్దాల కిందటే రాచరిక నిరంకుశత్వానికి వ్యతిరేకంగా పేద ప్రజలను సంఘటితం చేసి రాజకీయ, సామాజిక సమానత్వమే మూల సూత్రంగా గోల్కొండ ఏలిన బహుజన చక్రవర్తి సర్వాయి పాపన్న జీవితం అసమానం అని పిఎసి చైర్మన్ గాంధీ కొనియాడారు. ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి గౌడ సంక్షేమ సంఘం అధ్యక్షుడు దొంతి లక్ష్మీనారాయణ గౌడ్, ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్ గౌడ్, కోశాధికారి పుట్ట వినయ్ కుమార్ గౌడ్, యువజన విభాగం అధ్యక్షుడు బాలింగ్ గౌతమ్ గౌడ్, ప్రధాన కార్యదర్శి లీలానంద గౌడ్, కోశాధికారి నిమ్మల ధాత్రినాథ్ గౌడ్, గౌడ సంఘం నాయకులు రాచమల్ల ఓం ప్రకాష్ గౌడ్, పి.అశోక్ గౌడ్, యాదగిరి గౌడ్, కరుణాకర్ గౌడ్, వీరేందర్ గౌడ్, ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, చాంద్ పాషా, తదితరులు పాల్గొన్నారు.





## వక్ఫ్ సవరణ బిల్లుకు లోక్‌సభ ఆమోదం

**(1వపేజీ తరువాయి)**కేంద్ర మంత్రి ప్రసంగ పాఠాన్ని జేపీసీ నివేదికతో పోల్చి చూడాలని సవాల్ చేశారు. అది సరిపోలితే తాను ఈ సభ సభ్యత్వానికి రాజీనామా చేస్తానన్నారు.ఇక కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ఆరోపణలను కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఖండించారు. ముస్లింల మతపరమైన వ్యవహారాల్లో ప్రభుత్వం జోక్యం చేసుకోదని ఆయన స్పష్టం చేశారు. ఓటు బ్యాంకు రాజకీయాల కోసమే కాంగ్రెస్ పార్టీ తప్పుడు ప్రచారం చేస్తోందని ఆయన ఆరోపించారు. వక్ఫ్ బోర్డులో ముస్లిమేతరులకు చోటు లేదని, ముస్లింల ఆస్తులను ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుందనే వాదనల్లో నిజం లేదని ఆయన తేల్చి చెప్పారు.

## జపాన్‌లో భూకంపం

**(1వపేజీ తరువాయి)**అందులో పేర్కొంది. 3 లక్షల వరకు ప్రాణ నష్టం జరిగే ఛాన్సుందని నివేదికలో స్పష్టం చేసింది. లక్షలాది మంది ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాల్సిన అవసరం ఉందని ప్రకటించింది. రిపోర్టు వెలువడిన కొద్ది రోజుల్లోనే భూకంపం చోటు చేసుకోవడం పట్ల సర్వత్రా ఆందోళన వ్యక్తం అవుతోంది. మరి ఈ పరిస్థితుల్లో ఎంత మేర నష్టం జరిగిందో అని చర్చ జరుగుతోంది. మయన్మార్‌లో భూకంప ధాటికి మరణించిన వారి సంఖ్య 1700 దాటింది. వేలాది మంది శిథిలాల కింద చిక్కుకుపోయారు. వారిని రక్షించేందుకు పెద్దఎత్తున సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఇంకా అనేక ప్రాంతాలకు సహాయక బృందాలు చేరలేదని సమాచారం. దీంతో మృతుల సంఖ్య భారీగా ఉండొచ్చని అంచనా వేస్తున్నారు. అలానే థాయ్‌లాండ్ లోనూ 17 మంది మరణించగా.. 32 మంది గాయాలపాలయ్యారు. అయితే భారీ అంతస్తు కుప్పకూలిన ఘటనలో అక్కడ పనిచేస్తున్న 83 మంది ఆచూకీ ఇంకా తెలియలేదని అధికారులు చెబుతున్నారు.

## నిత్యానంద బతికే ఉన్నారు

**(1వపేజీ తరువాయి)**నిత్యానంద సురక్షితంగా, బ్రతికే ఉన్నారు నిత్యానంద నిజంగానే మరణించారని చాలామంది సోషల్ మీడియా వేదికగా పోస్టులు పెడుతున్నారు. ఈ క్రమంలో కైలాస దేశం నుంచి తాజాగా ఒక సంచలన ప్రకటన విడుదలైంది. ఆ ప్రకటనలో నిత్యానంద ఆరోగ్యంగా, సురక్షితంగా, జీవించి, చురుగ్గా ఉన్నారని పేర్కొన్నారు. కొంతమంది దురుద్దేశ పూర్వకంగా స్వామి నిత్యానంద మరణించారన్న వార్తలను ప్రచారం చేస్తున్నారని మీడియా ప్రచారం చేస్తున్న వార్తలను కైలాస దేశం ఖండిస్తోంది అని తెలిపారు. నిత్యానంద మరణ వార్త పుకారు ,మాత్రమే నిత్యానంద ఆరోగ్యంగా ఉన్నారని మార్చి 30 తేదీన ఉగాది ఉత్సవాలలో కూడా ఆయన పాల్గొన్నారని పేర్కొన్నారు. ఇక తమ వాదనను రుజువు చేయడం కోసం ఒక లైవ్ స్ట్రీమ్ లింకును కూడా జత చేశారు. నిత్యానంద ఆరోగ్యంగానే బ్రతికి ఉన్నాడని చెబుతున్న వారు ప్రస్తుతం నిత్యానంద ఎక్కడ ఉన్నారు? ఏం చేస్తున్నారు? అనే వివరాలను మాత్రం వెల్లడించలేదు. ఏది ఏమైనప్పటికీ నిత్యానంద మరణ వార్త కేవలం పుకారు మాత్రమేనని తాజా పరిణామాలతో అర్థమవుతుంది. సొంత దేశం ఏర్పాటు చేసుకున్న నిత్యానంద భారతదేశంలో నిత్యానంద స్వామి పైన ఎన్నో కేసులు ఉన్నాయి. బలత్కారం, అపహరణ ఆరోపణలను ఎదుర్కొన్న నిత్యానంద స్వామి 2019లో భారతదేశం నుంచి పరారయ్యారు. ఆ తర్వాత యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ కైలాస అనే ఒక స్వతంత్ర హిందూ రాష్ట్రాన్ని స్థాపించినట్టు ఆయన ప్రకటించారు. కైలాస దేశానికి ఎవరూ వెళ్ళలేదు ఈ దేశం ఎక్వడార్ సమీపంలో ఒక ద్వీపంలో ఉన్నట్టు పెద్ద ఎత్తున ప్రచారం జరిగినప్పటికీ ఇప్పటివరకు అక్కడకు బయట నుంచి ఎవరు వెళ్లిన దాఖలాలు లేవు. సొంత దేశాన్ని ఏర్పాటు చేసుకుని ఏలుతున్న నిత్యానంద పైన తాజా వార్తల నేపథ్యంలో ఒక్కసారిగా మళ్ళీ నిత్యానంద స్వామిని అందరూ గుర్తు చేసుకుంటున్నారు.

## మధురవాడలో ప్రేమోన్మాది

**(1వపేజీ తరువాయి)**చెందింది. పరారీలో నవీన్ .. పట్టుకున్న పోలీసులు ప్రస్తుతం నవీన్ పరారీలో ఉన్నాడు. శ్రీకాకుళంలో నవీన్ సెల్ ఫోన్ సిగ్నల్ ద్వారా ట్రేస్ చేసిన పోలీసులు, నవీన్‌ను పట్టుకున్నట్లు సమాచారం. నవీన్ ను పట్టుకోవడానికి శ్రీకాకుళానికి ఒక ప్రత్యేకబృందాన్ని పంపించారు. శ్రీకాకుళంలో నిందితుడు బూర్జ మండలంలో అదుపులోకి తీసుకున్నట్టు సిపి బాగ్చి తెలిపారు. అయితే వీరిద్దరి ప్రేమవ్యవహారం ఇరు కుటుంబాలకు తెలుసని పెళ్లి కూడా చేయాలని భావించారని, కానీ అబ్బాయి ప్రవర్తన నచ్చక మళ్లీ విరమించుకున్నారని సీపీ తెలిపారు. దీపికకు ఆస్పత్రిలో చికిత్స, తల్లి మృతి ఇక ఘటనా స్థలానికి వెళ్లి ఆధారాలు సేకరిస్తున్న విశాఖ సిపి ఈ కేసును చాలా సీరియస్ గా తీసుకుని, దర్యాప్తు చేస్తున్నారు. ప్రేమోన్మాది దాడిలో గొంతు కట్ అయిన దీపికను స్థానికులు ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. ప్రేమోన్మాది దాడి ఘటనలో దీపిక తల్లి లక్ష్మీ మృతిచెందగా , యువతి పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. ఇక విశాఖలో ప్రేమోన్మాది దాడి చేసిన ఘటన పైన ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు.

## ప్రియుడికోసం పిల్లలకు

**(1వపేజీ తరువాయి)** వెళ్ళాడు.

తిరిగి రాత్రి 11 గంటలకు ఇంటికి వచ్చి చూడగా ముగ్గురు పిల్లలు మృతి చెంది ఉండటంతో షాక్‌కు గురయ్యాడు. రజిత కడుపు నొప్పి అని నాటకం ఆడటంతో వెంటనే ఆమెను ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టారు. తొలుత భర్త చెన్నయ్యపై అనుమానం వ్యక్తం చేసినప్పటికీ, విచారణలో అసలు నిజం బయటపడింది. రజితనే పిల్లలను చంపిందని పోలీసులు నిర్ధారించారు. ప్రస్తుతం రజిత ప్రియుడిని కూడా అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. దీనిపై పోలీసులు మీడియా సమావేశం నిర్వహించారు. సంగారెడ్డి ఎస్పీ మాట్లాడుతూ... రజిత, ఆమె భర్త చెన్నయ్య మధ్య 20 ఏళ్ల వ్యత్యాసం ఉందని వెల్లడించారు. భర్తతో కలిసి ఉండడానికి ఆమె ఇష్టపడలేదని తెలిపారు. తొలుత పిల్లలను, ఆ తర్వాత భర్త చెన్నయ్యను హత్య చేసేందుకు ప్లాన్ చేసిందని ఎస్పీ వివరించారు. రజితను, శివకుమార్ ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని చెప్పారు.

## ఆదిలాబాద్‌కు విమానాశ్రయం

**(1వపేజీ తరువాయి)**అనుమతులు సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఆరు నెలల వ్యవధిలోనే రెండు విమానాశ్రయాలకు అనుమతులు రావడం తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న అవిశ్రాంత కృషికి దక్కిన విజయమని అన్నారు.

ఈ విమానాశ్రయాన్ని పౌర విమానాలు, ఎయిర్ ఫోర్స్ విమానాల రాకపోకలకు అనుగుణంగా అభివృద్ధి చేయాలని వాయుసేన సూచించినట్లు మంత్రి తెలిపారు. అవసరమైన భూమిని ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియాకు అప్పగించాలని అధికారులు లేఖలో సూచించారని వెల్లడించారు. తెలంగాణలో విమానాశ్రయాల అనుమతుల మంజూరుకు సహకరిస్తున్నందుకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడుకు ఆయన ధన్యవాదాలు తెలియజేశారు.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in




## డివైడర్‌ను ఢీకొట్టి 15 సార్లు పల్టీలు కొట్టిన కారు



**బెంగళూరు-నవభూమి:** వేగంగా వెళ్తున్న కారు డివైడర్‌ను ఢీకొట్టింది. ఆ తర్వాత 15 సార్లు పల్టీలు కొట్టింది. ఒక వ్యక్తి ఆ వాహనం నుంచి గాల్లోకి ఎగిరిపడ్డాడు. ఈ ప్రమాదంలో ముగ్గురు మరణించారు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. కర్ణాటకలోని చిత్రదుర్గ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. మంగళవారం ఉదయం కర్ణాటకలోని యాద్గిర్ జిల్లాకు చెందిన ఒక కుటుంబం బెంగళూరు నుంచి సొంతూరుకు కారులో వెళ్తున్నారు. చిత్రదుర్గ జిల్లాలోని జాతీయ రహదారి 150లో ఆ కారుపై డ్రైవర్ అదుపుకోల్పోయాడు. దీంతో డివైడర్‌ను ఆ వాహనం ఢీకొట్టింది. ఆ వేగం ధాటికి పక్కనున్న లేన్‌పై 15 సార్లు పల్టీలు కొట్టింది. ఆ కారులో ఉన్న వారిలో ఒక వ్యక్తి గాల్లోకి ఎగిరిపడ్డాడు. కాగా, కారును డ్రైవ్ చేసిన 35 ఏళ్ల మౌలా అబ్బుల్, పిల్లెన అతడి ఇద్దరు కుమారులు ఈ ప్రమాదంలో మరణించారు. గాయపడిన మిగతా కుటుంబ సభ్యులను హాస్పిటల్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. పోలీసులు ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మరోవైపు జాతీయ రహదారిలోని సీసీటీవీలో రికార్డైన కారు పల్టీలు కొట్టిన వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.

# అప్పుల బాధతో అవయవాలు అమ్మకానికి పెట్టిన రైతు



**న్యూఢిల్లీ-నవభూమి:** అప్పుసొప్పు చేసి పంటలు పండించాడు. కానీ దురదృష్ట వశాత్తు వాటి వల్ల నష్టాలు ఏర్పడగా అప్పుల పాయ్యాడు. బ్యాంకు రుణాలు సైతం చెల్లించలేక నరకం చూస్తున్నాడు. సర్కారు ఎలాగైనా రుణమాఫీ చేస్తుందని ఆశ పడ్డప్పటికీ.. ప్రభుత్వం స్పందించట్లేదు. దీంతో చేసేదేమీ లేక అప్పులు తీర్చేందుకు అవయవాలను అమ్మకానికి పెట్టేశాడో రైతు. ముఖ్యంగా కిడ్నీని రూ.75 వేలకు, కాలేయాన్ని రూ.90 వేలు, కళ్లను రూ.25 వేలకు అమ్ముతానంటూ మెడలో పోస్టర్ వేసుకుని తిరిగుతున్నాడు. అలాగే తన భార్యా, పిల్లల అవయవాలు సైతం అమ్మక తప్పదని.. అప్పులు తీర్చాలంటే కుటుంబ సభ్యులందరి అవయవాలు అమ్మాల్సిందేనని చెబుతున్నాడు. ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతున్న ఈ వీడియోపై మనమూ ఓ లుక్కేద్దాం పదండి. మహారాష్ట్రలోని వాషిమ్ జిల్లా అదోలి గ్రామానికి చెందిన ఐదోలు సతీష్.. తనకున్న భూమిలోనే పంటలు పండించుకుంటూ భార్య , పిల్లలను చూసుకుంటున్నాడు. అయితే గతేడాది నుంచి బ్యాంకుల్లోంచి రుణాలు తెచ్చుకుని పంటలు పండిస్తున్నాడు. కానీ పలు కారణాల వల్ల అతడికి నష్టాలు వచ్చాయి. దీంతో అప్పులు ఎక్కువ అయ్యాయి. ఎలా తీర్చాలో తెలియక నానా అవస్థలు పడుతున్నాడు. అయితే ప్రభుత్వం రుణమాఫీ చేస్తామని చెప్పగా.. తనకు సాయం అందుతుందని అనుకున్నాడు. కానీ మహారాష్ట్ర సర్కారు ఇప్పటి వరకు రుణమాఫీ చేయలేదు. దీంతో బ్యాంకు అధికారులు అప్పులు చెల్లించాలంటూ ఇంటి మీదకు వస్తున్నారు.

10 లక్షలు కంటే ఎక్కువ ఆదాయం? ఈ ఏం చేయాలో పాలుపోని రైతు సతీష్.. తన అవయవాలు అమ్ముకోవడానికి సిద్ధం అయ్యాడు. ముఖ్యంగా ఓ పోస్టర్‌పై కిడ్నీ రూ.75 వేలు, కాలేయం రూ.90 వేలు, కళ్లు రూ.25 వేలకు అమ్ముతానంటూ రాయించాడు. దాన్ని మెడలో వేసుకుని కలెక్టరేట్ ఎదుట నిరసనకు దిగాడు. తన అప్పుల బాధలు వివరిస్తూనే.. ప్రభుత్వంపై తీవ్ర అసహనం వ్యక్తం చేశాడు. తన అవయవాలు అమ్మకున్నా అప్పులు తీరవని.. అందుకే తన భార్య, పిల్లల అవయవాలు సైతం అమ్ముతానని చెబుతున్నాడు. అయితే తన భార్య కిడ్నీని 40 వేల రూపాయలకు, కుమారుడు కిడ్నీని రూ.20 వేలకు, చిన్న కుమార్తె కిడ్నీని రూ.10 వేలకు అమ్ముతానంటూ వివరిస్తున్నాడు. ఇది చూసిన వారంతా షాక్ అవుతున్నారు. ఎన్నికలకు ముందు మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌యే నేరుగా.. రైతులకు రుణమాఫీలు చేస్తానని ప్రకటించారని సతీష్ గుర్తు చేశాడు. అప్పులపాలైనప్పటికీ ఆ ఆశతోనే తాను బతుకుతున్నానని.. కానీ కాలం గడిచి వడ్డీలు పెరిగి అప్పులు కుప్పలు అవుతున్నా సర్కారు మాత్రం స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశాడు. ఇప్పటికైనా మహాయుతి ప్రభుత్వం స్పందించి.. రైతుల కష్టాలు తీర్చాలని డిమాండ్ చేశాడు. ఈ మేరకు సీఎం దేవేంద్ర ఫడ్నవీస్‌కు ఓ లేఖ రాసి దాన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అందజేశారు. దీంతో అక్కడుకున్న వారంతా సతీష్ నిరసనను వీడియోగా తీసి సోషల్ మీడియాలో పెట్టారు. ప్రస్తుతం ఈ వీడియో నెట్టింట వైరల్‌గా మారింది.

## షిప్‌లో 2,500 కిలోల డ్రగ్స్.. భారత నౌకాదళం స్వాధీనం



**న్యూఢిల్లీ-నవభూమి:** సముద్ర మార్గాల ద్వారా ఓడల్లో అక్రమంగా జరుగుతున్న డ్రగ్స్ రవాణాపై భారత నౌకాదళం దృష్టిసారించింది. అనుమానాస్పద నౌకను తనిఖీ చేసింది. ఒక షిప్ నుంచి 2,500 కిలోల మాదక ద్రవ్యాలను స్వాధీనం చేసుకున్నది. భారత నావికాదళానికి చెందిన ఫ్రంట్‌లైన్ ఫ్రిగేట్ ఐఎన్ఎస్ తార్కాష్ యుద్ధ నౌక ఈ ఆపరేషన్‌లో కీలక పాత్ర పోషించింది. మార్చి 31న పశ్చిమ హిందూ మహాసముద్రంలో కొన్ని నౌకల అనుమానాస్పద కదలికలపై ఇండియన్ నేవీకి సమాచారం అందింది. కాగా, యుద్ధ నౌక ఐఎన్ఎస్ తార్కాష్ ను రంగంలోకి దింపారు. పీ81 సముద్ర నిఘా విమానం, ముంబైలోని మారిటైమ్ ఆపరేషన్స్ సెంటర్‌తో సమన్వయంతో సెర్చ్ ఆపరేషన్ చేపట్టారు. అనుమానాస్పద నౌకను తనిఖీ చేశారు. ఒక షిప్‌ను అడ్డగించారు. తార్కాష్ యుద్ధ నౌకలోని హెలికాప్టర్ ద్వారా మెరైన్ కమాండోలు, స్పెషలిస్ట్ బోర్డింగ్ బృందాలు ఆ షిప్‌లోకి చేరుకున్నారు. దాని సిబ్బందిని ప్రశ్నించారు. మరోవైపు ఆ షిప్‌లోని కార్గో కంపార్ట్‌మెంట్లను మెరైన్ కమాండోలు చెక్ చేశారు. దీంతో 2,386 కిలోల హషీష్, 121 కిలోల హెరాయిన్‌తో సహా 2,500 కిలోల మత్తు పదార్థాలు లభించాయి. ఈ నేపథ్యంలో ఆ ఓడను ఐఎన్ఎస్ తార్కాష్ నియంత్రణలోకి తీసుకువచ్చినట్లు నేవీ అధికారులు తెలిపారు. డ్రగ్స్ అక్రమ రవాణా, ఇలాంటి ఇతర నౌకల గురించి ఆ షిప్ సిబ్బందిని సమగ్రంగా ప్రశ్నిస్తున్నట్లు వెల్లడించారు.

## ఢిల్లీ మెట్రోలో సీటు కోసం చర్చ.. వ్యక్తితో మహిళల వాగ్వాదం..



**న్యూఢిల్లీ-నవభూమి:** పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్‌లో వెళ్తున్నప్పుడు అప్పుడప్పుడు సరదా సంఘటనలు జరుగుతుంటాయి. చిన్నచిన్న కారణాలకే కొందరు గొడవపడుతుంటారు. ముఖ్యంగా ఢిల్లీ మెట్రోలో ఇలాంటి ఘటనలు తరచూ చోటు చేసుకుంటున్నాయి. ఇందుకు సంబంధించిన వీడియోలు ఇప్పటికే అనేకం సోషల్ మీడియాలో వైరల్ అయిన విషయం తెలిసిందే. అసభ్యకర చేష్టలు, ముద్దుసీన్లు, డ్యాన్స్ రీల్స్, ప్రయాణికుల మధ్య ఘర్షణలు వంటి వీడియోలు చర్చకు దారితీశాయి. తాజాగా అలాంటి వీడియోనే మరొకటి ప్రస్తుతం వెలుగులోకి వచ్చింది. సీటు కోసం ఢిల్లీ మెట్రోలో ప్రయాణికుల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ఓ వ్యక్తి, పలువురు మహిళల మధ్య వాగ్వాదం జరిగింది. సదరు వ్యక్తి మహిళలకు సీటు నిరాకరించడంతో చర్చకు దారితీసింది. పదేపదే రిక్వెస్ట్ చేసినప్పటికీ ఆ వ్యక్తి తన సీటును వదులుకోలేదు. దీంతో ఆ వ్యక్తిని రైలు కోచ్‌లోని మహిళలు నిలదీశారు. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం వైరల్ అవుతోంది.

## 10 రోజుల పాటు డిజిటల్ అరెస్టు.. రూ.3.4 కోట్లు కోల్పోయిన రిటైర్డ్ కల్నల్ దంపతులు



**చండీఘడ్-నవభూమి:** డిజిటల్ అరెస్టు వల్ల రిటైర్డ్ కల్నల్ దంపతులు భారీగా మోసపోయారు. ఆదా చేసుకున్న సుమారు రూ.3.4 కోట్ల డబ్బును కోల్పోయారు. పది రోజుల పాటు మోసగాళ్లు ఆ దంపతుల్ని డిజిటల్ అరెస్టు చేసి ఆ మొత్తాన్ని కాజేశారు. వివరాల్లోకి వెళ్తే.. 82 ఏళ్ల రిటైర్డ్ కల్నల్ దలీప్ సింగ్, ఆయన భార్య రవీందర్ కౌర్ బాజ్వాతో కలిసి చండీఘడ్‌లోని సెక్టార్ 2బిలో నివాసం ఉంటున్నారు. అయితే ఈడీ అధికారులమంటూ మోసగాళ్లు ఆ వృద్ధ జంటను మోసం చేశారు. తొలుత వాళ్లు వాట్సాప్ వీడియో కాల్స్ చేసి బెదిరించారు. ఆ తర్వాత కోర్టు నోటీసులు ఇచ్చి భయానికి గురి చేసినట్లు తెలిసింది. చండీఘడ్ సైబర్ సెల్‌లో ఆ వృద్ధ జంట ఫిర్యాదు చేసింది. ఈడీ అధికారులమని తమ వద్ద సేవింగ్స్ రూపంలో ఉన్న సుమారు 3.4 కోట్ల డబ్బును సైబర్ మోసగాళ్లు కాజేసినట్లు దంపతులు ఫిర్యాదులో పేర్కొన్నారు. భారతీయ న్యాయ సంహిత చట్టం కింద కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపడుతున్నారు. మార్చి 18వ తేదీన సింగ్‌కు గుర్తు తెలియని నెంబర్ నుంచి వాట్సాప్ కాల్ వచ్చింది. ముంబైలోని కెనరా బ్యాంక్‌లో ఉన్న అకౌంట్‌లో మనీ ల్యాండరింగ్ లింకు ఉన్నట్లు ఆ కాలర్ సింగ్‌ను బెదిరించారు. జెట్ ఎయిర్‌వేస్ ఓనర్ నరేశ్ గోయల్‌కు మనీ ల్యాండరింగ్ చేసినట్లు సైబర్ నేరగాళ్లు ఆరోపించారు. ముంబైలో దలీప్ సింగ్ బజ్వా పేరుతో అకౌంట్ ఉన్నట్లు ఆయన భార్యకు నేరగాళ్లు ఫోన్ చేశారు. భర్త పేరుతో ఉన్న ఓ కార్డును కూడా చూపించారు. ఆ సమయంలో అన్ని కరెక్టుగా ఉన్నట్లు అనిపించిందని కౌర్ పోలీసులకు తెలిపింది. సింగ్ పేరుతో ఉన్న కార్డును చూపించి. 5 వేల కోట్ల ఫ్రాడ్‌తో కనెక్షన్ ఉన్నట్లు బెదిరించారని కౌర్ పేర్కొన్నది. ఆ స్కామ్‌లో 24 మంది బాధితులు ఉన్నట్లు కూడా కొన్ని ఫోటోలు షేర్ చేశారని చెప్పిందామె. మార్చి 18 నుంచి 27వ తేదీ వరకు సైబర్ నేరగాళ్లు ఆ వృద్ధ దంపతుల్ని డిజిట్ అరెస్టు చేశారు. ఫోన్లు ఎప్పటికీ ఆన్‌లో పెట్టుకోవాలని ఆ జంటను నేరగాళ్లు హెచ్చరించారు. ఎవర్నీ కాంటాక్టు కావొద్దన్నారు. విషయం బయటకు తెలిస్తే అరెస్టు చేస్తామని బెదిరించారు. సుప్రీంకోర్టు లెటర్ ప్యాడ్‌తో ఉన్న లేఖల్ని కొన్ని చూపించారు. అయితే తీవ్ర వత్తిడికి లోనైన ఆ జంట.. తమ అకౌంట్లలో దాచుకున్న 3.4 కోట్లను సైబర్ నేరగాళ్లకు చెందిన వివిధ అకౌంట్లకు ట్రాన్స్‌ఫర్ చేశారు. తొలుత 8 లక్షలు కట్టాలని దలీప్ సింగ్‌ను బెదిరించారు. ఆ తర్వాత 60, 80, 88 లక్షలు డిమాండ్ చేశారు. ఫిక్స్‌డ్ డిపాజిట్లను క్యాష్‌గా మార్చేందుకు దలీప్ సింగ్ బ్యాంక్‌కు వెళ్లిన సమయంలో.. సైబర్ నేరగాళ్లు అతని భార్యను త్వరగా డబ్బు ఆర్గనైజ్ చేయాలని బెదిరించారు. అయితే తన కుమారుడి స్నేహితుడిని కాంటాక్ట్ అయిన సమయంలో డిజిటల్ అరెస్టు గురించి తనకు తెలిసినట్లు సింగ్ చెప్పాడు. డిజిటల్ అరెస్టు గురించి తెలుసుకున్న దలీప్ సింగ్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. దలీప్ సింగ్ తన ఇద్దరు కుమారుల్ని కోల్పోయారు. ప్రస్తుతం వారితో కోడలు, మనవరాళ్లు ఉంటున్నారు. యువకుడిగా దేశ సేవకే జీవితాన్ని అంకితం చేశానని, వృద్ధాప్యంలో సైబర్ నేరగాళ్ల మోసానికి దాచుకున్న డబ్బు కోల్పోయినట్లు బాధపడ్డారు. సైబర్ సెల్ తనకు సొమ్ము ఇప్పిస్తుందన్న నమ్మకాన్ని వ్యక్తం చేశారు. సైబర్ నేరగాళ్లను పట్టుకునే సామర్థ్యం పోలీసుల వద్ద ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## ప్రభుత్వాసుపత్రుల్లో జన్మించిన ఆడ పిల్లలకు గుడ్‌న్యూస్



**న్యూఢిల్లీ-నవభూమి:** ముంబయిలోని ప్రముఖ పుణ్యక్షేత్రం అయిన సిద్ధి వినాయక ఆలయ వార్షిక ఆదాయం రూ.133 కోట్లకు చేరుకుని రికార్డు సాధించింది. ఇప్పటి వరకు ఇంత పెద్ద మొత్తంలో ఎప్పుడూ ఆదాయం లభించలేదు. ఇదే తొలిసారి కావడంతో సిద్ధి వియనాక ఆలయ నిర్వాహకులు ఓ అద్భుతమైన నిర్ణయం తీసుకున్నారు. ముంబయిలోని ప్రభుత్వాసుపత్రుల్లో పుట్టిన ఆడ పిల్లల కోసం ఎఫ్డీ పథకాన్ని తీసుకు వచ్చేందుకు ప్లాన్ చేస్తున్నారు. ముఖ్యంగా ఒక్కో బాలికకు రూ.10 వేలు ఇస్తూ.. ఆ డబ్బును వారి తల్లుల ఖాతాల్లో ఫిక్స్ డిపాజిట్ చేయబోతున్నట్లు వెల్లడించారు. ఆ పూర్తి వివరాలు మీకోసం. ముంబయి సిద్ధి వినాయక ఆలయ ట్రస్ట్ 2024-25 ఆర్థిక సంవత్సరానికి రికార్డు స్థాయిలో రూ.133 కోట్ల వార్షిక ఆదాయన్ని నమోదు చేసింది. గత ఆర్థిక సంవత్సరంలో రూ.114 కోట్లు మాత్రమే రాగా.. ఈసారి 14 శాతం పెరిగిందని కార్యనిర్వాహక అధికారి వీణా పాటిల్ తెలిపారు. అయితే ట్రస్ట్ ఛైర్మన్ సదానంద్ సర్వాంకర్ నేతృత్వంలోని మేనేజింగ్ కమిటీ.. మార్చి 31వ తేదీన ఆలయ వార్షిక బడ్జెట్‌ను సమర్పించింది. ఆలయంలో మరియు ఆన్‌లైన్ ద్వారా వచ్చిన విరాళాలు, పూజా ఆచారాలు, ప్రసదాల అమ్మకం ద్వారా దీన్ని అంచనా వేస్తారు. అయితే ఇలా వచ్చిన డబ్బును ట్రస్ట్ సంక్షేమ కార్యకలపాలాకు మళ్లిస్తుంటారు. అయితే ఆలయంలో క్యూ లైన్లను వేగంగా ముందుకు పంపించడం వల్లే ఇంత పెద్ద మొత్తంలో ఆదాయం లభించిందని సిద్ధి వినాయక ఆలయ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సందీప్ రాథోడ్ తెలిపారు. దీని వల్లే ఎక్కువ మొత్తంలో భక్తులు స్వామి వారిని సందర్శించుకుని... కానుకలు సమర్పించారన్నారు. ఇదే పద్ధతిని పాటిస్తూ వచ్చే ఆర్థిక సంవత్సరంలో ఆలయ ఆదాయాన్ని రూ.154 కోట్లకు పెంచుతామన్నారు. అయితే ఈసారి ఎక్కువ మొత్తంలో ఆదాయం లభించగా.. దాన్ని ఆడపిల్లల సంక్షేం కోసం వినియోగిస్తామని చెప్పారు. ముఖ్యంగా సిద్ధివినాయక ఆలయ ట్రస్ట్.. భాగ్య లక్ష్మీ పథకాన్ని రూపొందించిందని రాథోడ్ తెలిపారు. దీని ఆమోదం కోసం రాష్ట్ర ప్రభుత్వానికి పంపామని చెప్పారు. ఈ ప్రతిపాదన ప్రకారం మార్చి 8వ తేదీ అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజు ప్రభుత్వ ఆసుపత్రుల్లో జన్మించిన ప్రతీ అమ్మాయికి ట్రస్ట్ రూ.10,000 ఫిక్స్ డిపాజిట్ చేస్తుందన్నారు. అయితే ఈ డబ్బులను ఆడ పిల్లల తల్లుల ఖాతాల్లో జమ చేస్తామని చెప్పారు. ఆలయ ట్రస్టులు ఇలాంటి ప్రయత్నం చేయడం ఇదే తొలిసారి అని.. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన బేటీ బచావో బేటీ పడావో నినాదాన్ని మరింత ముందుకు తీసుకెళ్తుందని అన్నారు.

## సర్కార్ సంచలన నిర్ణయం.. చెత్తపై పన్ను, ఏడాదికి ఎంతంటే?



**న్యూఢిల్లీ-నవభూమి:** అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన 6 గ్యారెంటీలను అమలు చేసేందుకు కర్ణాటకలోని సిద్ధరామయ్య నేతృత్వంలోని కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అష్టకష్టాలు పడుతోంది. హామీలను అమలు చేసేందుకు రాష్ట్ర ఖజానాలో డబ్బు లేకపోవడంతో.. నిధుల సేకరణకు ప్రజలపై పన్నుపోటు వేస్తోంది. ఇప్పటికే ఆర్టీసీ బస్సు ఛార్జీలు, మెట్రో ఛార్జీలు, వాహనాల రిజిస్ట్రేషన్ ధరలు.. పాలు, పెరుగు ధరలు.. విద్యుత్ ఛార్జీల పెంపు, వాటర్ ఛార్జీల పెంపు, స్టాంప్ డ్యూటీ, ఎక్సైజ్ డ్యూటీ, ఔట్ పేషంట్ ఫీజులు, పోస్ట్ మార్టమ్ ఎగ్జామినేషన్ ఛార్జీలు, మెడికల్ సర్టిఫికెట్ ఫీజులను పెంచింది. ఇప్పటికే ఇవన్నీ ఛార్జీల పెంపుతో కర్ణాటక ప్రజలపై భారం మోపిన సిద్ధరామయ్య ప్రభుత్వం.. తాజాగా కొత్తగా చెత్త సేకరణపైనా గార్బేజ్ సెస్‌ను విధించింది. బెంగళూరు నగరంలో వ్యర్థాల నిర్వహణ కోసం బృహత్ బెంగళూరు మహానగర పాలిక -బీబీఎంపీ.. ఈ చెత్త సెస్‌ను వసూలు చేయాలని నిర్ణయించింది. వ్యర్థాల సేకరణ కోసం ఏప్రిల్ 1వ తేదీ నుంచి యూజర్ ఛార్జీలను వసూలు చేయనున్నట్టు బీబీఎంపీ వెల్లడించింది. భవనం విస్తీర్ణం ఆధారంగా ఈ యూజర్ ఛార్జీలను నిర్ణయించింది. 600 చదరపు అడుగులలోపు విస్తీర్ణం ఉన్న నివాస భవనాలకు ప్రతి ఇంటి నుంచి నెలకు రూ.10 (ఏడాదికి రూ.120) యూజర్ ఛార్జీలుగా వసూలు చేయనున్నారు. అదే విధంగా 4 వేల చదరపు అడుగులు, అంతకన్నా ఎక్కువ విస్తీర్ణం గల భవనాలకు ప్రతి ఇంటికి నెలకు రూ.400 (ఏడాదికి 4,800) యూజర్ ఛార్జీలు వసూలు చేయనున్నట్లు తెలిపారు. మరోవైపు.. వాణిజ్య భవనాలకు కేజీకి రూ.12 చొప్పున తీసుకోనున్నారు. సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్- ఎస్‌డబ్ల్యూఎమ్ ఫీజు పేరుతో ఈ చెత్త పన్నును కర్ణాటక ప్రభుత్వం వసూలు చేస్తోంది. బెంగళూరు నగరంలోని చెత్తను సేకరించి.. మరింత మెరుగ్గా డిస్పోజ్ చేసేందుకు ఈ పన్నును అమల్లోకి తీసుకువచ్చామని బీబీఎంపీ అధికారులు వెల్లడించారు. ఈ చెత్త పన్నుతో బీబీఎంపీకి రూ.685 కోట్ల ఆదాయం సమకూరనుందని తెలిపారు. ఇక ఈ చెత్త పన్నుపై ప్రతిపక్షాలు తీవ్ర స్థాయిలో మండిపడుతున్నాయి. రాష్ట్రంలో అన్ని ఛార్జీలను పెంచుతూ ప్రజల రక్తం తాగుతున్న సిద్ధరామయ్య సర్కార్ ధరల పెంపు దయ్యం లాగా మారిందని కేంద్రమంత్రి, జేడీఎస్ నేత హెచ్‌డీ కుమారస్వామి తీవ్రంగా విమర్శించారు. ప్రస్తుత కాంగ్రెస్ పార్టీ పాలన గతంలో దేశాన్ని పాలించిన బ్రిటీష్ ఈస్టిండియా కంపెనీ తరహాలో ఉందని ఆరోపించారు.

## శాంతి చర్చలపై మావోయిస్టులు కీలక ప్రకటన.. కేంద్రానికి ఆఫర్



**న్యూఢిల్లీ-నవభూమి:** గతేడాది కాలంగా భద్రతా బలగాల వరుస దాడులతో మావోయిస్ట్ దళాలు భారీగా అనుచరులను కోల్పోతున్నాయి. భద్రతా బలగాల మెరుపు ఎన్‌కౌంటర్‌లతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఈ క్రమంలో మావోయిస్టులు శాంతి చర్చలపై కీలక ప్రకటన చేశారు. ప్రజాప్రయోజనాల కోసం తాము శాంతి చర్చలకు సిద్ధమేనని ప్రకటించారు. ఇందుకోసం అనుకూల వాతావరణం సృష్టించాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ విషయంలో సానుకూలంగా స్పందించాలి. ఛత్తీస్‌గఢ్, ఒడిశా, ఝూర?ండ్, మధ్యప్రదేశ్, తెలంగాణలో హత్యాకాండను ఆపాలని వారు డిమాండ్ చేశారు. అక్కడ జరుగుతోన్న మారణకాండను ఆపేయాలని పేర్కొన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చర్చలకు సిద్ధమైతే తాము కాల్పుల విరమణకు అంగీకరిస్తామని వెల్లడించారు. ఈ మేరకు మావోయిస్ట్ కేంద్ర కమిటీ అధికార ప్రతినిధి అభయ్ పేరుతో ఓ లేఖను విడుదలైంది. కాగా, ఈ ఏడాది మూడు నెలల్లోనే వేర్వేరు ఎన్‌కౌంటర్లలో 130 మందికిపైగా మావోయిస్టులు మృతిచెందారు. ఒక్క బస్తర్ ప్రాంతం (బిజపుర సహా ఏడు జిల్లాలు)లోనే 116 మంది చనిపోయారు. గతవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో 30 మంది వరకూ ప్రాణాలు కోల్పోయారు. వామపక్ష తీవ్రవాదాన్ని అంతం చేస్తామని శపథం చేసిన కేంద్రం.. ఇందుకోసం ఆపరేషన్ కగార్ చేపట్టింది. గతేడాది సార్వత్రిక ఎన్నికల తర్వాత ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్ట్ స్థావరాలను లక్ష్యంగా చేసుకుని.. జరుపుతోన్న దాడుల్లో పదుల సంఖ్యలో మావోయిస్టులు మృతిచెందారు. ఇదిలా ఉండగా, కేంద్ర హోం మంత్రి అమిత్ షా మాట్లాడుతూ... నక్సల్స్ రహిత భారత్ కోసం మోదీ ప్రభుత్వం కృషి చేస్తోంది అని అన్నారు. నక్సలిజంపై కఠినంగా వ్యవహరిస్తూ, అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని ఆయన తెలిపారు. దీనివల్ల దేశంలో వామపక్ష తీవ్రవాదం ఉన్న జిల్లాల సంఖ్య 12 నుంచి 6కు తగ్గిందని ఆయన చెప్పారు. 2026 మార్చి 31 నాటికి నక్సలిజాన్ని పూర్తిగా నిర్మూలించాలని భారత్ లక్ష్యంగా పెట్టుకుందని చెప్పారు.

“దేశంలో నక్సల్స్ ప్రభావం ఉన్న జిల్లాలు 38 ఉన్నాయి... వీటిలో 12 జిల్లాలు గతంలో తీవ్రంగా ప్రభావితమయ్యాయి.. ఇప్పుడు ఆ సంఖ్య 6కు చేరింది’ని హోంశాఖ తెలిపింది. ఈ 38 జిల్లాల్లో ఆంధ్రప్రదేశ్‌లోని అల్లూరి సీతారామ రాజు, తెలంగాణలోని భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలు కూడా ఉన్నాయి. ప్రభుత్వం తీసుకున్న చర్యల వల్ల తెలంగాణలోని ములుగు జిల్లాలో వామపక్ష తీవ్రవాదం తగ్గిందని అధికారులు తెలిపారు.

నక్సలిజం ఎక్కువగా ఉన్న జిల్లాల్లో అభివృద్ధి పనుల కోసం కేంద్రం నిధులు మంజూరు చేస్తోంది. తీవ్రత ఎక్కువగా ఉన్న జిల్లాలకు రూ.30 కోట్లు, ఆందోళనకర జిల్లాలకు రూ.10 కోట్లు ఇచ్చింది. ఈ నిధులను కేంద్రం ప్రత్యేక సహాయంగా అందించింది అని హోం శాఖ తెలిపింది.

## నియంత్రణ రేఖ దాటిన పాకిస్థాన్ ఆర్మీ.. ఫైరింగ్‌ను తిప్పికొట్టిన భారత బలగాలు



**న్యూఢిల్లీ-నవభూమి:** కశ్మీర్‌లోని నియంత్రణ రేఖవద్ద పాకిస్థాన్ ఆర్మీ హద్దులు దాటింది. పూంచ్ జిల్లాలో పాక్ ఆర్మీ ఈ దుశ్చర్యకు పాల్పడింది. కాల్పులు జరిపిన పాక్ ఆర్మీ చర్యలను భారత్ తిప్పికొట్టింది. ఏప్రిల్ ఒకటో తేదీన కృష్ణ ఘాటీ సెక్టార్ వద్ద పాక్ ఆర్మీ నియంత్రణ రేఖ దాటడం వల్ల మైన్ బ్లాస్ట్ అయినట్లు భారతీయ సైనిక బలగాలు వెల్లడించాయి. ఈ ఘటన తర్వాత ఫైరింగ్ జరిగిందని, పాకిస్థాన్ ఆర్మీ కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించిందని భారతీయ ఆర్మీ పేర్కొన్నది. భారతీయ బలగాలు సమర్థవంతంగా ఆ ఫైరింగ్‌ను తిప్పికొట్టినట్లు ఆర్మీ వెల్లడించింది. ప్రస్తుతం అక్కడ పరిస్థితి అదుపులో ఉందని, నిశితంగా ఆ ప్రాంతాన్ని పరిశీలిస్తున్నట్లు ఆర్మీ వర్గాలు తెలిపాయి. పాక్ ఆర్మీ కాల్పుల్లో ఎవరూ గాయపడలేదని భారతీయ ఆర్మీ చెప్పింది. లైన్ ఆఫ్ కంట్రోల్ వద్ద శాంతి, సామరస్యాన్ని మెంటేన్ చేయాల్సిన అంశాన్ని డీజీ మిలిటరీ ఆపరేషన్స్‌కు గుర్తు చేసినట్లు భారతీయ ఆర్మీ తెలిపింది. 2021 మీటింగ్‌లో ఇరు వైపుల డీజీ మిలిటరీ ఆపరేషన్స్.. శాంతి స్థాపన కోసం పలు అంశాలను అంగీకరించారని, నియంత్రణ రేఖ వద్ద కాల్పుల విరమణకు కూడా ఒప్పందం కుదుర్చుకున్నట్లు ఆర్మీ గుర్తు చేసింది.

## మరోసారి దేశవిభజన కానీయం: అనురాగ్ ఠాకూర్



**న్యూఢిల్లీ-నవభూమి:** వక్ఫ్ సవరణ బిల్లు 2024 కేవలం ఒక బిల్లు కాదని, ఉమ్మీద్ అని, సాధికారత, సామర్థ్యం అభివృద్ధిని ఉద్దేశించినదని బీజేపీ ఎంపీ అనురాగ్ ఠాకూర్ అన్నారు. బిల్లుపై బుధవారంనాడు జరిగిన చర్చలో ఆయన పాల్గొంటూ, దేశ ప్రజలంతా వక్ఫ్ బిల్లుకు మద్దతు తెలుపుతున్నారని అన్నారు. కేథలిక్ బిషప్స్ కాన్ఫరెన్స్ ఆఫ్ ఇండియా, చర్చ్ ఆఫ్ భారత్, కేరళ కౌన్సిల్ ఆఫ్ చర్చెస్, కేరళ కేథలిక్ బిషప్స్ కౌన్సిల్, ఆలిండియా సూఫీ కౌన్సిల్, ముస్లిం రాష్ట్రీయ మంచ్ మద్దతు ప్రకటించాయని తెలిపారు.

కాంగ్రెస్ హయాంలోనే వక్ఫ్ ఏర్పాటైందని, వక్ఫ్ ఏమి చేసినా సరైనదేనని ఆ పార్టీ భావిస్తూ వచ్చిందని, వక్ఫ్ భయాల నుంచి విముక్తి కలిగించేందుకు ఇదే సరైన తరుణమని అన్నారు. వక్ఫ్ ల్యాండ్‌ల్లో అవినీతికి పాల్పడినందు వల్లే వక్ఫ్ బిల్లును కాంగ్రెస్ వ్యతిరేకిస్తోందని ఘాటుగా విమర్శించారు. ఆ పార్టీ బుజ్జగింపు రాజకీయాలకు ఈ సవరణ చట్టం చరమగీతం పాడుతుందన్నారు.

**ఆ తప్పు మళ్లీ జరగనీయం**

మతం ఆధారంగానే 1947లో దేశ విభజన జరిగిందని, మరోసారి మతం పేరుతో దేశ విభజన జరగనీయమని అనురాగ్ ఠాకూర్ అన్నారు. అప్పట్లో దేశవిభజనకు ఒక కుటుంబం, ఒక పార్టీ కారణమైందని విమర్శించారు. ఈ రోజు ‘ల్యాండ్ జీహాద్’ పేరుతో మరోసారి దేశ విభజనను జరగనీయమని అన్నారు. వక్ఫ్ బోర్డు భయాల నుంచి దేశానికి విముక్తి కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.

## ఓట్లతో వ్యాపారం మానుకోవాలి.. విపక్షాలకు రవిశంకర్ ప్రసాద్ చురకలు

**న్యూఢిల్లీ-నవభూమి:** వెనుకబడిన ముస్లిం మహిళలు, ముస్లిం కమ్యూనిటీ స్థితిగతులను మెరుగుపరచాలనే ఉద్దేశంతోనే వక్ఫ్ సవరణ బిల్లు ను తెచ్చామని, వక్ఫ్ బిల్లు రాజ్యాంగ వ్యతిరేకమంటూ విపక్షాల చేస్తున్న వాదనలో అర్థం లేదని బీజేపీ సీనియర్ నేత, ఎంపీ రవిశంకర్ ప్రసాద్ అన్నారు. కేవలం రాజకీయ అనివార్యతల కారణంగానే విపక్షాలు వక్ఫ్ బిల్లును విపక్షాలు వ్యతిరేకిస్తున్నట్టు కనిపిస్తోందన్నారు. బిల్లుపై చర్చలో రవిశంకర్ ప్రసాద్ మాట్లాడుతూ, బిల్లుకు కాంగ్రెస్ సారథ్యంలోని విపక్షం పదపదే అభ్యంతరాలు చెబుతుండటం తనకు ఆశ్చర్యం కలిగిస్తోంది. ముస్లిం కమ్యూనిటీ సంక్షేమం నుంచి ఏ అనివార్యతల కారణంగా వెనక్కి మళ్లారని ప్రశ్నించారు. రవిశంకర్ ప్రసంగంలో ముఖ్యంశాలు..-రాజ్యాంగం రెడ్ కాపీని చేత్తో పట్టుకుని తేవడం ఒక ట్రెండ్‌గా మారింది. కానీ, ఇక్కడే పార్లమెంటులోని “గ్రీన్ కాన్‌స్టిట్యూషన్” బుక్ నా వద్ద ఉంది.-మహిళల సంక్షేమానికి చట్టాలు తీసుకురావచ్చని రాజ్యాంగంలోని ఆర్టికల్ 14 చెబుతోంది. అప్పుడు ఈ బిల్లు రాజ్యాంగ వ్యతిరేకం ఎలా అవుతుంది? ఈ బిల్లు వెనుకబడి ముస్లింల స్థితిని మెరుగుపరేచేందుకు ఉద్దేశించినది.-రాజ్యాంగాన్ని చూపిస్తూ ఆర్గుమెంట్లు చేసే విపక్షాలకు రాజ్యాంగంలో పొందుపరిచిన విషయాలతోనే నేను సమాధానిమిస్తున్నారు.-వక్ఫ్ మతపరమైన సంస్థ కాదు, కేవలం చట్టబద్ధమైన సంస్థ.-దేశవ్యాప్తంగా 8 లక్షలకు పైగా వక్ఫ్ భూములు ఉన్నాయి. ఆ భూముల్లో ఎన్ని స్కూళ్లు, అనాథాశ్రమాలు, నైపుణ్య కేంద్రాలు, ఆసుపత్రులు నిర్మించారు?

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
4 | హైదరాబాద్
గురువారం
03 । ఏప్రిల్ । 2025






## బిల్లులో ఒకే మార్పును కోరనున్న టీడీపీ.. అదేమిటంటే

**న్యూఢిల్లీ-నవభూమి:** వక్ఫ్ సవరణ బిల్లు 2024 పై బుధవారంనాడు లోక్‌సభలో చర్చ మొదలుకావడంతో కొత్తం చట్టం పార్లమెంటులో ఆమోదం పొందుతుందా అనే దానిపైనే అందరి దృష్టి ఉంది. ఎన్డీయేలో కీలక భాగస్వామ్య పక్షాలైన తెలుగుదేశం, జనతాదళ్ (యునైటెడ్) పార్టీలు బిల్లుకు సానుకూలంగా ఉన్నాయి. అయితే ప్రతిపాదిత బిల్లులో చంద్రబాబు నాయుడు సారథ్యంలోని తెలుగుదేశం పార్టీ ఒక మార్పును సూచించే అవకాశం ఉన్నట్టు చెబుతున్నారు.

స్టేట్ వక్ఫ్ బోర్డులలో ముస్లిమేతరులను అనుమతించాలని టీడీపీ కోరనున్నట్టు ఆ పార్టీ వర్గాల సమాచారం. ముస్లిమేతరులకు బోర్డులో ప్రాతినిధ్యం కల్పించడం అనేది రాష్ట్రాల విచక్షణకు వదిలిపెట్టాలని పార్టీ ఏకగ్రీవ డిమాండ్‌గా ఉందని ఆ వర్గాలు తెలిపాయి. ఆ ఒక్క మార్పు మినహాయిస్తే బిల్లులో మహిళల భాగస్వామ్యాన్ని తప్పనిసరి చేయాలనే సవరణతో సహా అన్ని సవరణలకు టీడీపీ సానుకూలంగా ఉంది. వక్ఫ్ బిల్లుపై చర్చ సందర్భంగా పార్టీ ఎంపీలంతా తప్పనిసరిగా సభకు హాజరుకావాలని మూడులైన్ల విప్‌ను కూడా టీడీపీ మంగళవారంనాడు జారీ చేసింది.



## ప్రకృతి విపత్తుల ప్రియధాత్రి మయన్మార్!


ప్రకృతి విపత్తుల ప్రియధాత్రి మయన్మార్! సుస్థిర ప్రజాస్వామ్య పాలనకు నోచుకోలేకపోతున్న దురదృష్ట దేశమది. ఈ రెండు వాస్తవాలూ, మయన్మార్ ప్రజలు ప్రస్తుతం ఎదుర్కొంటున్న దుస్థితికి నిలువెత్తు దర్పణాలు. గత వందేళ్లలో మయన్మార్ 14 భూకంపాలను చవి చూసింది. వాటిలో కొన్ని గత శుక్రవారం నాటి భూ ప్రళయం లాంటివే. మయన్మార్ భౌగోళిక ఉనికి, భూభౌతిక వ్యవస్థ ఆ దేశాన్ని తరచు భూకంపాల తాకిడికి గురిచేస్తుంది. మార్చి 28 నాటి మహా ఉత్పాతం 1956 అనంతరం మయన్మార్‌ను కుదేలు చేసిన భూ కంపాలలో తీవ్రమైనది. భూమాత ఆగ్రహం వందలాది ప్రజల ప్రాణాలను హరించి వేసింది, భౌతిక ఆస్తులను, చారిత్రక కట్టడాలను ధ్వంసం చేసింది. ఆధ్యాత్మిక సంస్కృతికీ తీవ్ర విఘాతం కలిగించింది. భూకంప కేంద్రానికి చేరువలో ఉన్న మాండలే నగరంలో ప్రతి రెండో గృహమూ కూలిపోవడమో లేక తీవ్రంగా దెబ్బతినడమో జరిగింది. రిక్టర్ స్కేల్‌పై 7.7 పాయింట్ల తీవ్రతతో సంభవించిన ఈ భూకంపం పొరుగుదేశం థాయ్‌లాండ్ రాజధాని బ్యాంకాక్‌ను కూడా కుదిపివేసింది. అంతర్యుద్ధంతో అతలాకుతలమవుతూ రెండు కోట్ల మంది ప్రజలు దైనందిన మనుగడకు అంతర్జాతీయ మానవతాపూరిత సహాయ చర్యలపై ఆధారపడి ఉన్న క్లిష్ట సమయంలో మయన్మార్ ఈ పెను భూకంపానికి గురయింది. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ఆంగ్‌సాన్ సూకీ ప్రభుత్వాన్ని నాలుగేళ్ల క్రితం కూల్చివేసి అధికారాన్ని కైవసం చేసుకున్న సైనికాధికారుల దుర్మార్గ పాలనతో మయన్మార్ ఎడతెగని సంక్షోభంలో కొట్టుమిట్టాడుతోంది. సైనిక పాలకులను సాయుధంగా వ్యతిరేకిస్తున్న ప్రజాస్వామ్య శక్తుల అధీనంలోని ప్రాంతాలను స్వాధీనం చేసుకునేందుకు సైనిక పాలకులు నిరంతర యుద్ధం చేస్తున్నారు. గత శుక్రవారం నాడు భూ ప్రళయం సంభవించిన మూడు గంటల వ్యవధిలోనే ప్రతిఘటనా శక్తుల నియంత్రణలోని ప్రాంతాలపై వైమానిక దాడులు నిర్వహించారు. ఆ దాడులు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. గత నాలుగేళ్లుగా సైనిక పాలకుల చేతుల్లో హతమయి సమాధుల్లో ఉన్న వారి ఎముకలు సైతం సైనిక పాలకుల ఈ ప్రస్తుత దుర్మార్గానికి వణికిపోతున్నాయని ఒకరు వ్యాఖ్యానించడం గమనార్హం. తొలుత కోవిడ్ విలయం, ఆ వెన్వెంటనే అంతర్యుద్ధం ప్రారంభమవడంతో మయన్మార్‌లో ప్రతి నలుగురిలో ఒకరు పేదరికంతో కునారిల్లుతున్నారు. దాదాపు నలభై లక్షల మంది అంతర్గత నిర్వాసితులుగా బతుకులు ఈడుస్తున్నారు. ఇటువంటి విపత్కర పరిస్థితిలో మయన్మార్ మరో భూ ప్రళయంతో మాటల్లో వర్ణించలేని దురవస్థల పాలయింది. 1948లో స్వాతంత్ర్యం పొందిన తరువాత అత్యధిక కాలం అధికారంలో ఉన్న సైనిక పాలకులు బయటి ప్రపంచంతో సంబంధాలను నిరాకరించే విచిత్ర వ్యక్తులు. 2008లో కనీసం లక్షన్నర మందిని బలిగొన్న పెను తుపాను సంభవించిన ఆపత్సమయంలో కూడా అంతర్జాతీయ సహాయాన్ని నిరాకరించిన జడబుద్ధులు. అయితే ఈసారి ప్రళయం సంభవించిన వెంటనే అంతర్జాతీయ సహాయాన్ని అంగీకరిస్తామని సైనిక పాలకుడు మిన్ అంగ్ హ్లాయింగ్ ప్రకటించాడంటే పరిస్థితి ఎంత ఘోరంగా, మరెంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఆదేశాలతో మయన్మార్‌లో యుఎస్ ఎయిడ్ కార్యకలాపాలు నిలిచిపోవడంతో సహాయ కార్యక్రమాలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. మయన్మార్‌లో భూకంపం సంభవించిన రోజునే యుఎస్ ఎయిడ్ సంస్థలో ఉద్యోగులు అందరినీ తొలగించనున్నట్టు , ప్రపంచ వ్యాప్తంగా ఆ సహాయ సంస్థ కార్యకలాపాలను నిలిపివేయనున్నట్టు ట్రంప్ ప్రభుత్వం కాంగ్రెస్‌కు చెప్పింది. 2024లో యుఎస్ ఎయిడ్ మయన్మార్‌లో సహాయ సేవలకు 240 మిలియన్ డాలర్లు ఖర్చు చేసింది. ఇది ఆ దురదృష్టకర దేశవాసులకు అందించిన మొత్తం మానవతాపూరిత సహాయంలో మూడోవంతుగా ఉన్నది. అయితే గత జనవరి 20న రెండోసారి అధ్యక్ష పదవీ బాధ్యతలు చేపట్టిన తరువాత మయన్మార్‌లో యుఎస్ ఎయిడ్ సహాయ కార్యక్రమాలు 18 నుంచి 3కు తగ్గిపోయాయి. కొన్ని దేశాల దిగుమతులపై సుంకాల విధింపును నెలరోజుల పాటు వాయిదా వేసిన ట్రంప్ ప్రభుత్వం మయన్మార్‌లోని మానవతా సంక్షోభం దృష్ట్యా కనీసం కొన్ని నెలల పాటు అయినా ఆ దేశంలో తమ సహాయ కార్యక్రమాలను పునరుద్ధరించి ఎందుకు కొనసాగించకూడదు? వాతావరణ మార్పు యుగంలో సంభవిస్తున్న ప్రాకృతిక విపత్తులు మన నైతిక వివేకానికి సవాళ్లు విసరడం లేదూ? సమీప, సుదూర దేశాలలో ఎక్కడైనా ప్రాకృతిక విపత్తులు సంభవించినా అత్యవసర సహాయాన్ని అందించడంలో ముందుండే భారత్ ఇప్పుడు మయన్మార్ విషయంలోనూ అంతే జరూరుగా ప్రతిస్పందించింది. వసుధైవ కుటుంబకం అన్న భారతీయ నాగరికతా ఆదర్శాన్ని ఔదలదాల్చిన న్యూఢిల్లీ 'ఆపరేషన్ బ్రహ్మ' పేరిట భారీ ఎత్తున సహాయ కార్యకలాపాలకు పూనుకున్నది. ఇప్పుడు మయన్మార్ కష్టాల్లోనూ అదే విధంగా వ్యవహరిస్తూ మరింత సమున్నత బాధ్యతను నిర్వర్తించాల్సిన బాధ్యత న్యూఢిల్లీపై ఉన్నది. మయన్మార్‌లో సుస్థిర ప్రజాస్వామ్య పాలన పునరుద్ధరణకు పూనుకోవడమే ఆ కర్తవ్యం. దూరాలు

# ప్రకృతికి కోపం వస్తే!



గత సంవత్సరం డిసెంబర్ 4న ఉదయం 7 గంటల 24 నిమిషాల ప్రాంతంలో భూమి కొన్ని సెకండ్ల మేర కంపించింది. నేనైతే ప్రత్యక్షంగా గమనించాను. చాల తక్కువ స్థాయిలో ప్రకంపించింది. ఏమీ కాలేదు. కానీ ఇటీవలే గత శుక్రవారం మయన్మార్ లో సంభవించిన భారీ భూకంపం తీవ్ర విధ్వంసాన్ని కలిగించింది. దీని తీవ్రత సుమారుగా ఇప్పుడు 334 అణుబాంబుల విధ్వంసంతో సమానమని జియాలజిస్టులు పేర్కొన్నారు. రిక్టర్ స్కేలుపై 7.7 గా నమోదయింది. భూగర్భంలో భారత యురేసియన్ టెక్టానిక్ అంతర భూఫలకాలు ఢీకొనడం వలన మయన్మార్ లో అత్యంత భారీ విధ్వంసం జరిగినట్లు అమెరికన్ జియాలజిస్టులు పేర్కొన్నారు. కొన్ని నెలల పాటు సర్దుబాట్లు కొనసాగునున్న మేర ప్రకంపనులు వస్తూనే ఉంటాయని హెచ్చరించారు కూడా!

సృష్టి (ప్రకృతి) కి కోపం వస్తే పరిస్థితులు ఇలాగే ఉంటాయి. తుఫాన్లు, కార్చిచ్చులు, సునామీలు, భూకంపాలు ఇవన్నీ విద్వాంసాన్ని కలిగిస్తుంటాయి. ఇక మన దేశ విషయంలో... 1962లో తొలిసారి జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా 5 భూకంప జోన్లను గుర్తించింది. అప్పటినుండి భూమి లోపల ఫలకాల కదలికల్లో మార్పులను గమనిస్తూ ఎప్పటికప్పుడు పరిస్థితులను భూభౌతిక శాస్త్రవేత్తలు, భూకంపాల పరిశోధకులు, జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా నిపుణులు గమనిస్తున్నారు. ఈ మేరకు దేశంలో 5 జోన్ ల తదుపరి 6 జోన్లుగా మారనున్నాయి. జోన్-5 లో గల ప్రాంతాలు అత్యంత ప్రమాదకరమైన భూకంపాలు సంభవించే అవకాశాలు ఉంటాయని, జోన్-2 లో అత్యల్ప ప్రభావం చూపే భూకంపాలు సంభవించే అవకాశాలు ఉంటాయని వారు విశ్లేషించారు.



ప్రమాదకర జోన్ 5 లో ఎగువ హిమాలయప్రాంతం, శివాలిక్ ప్రాంతాలు, ఈశాన్య రాష్ట్రాలు, అండమాన్ దీవులు ఉన్నట్లు భూభౌతిక శాస్త్రవేత్తలు అంచనా వేశారు. భూగర్భంలో ఫలకాల కదలికలను సంబంధించిన యాక్సలరేషన్ పైనే భూకంప తీవ్రత ఆధారపడి ఉంటుందని విశ్లేషించారు. ఇక తెలంగాణ రాష్ట్ర విషయంలో ఒక్క భద్రాచలం ఏరియా మినహా, మిగిలిన ప్రాంతాలన్నీ జోన్-2 ఉంటాయి. ఈ ప్రాంతం భూగర్భ ఫలకం కదలిక 0.075 గ్రావిటీ ఉంటుందని కావున పెద్దగా నష్టం ఉండదని భూగర్భ శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు. ఏది ఏమైనా భూకంపాల ప్రభావంతో ఆస్తి, ప్రాణ నష్టాలు కలుగుతుంటాయి.

అసలు భూమి ఎందుకు కంపిస్తుందనే విషయాన్ని క్లుప్తంగా పరిశీలిస్తే, మనం నివసించే భూమి అనేక పొరలతో కప్పబడి నిర్మితమైనది. ఆయా భూపొరల లోతులకు వెళ్లే కొలదీ - పొరల స్వభావం, ఉష్ణోగ్రత, పీడనాలు క్రమంగా మారుతూ పెరుగుతూ ఉంటాయి. భూమి సెంటర్ పాయింట్ వద్ద సుమారు 6000 సెంటీగ్రేడ్ డిగ్రీల వరకు ఉష్ణోగ్రత ఉంటుందని శాస్త్రవేత్తలు అంచనా వేశారు. ఈ విధంగా అత్యధిక



పీడన ఉష్ణోగ్రతల ప్రభావంతో మరికొన్ని ఆయా భౌగోళిక కారణాల వలన కదలికలు మరియు సర్దుబాట్లు చోటు చేసుకుంటాయి. భూపొరల్లో జరిగే ఈ సర్దుబాట్లు అలజడిని సృష్టించడంతో, ఆయా తీవ్రతను బట్టి భూమి కంపిస్తూ, భూకంపాలకు దారితీస్తాయి. భూకంపాల తీవ్రత ప్రభావం మేరకు భూఉపరితలంలో పెద్ద పగుళ్ళు, నెర్రలు కూడా ఏర్పడుతుంటాయి. కొన్ని భవనాలైతే ధ్వంసమవుతూ నేలమట్టమైపోతాయి. భూకంప తీవ్రతను బట్టి నష్టాలు గమనించబడుతుంటాయి. భూకంప తీవ్రతను రిక్టర్ స్కేలులో కొలుస్తారు. ఈ విధానాన్ని సి. ఎఫ్. రిక్టర్ అనే శాస్త్రవేత్త కనుగొన్నారు. ఇక భూకంప తీవ్రత గూర్చి సెస్మోగ్రాఫ్ వివరిస్తుంది. భూకంపాతి తీవ్రత 6 నుండి పైకి ఉంటే దాని తీవ్రత హెచ్చుగా ఉంటూ అధిక నష్టాన్ని కలిగిస్తుంది. తీవ్రత 8 కంటే పైగా ఉంటే అతి ప్రమాదకరమైన భూకంపంగా పేర్కొంటారు. (గతవారం మయన్మార్ లో సంభవించిన భూకంప తీవ్రత 7.7 గా నమోదయింది.)

భూకంపం సంభవించినప్పుడు భూపొరల్లో రెండు రకాల తరంగాలు జనిస్తుంటాయి. అవి ప్రాథమిక, సెకండరీ తరంగాలుగా పేర్కొన్నారు. అయితే, భూ ఉపరితల పొరల గుండా వెళ్లే తరంగాలను తల తరంగాలనీ, వీటి ప్రభావం స్వల్పంగా ఉంటుందనీ, భూ అంతర్గత పొరల్లో భూకంప తీవ్రతను అనుసరించి అతివేగంగా చొచ్చుకుని పోయే తరంగాలను ప్రాథమిక తరంగాలనీ, ఈ ప్రాథమిక తరంగాలు ఎంత వరకు బలంగా వ్యాపిస్తాయో అంత వరకు భూకంప తీవ్రత ఎక్కువగా ఉంటూ, తీవ్ర నష్టాన్ని కలిగిస్తుంటాయి. వీటినే ప్రమాదకర తరంగాలనీ అంటారు. భూకంప తీవ్రత అనేది. ఈ ప్రాథమిక తరంగాల తీవ్రత, ప్రభావాలను అనుసరించే ఉంటుంది. ఇక నెమ్మదిగా ప్రయాణిస్తూ ద్రవ ప్రాంతాలలో క్రమంగా క్షీణిస్తూ ఉండే తరంగాలను సెకండరీ తరంగాలు అంటారు. భూకంప తీవ్రత అనేది మాత్రం ప్రాథమిక తరంగాల స్థాయి, తీవ్రతలపైనే ఆధారపడి ఉంటుంది. ఏది ఏమైనా, ప్రకృతిని పరిరక్షిస్తూ దాని పట్ల శ్రద్ధ కలిగి ఉండటం శ్రేయస్కరం. ప్రకృతే వికటిస్తే తదుపరి పరిస్థితులు కఠినంగా మారుతుంటాయి. భూతాపం పెరుగుదల, పర్యావరణ అసమతుల్యత, ప్రకృతిని పరిరక్షించకపోవడం ఇవన్నీ ప్రతికూల పరిస్థితులకు సంకేతాలు. మనం ప్రకృతిని ప్రేమిస్తే అది మనలను సంరక్షిస్తుంది. సహజ సిద్ధమైన సృష్టిని, ప్రకృతిని కాపాడడం కనీస ధర్మం మరియు కర్తవ్యంగా భావించాలి. సృష్టికే కోపం వస్తే నిలవడం మరియు తట్టుకోవడం కష్టమే మరి!

**డాక్టర్ యం.ప్రభుదయాల్**
**మాజీ సెనేట్ సభ్యుడు - కాకతీయ యూనివర్సిటీ**
**మండల విద్యాశాఖ అధికారి - కొత్తగూడెం**

# ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేయాలి



నేడు దేశంలోని అనేక ప్రతిష్టాత్మక విద్యా సంస్థలలో సగానికి పైగా ప్రొఫెసర్ ఉద్యోగాలుభర్తీకి నోచుకోకపోవడం మూలంగా ఆయా ఉన్నత విద్యా సంస్థలలో విద్యా బోధనకు తీవ్రప్రతిబంధక పరిస్థితులు తలెత్తుతున్నాయి. విద్య, మహిళలు, పిల్లలు, యువత మరియుక్రీడలపై ఏర్పాటు చేసిన పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ఇటీవల పార్లమెంటులో ప్రవేశపెట్టిన'ఉన్నత విద్యా శాఖ 2025 - 26 డిమాండ్స్ ఫర్ గ్రాంట్స్' నివేదిక ఈ విషయాన్ని వెల్లడించింది. భారత ఉన్నత విద్యా సంస్థల్లో ముఖ్యంగా ఇండియన్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్‌టెక్నాలజీ మరియు సెంట్రల్ యూనివర్సిటీల ప్రొఫెసర్ పోస్టులలో ఏకంగా 56.18 శాతంపోస్టులు ఖాళీగా ఉండడాన్ని ఈ నివేదిక వెలుగులోకి తీసుకువచ్చింది. నేడు ప్రఖ్యాతఐఐటిలు మరియు సెంట్రల్ యూనివర్సిటీలు సగానికి పైగా ఖాళీలతో ఈ దుస్థితికి నెట్టివేయబడడం కడు విచారకరం. 2025 జనవరి 31 నాటికి ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐ.ఐ.టి),నేషనల్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్.ఐ.టి ), ఇండియన్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్‌మేనేజ్‌మెంట్ (ఐ.ఐ.ఎమ్), ఇండియన్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్‌రీసెర్చ్ (ఐ.ఐ.ఎస్.ఇ.ఆర్), సెంట్రల్ యూనివర్సిటీలు మరియు ఇతర ఉన్నత విద్యాసంస్థలలో మంజూరు చేయబడిన మొత్తం బోధనా అధ్యాపక పోస్టులలో 28.56




శాతం(18,940) ఖాళీగా ఉన్నాయి అని ఈ నివేదిక స్పష్టంగా వెల్లడించింది. అసిస్టెంట్ ప్రొఫెసర్‌పోస్టులలో 17.97 శాతం ( 11,298 ) ఖాళీగా ఉన్నాయని, అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టులలో38.28 శాతం ( 5,102 ) ఖాళీగా ఉన్నాయని మరియు ప్రొఫెసర్ పోస్టులలో 56.18 శాతం( 2,540 ) ఖాళీగా ఉన్నాయి అని ఈ నివేదిక స్పష్టం చేయడాన్ని గమనించవచ్చు. కేంద్ర విశ్వవిద్యాలయాలలో గణనీయమైన సంఖ్యలో భర్తీ కాని రిజర్వ్ ఫ్యాకల్టీపోస్టులను కూడా ఈ నివేదిక పరిగణనలోకి తీసుకుంది. ఇతర వెనుకబడిన తరగతుల(ఓ.బి. సి) కోసం మంజూరు చేయబడిన 3,652 స్థానాల్లో 1,521 ఖాళీలు, షెడ్యూల్డ్‌కులాలు (ఎస్.సి) కోసం 2,315 స్థానాల్లో 788 స్థానాలు ఖాళీలు మరియు షెడ్యూల్డ్‌తెగలు (ఎస్.టి) కోసం 1,154 స్థానాల్లో 472 స్థానాలు ఖాళీలు ఉన్నాయి అని ఈ నివేదికపేర్కొంది. అదేవిధంగా కేంద్ర విశ్వవిద్యాలయాలలో రిజర్వ్ బోధనేతర సిబ్బంది ఖాళీలనుసైతం ఈ నివేదిక ఎత్తిపట్టింది. ఇతర వెనుకబడిన తరగతుల (ఓ.బి.సి) మంజూరుచేయబడిన 4,495 స్థానాల్లో 1,983 ఖాళీలు, షెడ్యూల్డ్ కులాలు (ఎస్.సి) 2,013 స్థానాల్లో1,011 స్థానాలు ఖాళీలు, షెడ్యూల్డ్ తెగలు (ఎస్.టి) 3,409 స్థానాల్లో 1,491 ఖాళీలుఉన్నాయి అని ఈ నివేదిక వెల్లడించింది. ఉన్నత విద్యా సంస్థలలో ఖాళీలు ఉండటం అనేది అధ్యాపక - విద్యార్థి నిష్పత్తినిప్రభావితం చేయడమే కాకుండా తద్వారా బోధనా నాణ్యతను పలుచన చేస్తుంది' అని ఈనివేదిక వెల్లడించడం గమనార్హం. కాంట్రాక్టు ఉద్యోగాలను దశలవారీగా తొలగించడమేకాకుండా నిర్దేశిత అర్హత కలిగిన అభ్యర్థులను శాశ్వత ఉద్యోగాలలో నియమించటానికిప్రాధాన్యతను ఇవ్వాలి అని నివేదిక వెల్లడించడాన్ని ప్రత్యేకంగా గమనించవచ్చు. విద్యాసంస్థల్లో ఈ ప్రొఫెసర్ పోస్టుల సమస్యను పరిష్కరించటానికి నివేదికలో పలుసూచనలు పొందుపరచబడ్డాయి. ప్రొఫెసర్ పోస్టుల నియామక ప్రక్రియను వేగవంతంచేయాలి అని, అయితే అన్ని నియామక ప్రక్రియలు పారదర్శకంగాను, మెరిట్‌ఆధారితంగాను, సమాన అవకాశాలు కల్పించే విధంగాను మరియు వివక్షత లేని సూత్రాలకు కట్టుబడి ఉండే విధంగాను ఉండాలి అని నివేదిక నొక్కిపట్టి ప్రత్యేకంగాపేర్కొనడం ఆహ్వానించదగ్గ విషయం. ప్రభుత్వ ఉద్యోగాలలో అణగారిన వర్గాలకు ఏమాత్రంరాజ్యాంగ నిబంధనలను అణగదొక్కకూడదు అని నివేదిక నొక్కి చెప్పింది. మొత్తంగానియామక ప్రక్రియల్లో బాహ్య జోక్యాన్ని నివారించడానికి ఆన్‌లైన్ దరఖాస్తులు, స్క్రీనింగ్ మరియు కమ్యూనికేషన్‌ను సులభతరం చేయడానికి సాంకేతికతలను ఉపయోగించాల్సినప్రాముఖ్యతను కూడా ఊటంకించడం గమనార్హం. ఏది ఏమైననూ విద్యాసంస్థలప్రభావవంతమైన పనితీరుకు పూర్తిస్థాయి ఉద్యోగస్వామ్యం కీలకమైన పాత్రని పోషిస్తుందిఅని చెప్పడంలో ఏమాత్రం సందేహం లేదు. అందువలన స్టాండింగ్ కమిటి నివేదించినట్లుప్రామాణిక పద్ధతులను అన్వయిస్తూ త్వరితగతిన ఆయా ఉన్నత విద్యా సంస్థలలో పూర్తిస్థాయిలో ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేయాల్సిన అవసరం తప్పకుండా ఉంది.

**- జె.జె.సి.పి. బాబూరావు**
**రీసెర్చ్ స్కాలర్**
**సెల్: 94933 19690**

## వంశీధరుని కంస విధ్వంసనం

భక్తి



శుకయోగి పరీక్షిత్తుతో... రాజా! సరాముడైన శ్యాముడు ధనుశ్శాలకు వెళ్లి వామహస్తంతో ధనుస్సును పైకెత్తి, అల్లెత్రాడు బిగించి, వేదండం- ఏనుగు ఇక్షుదండాన్ని- చెరకు గడను వలె, రెండుగా విరిచాడు. ఆ ధ్వని వీనులకు భయంకరమై కంసుని ధైర్యాన్ని భేదించింది.

రాజా! సరాముడైన శ్యాముడు ధనుశ్శాలకు వెళ్లి వామహస్తంతో ధనుస్సును పైకెత్తి, అల్లెత్రాడు బిగించి, వేదండం- ఏనుగు ఇక్షుదండాన్ని- చెరకు గడను వలె, రెండుగా విరిచాడు. ఆ ధ్వని వీనులకు భయంకరమై కంసుని ధైర్యాన్ని భేదించింది. మీదికి వచ్చిన చాప రక్షకులను రామకృష్ణులిద్దరూ చెరో వింటి తుంట పట్టుకొని కొట్టి మట్టుబెట్టారు. ఇలా మథురా నగరంలో కడు వేడుకతో విహరించి సోదరులు తమ విడుదులకు విచ్చేశారు. ఈ సందర్భంలో అమాత్యుడు చేసిన సూర్యాస్తమయ చంద్రోదయ వర్ణనలు సహృదయ హృదయాహ్లాదకరంగా, సరసంగా సాగినై. ఇందు- చంద్ర ఉదయానికి ముకుళించు కొన్న ఇందీవరాలను- అరవిందాలను (పద్మాలను) ఎంత హృదయంగమంగా ఉత్ప్రేక్షించి వర్ణించాడో వీక్షించండి%ౌ


ఆ? 'కళలు కలుగుగాక, కమల తోడగుగాక
శివుని మౌళి మీద జేరుగాక
నన్యునొల్ల దపనుడైన మత్పతియని
సాధ్వి భంగి గమల జాతి మొగిడె'.

తాను కళాధరుడు (చంద్రుడు)- కళలు ధరించిన వాడగు గాక, కమలాలయ- లక్ష్మికి తోబుట్టువగు గాక, సెగకంటి (శివుని) శిగ (తల) నెక్కి నిక్కుగాక, ఇంతవాడైనా అన్యుడైన చందురుని పొత్తు మాకు ఎంతమాత్రమూ అక్కర లేదు. తపనుడు- తపింప జేసేవాడైనప్పటికీ మా పతి తరణి- సూర్యుడే అని ఉత్తమురాలైన నాతి- పతివ్రత స్త్రీ వలె పద్మినీ జాతి మూతి ముడుచుకొందిట! ఆటవెలది ఐనా పై పద్యంలో 'సతీధర్మం' చాలా తేటగా- ఇల్లాలికి దీటైన బాటగా అప్రతిహతంగా నిరూపితమైంది. పోతన గావించిన ఇలాంటి వర్ణనలే భావి ప్రబంధ కవులకు 'మేలుబంతి' అయ్యాయి. శుకుడు- రాజా! ఆ రాత్రి క్రూరుడైన భోజపతి కంసునికి ఓజ (శోభ, వికాసం) చెడి నిద్ర పట్టలేదు. దారుణమైన దుశ్శకునాలు చూచాడు. మృతికి హేతువైన భీతితో అతని మతి అతిగా కలత చెందింది. మరునాడు మల్లయుద్ధానికి సిద్ధమైన రంగంలో కంసుడు ఎత్తయిన మంచెపై మనసులో ఇంచుకైనా శాంతి లేకుండా కూర్చున్నాడు. నందాదులు కంసుని అనుజ్ఞతో ఉన్నత ఆసనాలను అలంకరించారు. రామకృష్ణులు రంగస్థలం ప్రవేశ ద్వారం వద్ద వేచి ఉన్న, తొండంతో కొండలను కూడా పిండి చేయగల 'కువలయాపీడమ'నే మత్త వేదండాన్ని- ఏనుగును చూచి సమీపించారు. అంత, మావటి మురభంజను- కృష్ణునిపై ఆ కుంజరాన్ని ఢీ కొలిపాడు. కువలయాపీడం- భూ వలయాన్ని- మానవజాతిని మిక్కిలిగా పీడించే మద, మోహ, దర్పాలకు చక్కని ప్రతీకం. ఈ ప్రసంగంలో కువలయాపీడ పుష్కరి (ఏనుగు)కి, అరిభయంకరుడైన పుష్కరేక్షణుడు హరికి మధ్య జరిగిన దుష్కరమైన పోరుని, వీర, భయానక, అద్భుత రసాలు ముప్పిరిగొనగా విద్యాదయితుడు పోతన హృద్యమైన గద్యలో పద్య పరిమళాన్ని గుబాళింపజేస్తూ వింగడించాడు. యదుసింహుడు ఆ మద కరీంద్రాన్ని తన పద తాడనం చే మర్దించాడు. మదించిన ఆ ఎక్కుడు మెకము (ఏనుగు), మొక్కవోని ముక్కంటి (రుద్రుని) భల్లం (బాణం) చే భగ్నమైన (త్రిపురాసుర) పురంలాగా, బక్కచిక్కి స్రుక్కి- సొమ్మసిల్లి పోయింది. గోవిందుడు చేతితో దాని దంతాలు ఊడబెరికి బాది దాన్ని చంపాడు. చెంతనుండి చూచు వారందరికీ వింత గొలుపగా అనంతుడు ఆ దంతాలతోనే దంతి పాలకులను- మావటులను అంతకుని లోకానికి పంపాడు. ఆపై వల్లవ- గోపకుమారులు రామకృష్ణులు ఉల్లాసంగా మల్ల భూమిని తిలకించారు.



# నవతార

## చిటికెడు ఇంగువ.. పరగడుపున



ఇంగువ ఆహారపు రుచిని పెంచుతుంది. ఇందులో ఉండే ఔషధ గుణాలు అజీర్తి, గ్యాస్, మలబద్ధకం మొదలైన సమస్యల నుంచి ఉపశమనాన్ని ఇస్తాయి. యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ వైరల్, యాంటీ ఇన్ఫ్లమేటరీ గుణాలతో సమృద్ధమైన ఇంగువ నొప్పులను కూడా తగ్గిస్తుంది. పరగడుపునే ఇంగువ తీసుకోవడం వల్ల ఏయే రుగ్మతల నుంచి విముక్తి పొందొచ్చో తెలుసుకుందాం.కడుపు నొప్పి: ఇంగువలో ఉండే ఔషధ గుణాలు కడుపుబ్బరం సమస్యకు విరుగుడుగా పనిచేస్తాయి. చాలాసార్లు కడుపునొప్పికి కారణం గ్యాస్, కడుపుబ్బరం సమస్యలే. కాబట్టి, చిటికెడంత ఇంగువను పరగడుపున తీసుకుంటే ప్రయోజనకరంగా ఉంటుంది.

రక్తపోటు (బీపీ): ఇంగువ శరీరంలో బ్లడ్ క్లాట్స్‌ను నివారిస్తుంది. రక్త సరఫరాను మెరుగుపరుస్తుంది. రోజూ పొద్దునే ఇంగువ కలిపిన నీళ్లు తాగితే రక్తపోటు నియంత్రణలో సహాయకారిగా ఉంటుంది.

తలనొప్పి: పరగడుపునే ఇంగువ తీసుకోవడం వల్ల తలనొప్పి బాధ నుంచి విముక్తి లభిస్తుంది. ఇంగువలో ఉండే యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు తలనొప్పి చికిత్సలో ఉపకరిస్తాయి. కాకపోతే, ఆయుర్వేదం లేదా అలోపతి ఏ విధానంలో అయినా దీన్ని ప్రత్యేక అవసరాల కోసం వాడినప్పుడు డాక్టర్‌ను సంప్రదించిన తర్వాతే తీసుకోవడం మంచిది.

# ఫ్యాషన్ టస్సర్ ట్రెండ్

హుందాగా, విలాసవంతంగా కనిపించాలనుకుంటే టస్సర్ చీరలు కట్టాలి. అన్ని రకాల వేడుకలకూ నప్పే టస్సర్ చీరల సొబగుల గురించి తెలుసుకుందామా?

ప్రత్యేకమైన ఆకృతి, సహజసిద్ధమైన స్వర్ణం మెరుపులను కలిగిన అద్భుతమైన వస్త్రమే టస్సర్. వైల్డ్ సిల్క్‌తో తయారయ్యే టస్సర్ చీరలకు ఎన్నో ప్రత్యేకతలుంటాయి.

వైల్డ్ సిల్క్: యాంథెరీ మాత్‌ల గూళ్ల నుంచి సేకరించిన పట్టుతో వైల్డ్ పట్టును తయారుచేస్తారు. ఈ వైల్డ్ పట్టు పురుగులు మల్బరీ ఆకులు మినహా ఇతరత్రా ఆకులను తింటాయి

టెక్స్చర్: కాస్త గురుకుగా ఉండే ఈ వస్త్రం, సుతిమెత్తని మల్బరీ పట్టుకు భిన్నంగా ఉంటుంది

మెరుపు: ఈ పట్టు సహజసిద్ధ బంగారు మెరుపు కలిగి ఉంటుంది

రంగు: బీజ్, క్రీమ్, గోధుమ రంగుల్లో తయారవుతుంది

డిజైన్: సంప్రదాయ బెంగాలీ టస్సర్ చీరలు, నేత బార్డర్లు, కొంగులను కలిగి ఉంటాయి. అలాగే చీర మొత్తం పూల మోటిఫ్సను కలిగి ఉంటాయి

పేర్లు: టస్సర్ సిల్క్‌నే కోసా సిల్క్ అని కూడా అంటారు ప్రత్యేకతలివే!

సహజ సిద్ధం: ఈ పట్టు తయారీలో సహజరంగులనే ఉపయోగిస్తారు



ఫ మన్నిక: టస్సర్ పట్టు ఎంతో మన్నికైనది. దీనికి ముడతలు, చిరుగులు ఏర్పడవు

ఫ వైవిధ్యం: సాధారణ వేడుకలు మొదలు, పెళ్లిళ్లు, పండగలకు కూడా ఈ చీరలెంతో చక్కగా సూటవుతాయి.









# హైడ్రేటెడ్‌గా ఉంటేనే.. అందం!



వేసవి వేడి.. మీ చర్మం తేమను కోల్పోయేలా చేస్తుంది. చర్మం పొడిబారి.. అందం బీటలు వారుతుంది. అంతేకాదు.. సూర్యుడి హానికరమైన యూవీ కిరణాలు.. చర్మంలో మెలనిన్ ఉత్పత్తిని ప్రేరేపిస్తాయి. తద్వారా చర్మం రంగు మారడంతోపాటు ముఖంపై నల్ల మచ్చలూ ఇబ్బంది పెడుతాయి. వీటినుంచి బయట పడాలంటే.. ఈ జాగ్రత్తలు తీసుకోవాల్సిందే!

చర్మాన్ని హైడ్రేటెడ్‌గా ఉంచుకోవడానికి పుష్కలంగా నీరు తాగాలి. రోజుకు కనీసం 8-10 గ్లాసులైనా తీసుకోవాలి. దీనివల్ల శరీరం నుంచి టాక్సిన్స్ బయటికి వెళ్లిపోతాయి. చర్మం లోపలి నుంచి హైడ్రేటెడ్‌గా మారుతుంది.

నీటిశాతం అధికంగా ఉండే దోసకాయలు, పుచ్చకాయ, నారింజ, స్ట్రాబెర్రీలను ఎక్కువగా తీసుకోండి. ఇవి శరీరాన్ని హైడ్రేట్ చేయడమే కాకుండా.. చర్మానికి అవసరమైన పోషకాలను కూడా అందిస్తాయి.


ఆహారంలో యాంటి ఆక్సిడెంట్స్, విటమిన్ సి ఎక్కువగా ఉండేలా చూసుకోవాలి. ఇవి యూవీ కిరణాల నుంచి చర్మానికి రక్షణ కల్పిస్తాయి. విటమిన్ సి.. శరీరంలో ఫ్రీరాడికల్స్‌తోపాటు మెలనిన్ ఉత్పత్తిని నిరోధిస్తుంది. నల్లమచ్చలు రాకుండా కాపాడుతుంది.

ఇక ఎక్కువ సమయంపాటు ఏసీ గదుల్లో ఉన్నా.. చర్మం పొడిబారుతుంది. ఏసీల నుంచి వచ్చే పొడిగాలి.. చర్మంలో తేమను తొలగిస్తుంది. కాబట్టి, ఇంట్లో, కార్యాలయాల్లో హ్యూమిడిఫయర్స్‌ను ఏర్పాటు చేసుకోవాలి. ఇవి గాలికి తేమను అందించి.. చర్మం ఎక్కువ పొడిగా మారకుండా నిరోధిస్తాయి.

చర్మ సంరక్షణ కోసం కలబంద వంటి హైడ్రేటింగ్ పదార్థాలను కలిగిన మాయిశ్చరైజర్లు వాడాలి. ఇవి చర్మం తేమను కోల్పోకుండా కాపాడతాయి. చర్మాన్ని మృదువుగా మార్చడంలో సహాయపడతాయి.

వేసవిలోనే కాదు.. ఏడాదంతా సన్‌స్క్రీన్ లోషన్ వాడటం మంచిది. ఇది హైపర్‌పిగ్మెంటేషన్‌కు వ్యతిరేకంగా పనిచేస్తుంది. రసాయనాలు తక్కువగా ఉండే ఉత్పత్తులను ఎంచుకోండి. ఇక వేసవిలో ప్రతి రెండుమూడు గంటలకు ఒకసారి సన్‌స్క్రీన్ లోషన్‌ను అప్లయి చేస్తూ ఉండాలి.

# మహిళా ఉద్యోగులకు పట్టం!



మహిళా ఉద్యోగులకు ప్రైవేట్ సెక్టార్ పట్టం కడుతున్నది. గత ఆరేళ్లలో వివిధ రంగాల్లో.. ఆడవాళ్ల భాగస్వామ్యం ఆరు శాతం పెరిగింది. మహిళా నియామకాలు 2019లో 26 శాతం ఉండగా.. 2024లో 32 శాతానికి పెరిగినట్లు టాలెంట్ సొల్యూషన్స్ ప్రొవైడర్ సంస్థ 'కెరీర్‌నెట్' అధ్యయనం తేల్చింది. ఇందుకోసం 2019 నుంచి 2024 క్యాలెండర్ ఇయర్స్‌కు సంబంధించిన 1,80,000 ప్లేస్‌మెంట్ నమూనాలను విశ్లేషించింది. ఈ సందర్భంగా 'దేశంలో మహిళల ఉపాధిస్థితి'కి సంబంధించిన అనేక విషయాలను పంచుకున్నది.

వివిధ రంగాల్లో మహిళల నియామకాలు ఆరు శాతం పెరిగినట్లు తేల్చింది. నగరాల వారీగా చూస్తే.. బెంగళూరు (32%), ఢిల్లీ (28%)తోపాటు హైదరాబాద్ (27%) ముందు వరుసలో నిలిచాయి. అదే సమయంలో టైర్-2 నగరాల్లోనూ మహిళా అభ్యర్థుల నియామకాల్లో స్థిరమైన పెరుగుదల నమోదైంది.

గత మూడేళ్లలో ఈ నగరాల్లో 5 శాతం పెరుగుదల కనిపించింది. వివిధ రంగాల విషయానికి వస్తే.. ఐటీ రంగం 29 %-% 30 శాతంతో స్థిరమైన భాగస్వామ్య రేటును కొనసాగిస్తున్నది. స్టార్టప్స్‌లోనూ.. 2022 నుంచి 2024 వరకు మహిళల భాగస్వామ్యం 9 శాతం పెరిగినట్లు నివేదిక వెల్లడిస్తున్నది. అనుభవాన్ని పరిగణనలోకి తీసుకుంటే.. మహిళల నియామకాల్లో ఫ్రెషర్లే ఆధిపత్యం చలాయిస్తున్నారు.

అయితే, 2023 నుంచి వీరిలోనూ 2 శాతం తగ్గుదల ఉన్నట్లు నివేదిక వెల్లడించింది. 3 నుంచి 12 ఏళ్ల పని అనుభవం ఉన్న మధ్యస్థాయి స్థానాల్లో.. మహిళల నియామకం స్థిరంగా కొనసాగుతున్నది. అదే.. 12 ఏళ్లకుపైగా అనుభవం ఉన్న సీనియర్ స్థాయిలో .. మహిళల నియామకాలు స్వల్పంగా తగ్గాయి. 2024లో 1 శాతం తగ్గి 19 శాతానికి చేరుకున్నాయి.

# డోనట్‌లో తాగేద్దాం!

ఎండకాలం వేడిని తట్టుకోవాలంటే కూలర్లలోనే కాదు, పొట్టలోనూ నీళ్లను దండిగా నింపాల్సిందే. కానీ ఎంత ఎండకాలమైనా మాటిమాటికీ నీళ్లు తాగడం కాస్త కష్టంగానే ఉంటుంది. కానీ ఆ పనిని ఆకర్షణీయంగా మార్చేందుకు సరికొత్త ఆకృతుల్లో వాటర్ బాటిళ్లు మార్కెట్లోకి వస్తున్నాయి. ఆ కోవలోవే ఈ 'డోనట్ షేప్డ్ వాటర్ బాటిళ్లు'. తియ్యగా మనం తినే డోనట్ మధ్యలో రంధ్రం ఉన్నట్టే ఈ బాటిళ్లకు కూడా మధ్యలో ఖాళీ ఉంటుంది.

చూసేందుకు భిన్నంగా పట్టుకోవడానికి వీలుగా ఉంటాయి. కొన్నిటికి ఇలా మధ్యలో రంధ్రం రాకపోయినా చూసేందుకు మాత్రం అచ్చం డోనట్‌లా ఉండి తగిలించుకునేందుకు స్ట్రాప్ ఉండేలా వస్తున్నాయి. వీటిని బయటికి వెళ్లినప్పుడు ఎంచక్కా భుజానికి వేసుకుని వెళ్లొచ్చు. లేదా స్ట్రాప్‌లు తీసేసి ఫ్రిజ్‌లో పెట్టుకోవచ్చు. పిల్లలు కూడా వాడగలిగేలా సిప్పర్ తరహాలో తయారవుతున్నాయివి. కావాలంటే నచ్చిన రంగు, డిజైన్లలో వీటిని చేసిచ్చే కంపెనీలూ ఉన్నాయి. కాబట్టి డోనట్ తినడమే కాదు, ఇప్పుడు డోనట్‌లో ఎంచక్కా తాగేయొచ్చు కూడా!





# అమ్మ వంటను అందలం ఎక్కించింది



అమ్మ పెట్టిన ఆవకాయ ఆల్వేస్ అద్భుతః. అన్నంలో ఎర్రగా కలుపుకొని, లొట్టలేసుకొని తింటే.. ఆ క్షణం స్వర్గంలో ఉన్నట్టుంటుంది. అక్కడికే తృప్తిపడలేదు ఆమె! అమ్మ హస్తవాసితో తన చేతి గీతను దిద్దుకుంది. అమ్మ చేసిన సంప్రదాయ వంటకాలను సామాజిక మాధ్యమాల వారధిగా విదేశాలకు ఎగుమతి చేయడం మొదలుపెట్టింది. మారు మూల పల్లె ఘుమఘుమల్ని అమెరికాలోని తెలుగువాళ్లు ఆఘ్రాణించేలా బ్రాండ్ నెలకొల్పింది. 'ఫ్లేవర్స్ ఆఫ్ తెలుగు' పేరుతో పచ్చళ్లు, పిండివంటలు, పొడులు తయారు చేయించి ఏడాదికి కోటికిపైగా టర్నోవర్ సాధిస్తున్నది. సాఫ్ట్‌వేర్ కొలువును వదిలిపెట్టి.. పచ్చళ్ల వ్యాపారంలో పైపైకి ఎదుగుతున్న చిలువేరు సాహితి నయా జర్నీ ఆమె మాటల్లోనే..

మాది మంచిర్యాల జిల్లా నెన్నెల మండల కేంద్రం. ఆ ఊళ్లోనే నాన్న సత్యనారాయణ కిరాణా షాపు నిర్వహిస్తారు. అమ్మ కన్యాకుమారి గృహిణి. వంటలు చాలా బాగా చేస్తుంది. నన్ను, మా ఇద్దరు అన్నలను వాళ్లు ఎంతో కష్టపడి చదివించారు. మేడ్చల్‌లోని మల్లారెడ్డి కాలేజీలో 2019లో బీటెక్ చేశాను. అదే సంవత్సరం క్యాంపస్ సెలక్షన్స్‌లో టీసీఎస్‌లో జాబ్ వచ్చింది. ఇంట్లో వాళ్లు హ్యాపీ.. నేను కూడా సంతోషపడ్డా. కానీ, ఎంత కష్టపడ్డా మనసుకు ప్రశాంతత ఉండేది కాదు. 2020లో కరోనా సమయంలో ఇంటికి వచ్చినప్పుడు ఖాళీ సమయంలో ఇంట్లో అమ్మ చేసే వంటకాలతో రీల్స్ చేసేదాన్ని. ఓ రోజు అమ్మ పెట్టిన ఆవకాయ రీల్ వైరలైంది. చాలామంది అమ్ముతారా అని అడిగారు. అప్పుడు వచ్చింది ఈ ఆలోచన. వెంటనే కొన్ని పచ్చళ్లు చేసి అడిగిన వారికి పంపించాం. అలా నా స్టార్టప్ జర్నీ మొదలైందన్నమాట.

కానీ, చాలామంది 'పచ్చళ్లు అమ్ముకొని ఏం సాధిస్తారు. మీతో ఇది అయ్యే పనేనా?' అని హేళన చేశారు. ఆ మాటలతో మాలో పట్టుదల ఇంకా పెరిగింది. కేఎఫ్‌సీ చికెన్ ఎక్కడినుంచో వచ్చి మన దగ్గర బిజినెస్ చేస్తున్నది. అలాంటప్పుడు మన తెలుగు సంప్రదాయ వంటకాలకు ప్రపంచవ్యాప్తంగా రీచ్ ఎందుకు ఉండొద్దు అనుకున్నా! అలా అమ్మ చేసిన పచ్చళ్లు, పిండి వంటల వీడియోలు ఇన్‌స్టాలో పోస్టు చేయడం మొదలుపెట్టాను. మాకు వచ్చే ఆర్డర్ల సంఖ్య కూడా పెరిగింది. మాకంటూ ఒక బ్రాండ్ ఉండాలని 2022లో 'ఫ్లేవర్స్ ఆఫ్ తెలుగు' మొదలుపెట్టాం.



**విదేశాల తెలుగువాళ్లే..**


మా వినియోగదారుల్లో సింహభాగం విదేశాలకు చెందినవాళ్లే ఉన్నారు. దేశదేశాల్లో స్థిరపడిన తెలుగువాళ్లు నా ఇన్‌స్టా చూసి ఆర్డర్లు ఇవ్వడం మొదలుపెట్టారు. ఎప్పుడో విదేశాలకు వెళ్లి అక్కడే ఉంటున్నవాళ్ల పేరెంట్స్ ఇప్పుడు వాళ్లకు కావాల్సిన పిండివంటలు, పచ్చళ్లు పంపించే పరిస్థితిలో ఉండరు. అలాంటి వాళ్లంతా ఇప్పుడు 'ఫ్లేవర్స్ ఆఫ్ తెలుగు' బ్రాండ్ యూజర్లుగా మారారు. మంచి ఫీడ్‌బ్యాక్ కూడా ఇస్తున్నారు. మునుపు వేల సంఖ్యలో ఉన్న నా ఇన్‌స్టా హ్యాండిల్ ఫాలోవర్ల సంఖ్య ఇప్పుడు 2.27 లక్షలకు పెరిగింది. మాకు వచ్చే ఆర్డర్లలో ఇన్‌స్టా నుంచి వచ్చేవే ఎక్కువ! ఒక్కసారి మా బ్రాండ్ రుచి చూసినవాళ్లు మళ్లీ మళ్లీ ఆర్డర్ పెడుతున్నారు.

మా అమ్మ చేసినట్టు ఉంద'ని, 'మా నానమ్మను, అమ్మమ్మను గుర్తు చేశార'ంటూ కామెంట్లు చేస్తున్నారు. విదేశాల్లో వాళ్ల స్నేహితులకు సైతం మా ఫ్లేవర్స్ రిఫర్ చేస్తున్నారు. మొదట్లో నెలకు 50 ఆర్డర్లు వచ్చేవి. ఇప్పుడు ప్రతిరోజూ 50కి పైగానే వస్తున్నాయి. అమ్మపెట్టిన ఆవకాయతో మొదలైన మా జర్నీ ఇప్పుడు వంద ప్రొడక్ట్స్‌కు చేరువైంది. పండుగ సమయాల్లో అస్సలు తీరిక ఉండదు. గత సంక్రాంతికి 15 రోజుల్లో దాదాపు 500 కిలోల ఆర్డర్లు డెలివరీ చేశాం. ఇవన్నీ విదేశాలకు ఎగుమతి చేసినవే! యూకే, కెనడా, యూఎస్, జర్మనీ, ఆస్ట్రేలియా, స్విట్జర్లాండ్ ఇలా తెలుగువాళ్లు ఉండే దాదాపు పదికిపైగా దేశాల్లో మా కస్టమర్లు ఉన్నారు.

**పది కుటుంబాలకు ఆసరా..**

ఈ బిజినెస్ స్టార్ట్ చేసినప్పుడు చుట్టూ ఉన్నవాళ్లు ప్రోత్సహించక పోగా, హేళనగా చూశారు. 'ఏసీ కింద కూర్చుని ఉద్యోగం చేసుకోక.. ఈ పిల్లకు ఏమైంది' అనుకున్నారు. కానీ, ఉద్యోగంలో లేనిది, ఈ బిజినెస్‌లో నాకు దొరికింది ప్రశాంతత! ఏడాదికి ఆరు లక్షల ప్యాకేజీ తీసుకున్నా! ఇప్పుడు.. ఆడుతూ, పాడుతూ నెలకు పదిలక్షల రూపాయల వ్యాపారం చేస్తున్నా! ఖర్చులు, జీతాలు పోగా నెలకు దాదాపు 15 శాతం లాభం వస్తున్నది. మా గ్రామానికి చెందిన పదిమంది మహిళలు మా దగ్గర పనిచేస్తున్నారు. వాళ్లు చేసే పనినిబట్టి వేతనాలు ఇస్తున్నా! పది కుటుంబాలకు ఆసరాగా నిలిచానన్న సంతృప్తి కూడా ఉంది. మా దగ్గర ఆవకాయ, నిమ్మకాయ, ఉసిరికాయ, రేగుపండ్ల పచ్చడి ఇలా 20 రకాల పచ్చళ్లు తయారు చేస్తున్నాం. సీజన్‌ను బట్టి పచ్చళ్లు మారుతుంటాయి. అప్పడాలు, వడియాలు అమ్ముతున్నాం. పులిహోర మిక్స్, పల్లికారం, నువ్వుల కారం, మసాలా కారం, ఇతర పొడులు, స్వీట్లు ఇలా వంద రకాల ఉత్పత్తులు తయారుచేస్తున్నాం. వచ్చిన ఆర్డర్‌ను బట్టి అప్పటికప్పుడు పదార్థాలు తయారుచేస్తుంటాం.

మంచిర్యాల డీటీడీసీ కొరియర్ ద్వారా పంపితే.. వాళ్లు డీహెచ్‌ఎల్, యూపీఎస్ ద్వారా విదేశాలకు చేరవేస్తున్నారు. ఇప్పుడు విదేశాలతోపాటు మనదేశంలో వివిధ రాష్ట్రాల నుంచి కూడా ఆర్డర్లు వస్తున్నాయి. సోషల్ మీడియాలోనే మార్కెటింగ్ చేస్తుండటం కారణంగా మాకు కలిసివస్తున్నది. ఇప్పటికైతే నెన్నెలలోనే రెండు గదుల్లో వ్యాపారం నిర్వహిస్తున్నా! రానున్న రోజుల్లో మంచిర్యాలలో పెద్దగా ప్రారంభించాలనే ఆలోచన ఉంది. వినియోగదారుల ఆదరణ లభిస్తే వ్యాపారాన్ని మరింత విస్తరిస్తాం. దానిద్వారా మరింత మందికి ఉపాధి కల్పించవచ్చు కదా!




# లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు.. సెన్సెక్స్ 600 పాయింట్లు



**ముంబై-నవభూమి:**రెండురోజుల తర్వాత దేశీయ స్టాక్ మార్కెట్లు లాభాల్లో ముగిశాయి. బ్యాంకింగ్, ఐటీ స్టాక్స్ రాణించాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్‌తో పాటు మరికొన్ని దేశాలపై సుంకాలు ప్రకటించనున్న నేపథ్యంలోనూ ర్యాలీ కొనసాగడం విశేషం. క్రితం సెషన్‌తో పోలిస్తే సెన్సెక్స్ 76,146.28 పాయింట్ల వద్ద లాభాల్లో మొదలైంది. ఇంట్రాడేలో 76,064.94 పాయింట్ల కనిష్ఠాన్ని తాకిన సెన్సెక్స్.. 76,680.35 పాయింట్ల గరిష్ఠానికి పెరిగింది. చివరకు 592.93 పాయింట్లు పెరిగి 76,617.44 వద్ద ముగిసింది. నిఫ్టీ 166.65 పెరిగి 23,332.35 వద్ద స్థిరపడింది. దాదాపు 2755 షేర్లు లాభపడగా.. 1,048 పతనమయ్యాయి. ట్రంప్ టారిఫ్ ప్లాన్ ప్రకటించ తర్వాత ప్రపంచ వాణిజ్యం మొత్తం మారే అవకాశాలు కనిపిస్తున్నాయి. ట్రంప్ టారిఫ్ ప్లాన్ల రూపురేఖలు ఎలా ఉంటాయో చూడాల్సిందేనని మార్కెట్ నిపుణులు పేర్కొంటున్నారు. మనకు ఇబ్బందికరంగా మారింతే తిరోగమనాన్ని చూడాల్సి వస్తుందని.. ట్రస్ట్ మ్యూచువల్ ఫండ్ సీఈవో సందీప్ బాగ్లా పేర్కొన్నారు. రంగాలవారీగా, నిఫ్టీ ఎఫ్ఎంసీజీ, బ్యాంక్, ఐటీ, ఆటో ఏప్రిల్ షేర్లు ఒకశాతం వరకు పెరిగాయి. హెచ్‌డీఎఫ్‌సీ, ఐసీఐసీఐ బ్యాంక్, ఎస్‌బీఐ ఒకశాతంపైగా పెరిగాయి. నిఫ్టీ ఇన్‌ఫ్రా, మెటల్, ఫార్మా, పీఎస్‌యూ బ్యాంక్ కూడా అదే బాటలో కొనసాగాయి. నిఫ్టీలో టాటా కన్స్యూమర్ ప్రొడక్ట్స్, జొమాటో (ఎటర్నల్), టైటాన్ కంపెనీ, ఇండస్‌ఇండ్ బ్యాంక్, టెక్ మహీంద్రా షేర్లు అత్యధికంగా లాభపడ్డాయి. భారత్ ఎలక్ట్రానిక్స్, అల్ట్రాటెక్ సిమెంట్, పవర్ గ్రిడ్ కార్ప్, నెస్లే, హిందాల్కో షేర్లు నష్టపోయాయి.

## ఆర్‌బీఐ డిప్యూటీ గవర్నర్‌గా పూనమ్ గుప్తా..



**న్యూఢిల్లీ-నవభూమి:**ప్రపంచ బ్యాంక్ మాజీ ఆర్థికవేత్త పూనమ్ గుప్తా ఆర్‌బీఐ డిప్యూటీ గవర్నర్‌గా నియామకమయ్యారు. 2025 ఏప్రిల్ 7-9 మధ్య జరగనున్న ద్రవ్య విధాన కమిటీ సమావేశానికి ఆమెను డిప్యూటీగా గవర్నర్‌గా నియమించింది. ఆర్‌బీఐ ఎంపీసీ సమావేశం ప్రతి రెండునెలలకోసారి జరిగే విషయం తెలిసిందే. పూనమ్ గుప్తా మూడ సంవత్సరాల పాటు ఈ పదవిలో కొనసాగనున్నారు. ఆమె ప్రస్తుతం నేషనల్ కౌన్సిల్ ఆఫ్ అప్లైడ్ ఎకనామిక్ రీసెర్చ్(%చీజూూజు=%) డైరెక్టర్ జనరల్‌గా పనిచేస్తున్నారు. ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలిలో సభ్యురాలిగా, 16వ ఆర్థిక కమిషన్‌కు సలహా మండలి కన్వీనర్‌గా కూడా పనిచేస్తున్నారు. జనవరిలో మైఖేల్ దేబబ్రత పాత్ర రాజీనామా తర్వాత.. ఆర్‌బీఐ డిప్యూటీ గవర్నర్ పదవి ఖాళీగా ఉంటూ వస్తున్నది.ఈ క్రమంలో ఆమె నియామకానికి కేంద్రం ఆమోదం తెలిపింది. బాధ్యతలు స్వీకరించిన తేదీ నుంచి మూడు సంవత్సరాల పాటు పదవిలో కొనసాగుతారని సంబంధిత వర్గాలు తెలిపాయి. ఆమె దాదాపు రెండు దశాబ్దాల పాటు వాషింగ్టన్‌లోని అంతర్జాతీయ ద్రవ్య నిధి, ప్రపంచ బ్యాంకులో సీనియర్ పదవులలో పని చేశారు. 2021లో నేషనల్ కౌన్సిల్ ఆఫ్ అప్లైడ్ ఎకనామిక్స్ రీసెర్చ్‌లో చేరారు. ఢిల్లీ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్, యూనివర్సిటీ ఆఫ్ మేరీల్యాండ్ (%ఖూూ%)లో పాఠాలు బోధించారు. ఢిల్లీలోని ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్‌లో విజిటింగ్ ఫ్యాకల్టీగా సేవలందించారు. పూనమ్ గుప్తా అమెరికాలోని మేరీల్యాండ్ విశ్వవిద్యాలయం నుంచి ఆర్థిక శాస్త్రంలో మాస్టర్స్ డిగ్రీ, పీహెచ్‌డీ, ఢిల్లీ విశ్వవిద్యాలయంలోని ఢిల్లీ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ నుంచి ఆర్థిక శాస్త్రంలో మాస్టర్స్ డిగ్రీని అందుకున్నారు. 1998లో అంతర్జాతీయ ఆర్థిక శాస్త్రంపై పీహెచ్‌డీ చేసినందుకు ఆమె ఎగ్జిమ్ బ్యాంక్ బహుమతికి ఎంపికయ్యారు.

## ఫోర్బ్స్ బిలియనీర్ల జాబితా.. మళ్లీ టాప్ ప్లేస్ ఎలాన్ మస్క్‌దే.. అదానీ, అంబానీలు ఏ స్థానంలో ఉన్నారంటే..?



**న్యూఢిల్లీ-నవభూమి:** ఫోర్బ్స్ బిలియనీర్ల జాబితా 2025 విడుదలైంది. ఈ జాబితాలో ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ మరోసారి తొలిస్థానంలో నిలిచారు. 342 బిలియన్ డాలర్ల నికర విలువతో టాప్ ప్లేస్ దక్కించుకున్నారు. గతేడాదితో పోలిస్తే మస్క్ సంపద 147 బిలియన్ డాలర్లు పెరిగింది. మస్క్ తర్వాత ఫేస్‌బుక్ వ్యవస్థాపకుడు మార్క్ జుకర్‌బర్గ్ రెండో స్థానంలో నిలిచారు. ఆయన నికర విలువ 216 బిలియన్ డాలర్లుగా ఉంది. అమెజాన్ వ్యవస్థాపకుడు జెఫ్ బెజోస్ 215 బిలియన్ డాలర్ల నికర విలువతో మూడో స్థానంలో నిలిచారు.ఇక ఈ జాబితాలో యూఎస్ టాప్‌లో ఉంది. ప్రస్తుతం అమెరికాలో 902 మంది సంపన్నులు ఉన్నారు. ఆ తర్వాత చైనాలో 516 మంది బిలియనీర్లు ఉండగా.. భారత్ 205 మంది బిలియనీర్లతో మూడో స్థానంలో నిలిచింది. ఆసియాలోనే అత్యంత సంపన్నుడు, ప్రముఖ వ్యాపారవేత్త, రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీ 92.5 బిలియన్ డాలర్ల సంపదతో ఈ జాబితాలో 18వ స్థానంలో నిలిచారు. మరో భారతీయుడు గౌతమ్ అదానీ 56.3 బిలియన్ డాలర్ల సంపదతో 28వ స్థానంలో ఉన్నారు. ఇక ఈసారి 288 మంది కొత్త వ్యక్తులు ఫోర్బ్స్ జాబితాలో చేరారు. వీరిలో పలువురు హాలీవుడ్ చిత్ర పరిశ్రమకు చెందిన ప్రముఖులు ఉన్నారు.

## శాంసంగ్ ఏసీల్లో సరికొత్త టెక్నాలజీ..స్మార్ట్ థింగ్స్ కనెక్షన్ సహా అనేక సౌకర్యాలు..

**న్యూఢిల్లీ-నవభూమి:**టెక్ ప్రపంచంలో శాంసంగ్ గట్టి పోటీ ఇస్తోంది. ఎప్పటికప్పుడు కొత్త ఆవిష్కరణలు తీసుకొస్తూ వినియోగదారులను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తుంది. ఈ క్రమంలోనే తాజాగా శాంసంగ్ ఇండియా బెస్పోక్ విండ్‌ఫ్రీ ఎయిర్ కండిషనర్‌లో ఒక వినూత్నమైన ఫీచర్‌ను ప్రారంభించింది. దీని పేరు “కస్టమైజ్డ్ కూలింగ్”. ఇది కూలింగ్ విధానాన్ని సౌకర్యవంతంగా మార్చడానికి, నిద్రను మరింత సులభతరం చేసి, విద్యుత్ వినియోగాన్ని తగ్గించేందుకు సహాయపడుతుంది. ఈ కొత్త ఫీచర్ (స్మార్ట్ వాచ్ లాంటివి) ద్వారా పనిచేస్తుంది. దీంతోపాటు మాన్యువల్ సర్దుబాట్ల అవసరాన్ని కూడా తగ్గించి, స్థిరమైన ఉష్ణోగ్రతను అందిస్తుంది.

**ఏంటి ఈ కస్టమైజ్డ్ కూలింగ్ ఫీచర్?**

ప్రస్తుతం చాలా మంది ఇళ్లలో ఫ్యాన్లను కలిపి ఉపయోగిస్తారు. దీనివల్ల మాన్యువల్ సర్దుబాట్లు చేయడం అవసరం పడుతుంది. అది నిద్రకు అంతరాయాన్ని కలిగిస్తుంది. దీంతోపాటు విద్యుత్ వినియోగాన్ని కూడా పెంచుతుంది. అంతేకాదు 50% మంది భారతీయ వినియోగదారులు రాత్రంతా తమ %ూజ%లను ఆన్, ఆఫ్ చేస్తూ నిద్రపోతుంటారు. ఇది కొన్నిసార్లు నిద్రకు ఇబ్బంది కలిగిస్తుంది. దీంతో ఈ ఫీచర్ ద్వారా సరైన ఉష్ణోగ్రతను కస్టమర్లకు అందించి సౌకర్యవంతమైన నిద్రను ప్రోత్సహిస్తుంది.

ఇది ఎలా పని చేస్తుంది?..ఈ కస్టమైజ్డ్ కూలింగ్ ఫీచర్ ద్వారా వినియోగదారులు తమ స్మార్ట్ హోమ్‌లోని ఫ్యాన్లు, స్విచ్‌లు, ACలను ఒకే సమయంలో సమన్వయం చేసుకోవచ్చు. SmartThings ఆధారిత సాంకేతికతతో, ఏపీఐ, సర్టిఫైడ్ డివైస్లతో కనెక్ట్ చేసి వీటిని ఉపయోగించుకోవచ్చు. ఇవి వినియోగదారులకు తమ గృహంలో ఎలాంటి మాన్యువల్ మార్పుల అవసరం లేకుండా స్థిరమైన ఉష్ణోగ్రతను అందించడంలో సహాయపడతాయి.విద్యుత్ పొదుపు..ఈ ఫీచర్ విద్యుత్ వినియోగాన్ని తగ్గించేందుకు కూడా సహాయపడుతుంది. SmartThings ఎనర్జీ సర్వీస్ ద్వారా, వినియోగదారులు తమ విద్యుత్ వినియోగాన్ని పర్యవేక్షించి, ఇష్టానుసారం మార్చుకోవచ్చు. దీంతో విద్యుత్ బిల్లులలో సంపూర్ణ తగ్గుదల సాధ్యమవుతుంది. ఈ సరికొత్త ఆధారిత కస్టమైజ్డ్ కూలింగ్ ఫీచర్ 2025 బెస్పోక్ విండ్‌ఫ్రీ అందుబాటులో ఉంటుంది. ప్రస్తుతం ఈ ఫీచర్ ఏసీలు ఎప్పుడు మార్కెట్లోకి వస్తాయనే విషయాలను మాత్రం అధికారికంగా ప్రకటించలేదు.

## ఉద్యోగులకు బహుమతులుగా కార్లు, బైకులు.. పని చేస్తే ఇలాంటి కంపెనీల్లోనే చేయాలబ్బా!



**న్యూఢిల్లీ-నవభూమి:**సాధారణంగా ఏ కంపెనీ అయినా పండుగలు, పబ్బాలు, ప్రత్యేక రోజుల్లో బోనస్‌లు ఇవ్వడం, స్వీట్లతో పాటు ఇతర చిన్న చిన్న బహుమతులు ఇవ్వడం గురించి మన అందరికీ తెలిసిందే. కానీ మనం ఇప్పుడు చూడబోయే ఓ కంపెనీ యజమాని మాత్రం తన దగ్గర పని చేసే ఉద్యోగులకు అద్భుతమైన బహుమతులు అందజేశారు. ఉద్యోగులు కలలో కూడా ఊహించని విధంగా.. కార్లు, బైకులు ఇచ్చి సర్‌ప్రైజ్ చేశారు. అవి చూసి షాకైన ఉద్యోగులు.. యజమాని గిఫ్టులకు ఫిదా అయిపోయారు. అసలు అంత ఖరీదైన బహుమతులను యజమాని ఎందుకు ఇచ్చాడు, ఎంత మందికి ఈ గిఫ్టులు దక్కాయో మనం ఇప్పుడు తెలుసుకుందాం.గుజరాత్‌కు చెందిన కాబ్రా జ్యువెల్స్ టర్నోవర్ ఇటీవలే రూ.200 కోట్లకు చేరుకుంది. దీంతో ఈ సంస్థ వ్యవస్థాపకుడు కైలాష్ కాబ్రా తెగ సంబర పడిపోయారు. తనతో పాటు ఎంతగానో కష్టపడి కంపెనీనీ ఈ స్థాయికి చేర్చిన ఉద్యోగులకు.. ఈ సందర్భంగా ఏవైనా బహుమతులు ఇవ్వాలనుకున్నారు. బోనస్‌లు, చిన్న చిన్న బహుమతులు ఇవ్వడం కంటే వారు జీవితాంతం మర్చిపోకుండా ఉండేలా మరోదైనా చేయాలనుకున్నారు. ఈక్రమంలోనే తన వద్ద నమ్మకంగా పని చేస్తున్న వారి లిస్టు తీసుకుని.. ఎవరెవరికి ఏమేం ఇవ్వాలో అని రాసుకున్నారు. ముఖ్యంగా 21 ఏళ్ల వయసులో తాను ఈ జ్యువెల్స్ ప్రారంభించగా.. అప్పటి నుంచి తన వద్దే పని చేస్తున్న 12 మంది సీనియర్ ఉద్యోగులకు కార్లు ఇవ్వాలనుకున్నారు.

**12 మందికి కార్లు.. మిగతా వారికి బైకులు, మొబైల్ ఫోన్లు..**

అలాగే మిగతా వారికి.. వారి వారి అనుభవాలకు తగ్గట్లుగా ఇతర గిఫ్టులను ఇచ్చేందుకు సిద్ధం అయ్యారు. అందులో కొందరికి ద్విచక్ర వాహనాలు, మరికొందరిరి మొబైల్ ఫోన్లు, బంగారు వెండి నాణేలు ఇవ్వాలనుకున్నారు. ఈ విషయాన్ని ఉద్యోగులకు చెప్పకుండానే అన్నీ సిద్ధం చేసుకుని.. ఓరోజు కంపెనీకి వెళ్లారు. అక్కడే వారి వారికి ఇచ్చే బహుమతులను అందజేస్తూ ఉద్యోగులను సర్‌ప్రైజ్ చేశారు. ముఖ్యంగా కార్లలో.. మహీంద్రా %శఖఎ% 700, టయోటో ఇన్నోవా, హ్యుందాయ్ %ఱ%10, హ్యుందాయ్ ఎక్సెంట్లు, మారుతి సుజుకీ ఎర్టిగాలు ఉన్నాయి. ఇలా ప్రతీ ఒక్కరికి బహుమతులు అందజేసిన యజమాని కైలాష్ కాబ్రా.. ప్రశంసా పత్రాలతో పాటు సెలవు ప్యాకేజీలను కూడా ప్రకటించారు.

యజమాని ఇచ్చిన బహుమతులు, సెలవు ప్యాకేజీలతో ఉద్యోగులంతా తెగ మురిసిపోయారు. అనేక మంది యజమానులు.. ఉద్యోగుల కష్టంతో పైకి ఎదిగి చిన్న మొత్తంలో బోనస్‌లు ఇచ్చి చేతులు దులుపుకుంటారని.. కానీ తమ యజమాని మాత్రం లాభాలను కూడా తమకు అందజేస్తూ మంచి మనసు చాటుకున్నారని చెబుతున్నారు. ఇలాంటి బహుమతులు అందుకుంటామని ఎప్పుడూ ఊహించలేదని.. యజమాని చేసిన పనికి చాలా సంతోషంగా ఉన్నామని చెబుతున్నారు. ఉద్యోగమంటూ చేస్తే ఇలాంటి కంపెనీలోనే చేయాలని వివరిస్తున్నారు.మరోవైపు కాబ్రా జ్యువెల్స్ యజమాని కైలాష్ కాబ్రా మాట్లాడుతూ.. రూ.2 కోట్ల రూపాయల టర్నోవర్ నుంచి 200 కోట్ల రూపాయల టర్నోవర్ చేరుకోవడానికి తన ఉద్యోగులే ప్రధాన కారణం అని చెప్పారు. వారి కష్టం వల్ల తన కంపెనీ ఈ స్థాయికి చేరుకుందని అన్నారు. కేవలం 12 మంది ఉద్యోగులతో మొదలైన తన ప్రస్థానం.. 140 మందికి చేరుకుందని చెప్పారు. సంతోష సయమాలతో పాటు కష్ట సమయాల్లో కూడా తన వెన్నంటే ఉన్న ఉద్యోగులకు ఏమిచ్చినా తక్కువేనని.. అందుకే ఇలా ఖరీదైన బహుమతులు ఇచ్చి వారి కష్టానికి ప్రతిఫలం అందజేశానని పేర్కొన్నారు.

## వరుసగా 4వ ఏడు భారతదేశంలో గ్రేట్ ప్లేస్ టు వర్క్‌గా వయాట్రిస్ ధృవీకరణ

VIATRIS

**బెంగళూరు-నవభూమి::** మైలాన్ లేబరేటరీస్ లిమిటెడ్ వరుసగా నాలుగవ సంవత్సరం భారతదేశం లో గ్రేట్ ప్లేస్ టు వర్క్ ధృవీకరణ™ తో గుర్తించబడింది. ఈ గుర్తింపు సమీకృతం చేయడం, పాల్గొనడం, మరియు ఉద్యోగి సంక్షేమం యొక్క సంస్కృతిని ప్రోత్సహించడానికి Viatris యొక్క అచంచలమైన నిబద్ధతను సూచిస్తోంది.

కార్యాలయాల సంస్కృతి, ఉద్యోగుల అనుభవం, మరియు మార్కెట్-ఆధిక్య ఆదాయాన్ని అందించడానికి, ఉద్యోగులను నిలుపుదల చేయడం మరియు పెరిగిన వినూత్నత కోసం నిరూపించబడిన నాయకత్వ ప్రవర్తనలు పై గ్రేట్ ప్లేస్ టు వర్క్ ఒక అంతర్జాతీయ అధికారిక సంస్థ. అంచనాలో భాగంగా, గ్రేట్ ప్లేస్ టు వర్క్ ఇన్‌స్టిట్యూట్ గ్రేట్ ప్లేస్ టు వర్క్ ట్రస్ట్ ఇండెక్స్‌లీ ఎంప్లాయీ సర్వేని ఉపయోగిస్తూ Viatris ఇండియా సహోద్యోగుల యొక్క అభిప్రాయాలను అంచనా వేసింది. సర్వేలో భాగంగా ఉన్న Viatris ఇండియా సహోద్యోగులలో 85% మంది పని చేయడానికి Viatris ఇండియా ను ఒక గొప్ప కార్యాలయంగా తమ అభిప్రాయాలను తెలియచేసారని ఫలితాలు వెల్లడించాయి!

“గ్రేట్ ప్లేస్ టు వర్క్ ధృవీకరణ అనేది మొత్తం ఉద్యోగి అనుభవానికి స్థిరమైన మరియు ఉద్దేశ్యపూర్వకమైన అంకిత భావం అవసరమయ్యే అత్యంత గొప్ప విజయం,” అని సారా లెవీస్-కులిన్, గ్రేట్ ప్లేస్ టు వర్క్ లో గ్లోబల్ రికగ్నిషన్ యొక్క వైస్ ప్రెసిడెంట్ అన్నారు. తమ కంపెనీ సంస్కృతికి సంబంధించి ఉద్యోగులు యొక్క వాస్తవిక సమయం ఫీడ్‌బ్యాక్ ద్వారా సంపాదించబడిన ఏకైక అధికారిక గుర్తింపు అని ఆమె చెప్పారు. “ఈ గుర్తింపును విజయవంతంగా సంపాదించడం ద్వారా, పని చేయడం కోసం Viatris ప్రముఖ కంపెనీలలో ఒకటిగా నిలిచిందని ఇది నిరూపించింది, తమ ఉద్యోగులకు గొప్ప కార్యాలయం వాతావరణాన్ని కేటాయించింది.”

అనుపమ్ భట్, మానవ సంబంధాల విభాగం ప్రధాన అధికారి, Viatris ఇండియా, ఇలా అన్నారు, “వరుసగా నాలుగవ సంవత్సరం కోసం గ్రేట్ ప్లేస్ టు వర్క్ ధృవీకరణను పొందడం మాకు గర్వ కారణంగా నిలిచింది. ఈ విజయం ప్రజలే- ప్రథమం అనే మా యొక్క సిద్ధాంతాన్ని మరియు ఉద్యోగులు తమ కెరీర్ లో అభివృద్ధి చెందడంలో మద్దతు, సామర్థ్యం పొంది, తాము విలువైన వారిగా భావించడానికి మేము చేసిన ప్రయత్నాలను నేరుగా చూపిస్తోంది. మా ఉద్యోగులు వర్థిల్లడంలో సహాయపడటానికి Viatris లో మేము సంక్షేమం, సమీకృతం చెందడం మరియు పురోగతిలో నిరంతరంగా పెట్టుబడి పెట్టాము. ఈ గుర్తింపు మా అంకితభావంతో పని చేసే టీమ్ కు నిదర్శనగా నిలిచింది మరియు ఉద్యోగుల కార్యాలయం అనుభవాన్ని మెరుగుపరచడానికి మా నిబద్ధతను శక్తివంతం చేసింది.”వియాట్రిస్ ఇన్‌కార్పొరేటెడ్ (ఎన్ఏఎస్‌డీఏక్యూ: వీటీఆర్ఎస్) ఒక అంతర్జాతీయ ఆరోగ్య సంరక్షణ కంపెనీ. జనరిక్స్ మరియు బ్రాండ్స్ మధ్య సంప్రదాయబద్ధమైన విభజనను పూరించడానికి విలక్షణంగా నిలిచింది. అంతర్జాతీయంగా ఆరోగ్య సంరక్షణ అవసరాలను మరింత సమగ్రంగా పరిష్కరించడానికి రెండిటిలోను ఉత్తమమైన వాటిని కలుపుతోంది. జీవితంలో ప్రతి దశలో ఆరోగ్యవంతంగా జీవించడానికి ప్రపంచవ్యాప్తంగా ప్రజలకు సాధికారత కలిగించే మిషన్ తో, ఉన్నత స్థాయికి చేరడానికి మేము అవకాశం కేటాయిస్తాం. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ఉన్న సుమారు 1 బిలియన్ రోగులకు ఏటా ఉన్నతమైన నాణ్యత గల మందులను మేము సరఫరా చేస్తున్నాం మరియు జీవితంలోని అన్ని సమయాలను అంటే పుట్టిన నాటి నుండి మరణించేంత వరకు, దీర్ఘకాల రోగాలు నుండి తీవ్రమైన వ్యాధుల వరకు అవసరమైన ఔషధాలను అందించే సామర్థ్యం మాకు ఉంది. మా సాటిలేని విస్తృతమైన మరియు విభిన్నమైన మందుల జాబితాతో, ఎక్కువ మందికి ఎక్కడైనా, ఎప్పుడైనా ఔషధాలు అవసరమైనపుడు వారికి అందుబాటులో ఉండేలా రూపొందించబడిన విభిన్నమైన ప్రపంచ సరఫరా గొలుసు ఇది మరియు ప్రపంచంలో అత్యంత దీర్ఘకాలిక ఆరోగ్య సవాళ్లను పరిష్కరించడానికి శాస్త్రీయమైన నైపుణ్యం Viatris వద్ద గలదు. పిట్స్‌బర్గ్, షాంఘై మరియు భారతదేశం లో హైదరాబాద్ లో అంతర్జాతీయ కేంద్రాలతో మా ప్రధాన కార్యాలయం యు.ఎస్. లో ఉంది. via-tris.com మరియు investor.viatris.comపై మరింత తెలుసుకోండి మరియు LinkedIn, Instagram, YouTube మరియు X (ఇంతకు ముందు ట్విట్టర్ గా పిలువబడేది) పై మాతో కనక్ట్ అవండి.

## దడ పుట్టిస్తున్న బంగారం ధరలు..



**న్యూఢిల్లీ-నవభూమి:**పసిడి , వెండికి మార్కెట్లో ఎల్లప్పుడూ డిమాండ్ ఉంటుంది. అయితే పసిడి, వెండి ధరలు గత కొంత కాలం నుంచి పరుగులు పెడుతున్న సంగతి తెలిసిందే. గతంలో ఎన్నడూ లేని విధంగా వీటి ధరలు రికార్డు స్థాయికి చేరుకుంటున్నాయి. ఒక్కోసారి మార్కెట్లో ధరలు పెరిగితే మరి కొన్నిసార్లు తగ్గుతూ కనిపిస్తాయి. గత రెండు మూడు రోజుల నుంచి గోల్డ్, వెండి ధరలు స్వల్పంగా పెరుగుతున్నాయి. ఈ క్రమంలో బుధవారం బంగారం, వెండి ధరలు స్వల్పంగా పెరిగాయి. గోల్డ్ ధరలు ప్రపంచ బంగారం ధరలపై ఆధారపడి ఉంటాయి, ద్రవ్యోల్బణం, ప్రపంచ ధరలలో మార్పు, కేంద్ర బ్యాంకు బంగారు నిల్వ, హెచ్చుతగ్గుల వడ్డీ రేట్లు, ఆభరణాల మార్కెట్లు వంటి అనేక అంతర్జాతీయ అంశాల ద్వారా ఇవి ప్రభావితమవుతాయి. హైదరాబాద్ నగరంలో బంగారం ధరలు స్థిరంగా ఉండటం లేదు. గతేడాదితో పోలిస్తే భారీగానే పెరుగుతూ వస్తోంది.

**మే నుంచి స్మార్ట్ రేషన్ కార్డులు**

**అంతర్జాతీయ మార్కెట్లోనూ కొత్త రికార్డు**

ట్రంప్ సుంకాలు వాణిజ్య యుద్ధాలకు దారి తీయనున్నాయన్న భయాందోళనలతో ఇన్వెస్టర్లు ఈక్విటీల్లోని పెట్టుబడులను ఈ విలువైన లోహాల్లోకి మళ్లిస్తున్నారు. దాంతో అంతర్జాతీయ మార్కెట్లో బంగారం ధరలు సరికొత్త రికార్డు స్థాయికి పెరిగాయి. స్పాట్ మార్కెట్లో ఔన్స్ (31.10 గ్రాములు) గోల్డ్ 3,149.03 డాలర్లు, జూన్ డెలివరీ గడువుతో కూడిన కామెక్స్ గోల్డ్ ఫ్యూచర్స్ కాంట్రాక్టు 3,177 డాలర్ల వద్ద ఆల్‌టైం గరిష్ఠాలను నమోదు చేశాయి. సిల్వర్ మాత్రం అర శాతానికి పైగా తగ్గి 33.83 డాలర్ల స్థాయిలో ట్రేడైంది.

తాజాగా హైదరాబాద్‌లో 22 క్యారెట్ల బంగారం గ్రాముకు రూపాయి పెరిగి రూ. 8,511 కాగా 10 గ్రాముల ధర రూ. 85,110గా ఉంది. అలాగే 24 క్యారెట్ల బంగారం గ్రాముకు రూపాయి పెరిగి రూ. 9,285 కాగా 10 గ్రాముల ధర రూ. 92,850గా ఉంది. ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖ, విజయవాడలో ఇవే ధరలు కొనసాగుతున్నాయి.

దేశవ్యాప్తంగా బంగారం (22, 24 క్యారెట్ల) ధరలు ఎలా ఉన్నాయంటే..

కోల్‌కతా- రూ.85,110, రూ.92,850
చెన్నై- రూ.85,110, రూ.92,850
బెంగళూరు- రూ.85,110, రూ.92,850
పుణె- రూ.85,110, రూ.92,850
అహ్మదాబాద్- రూ.85,160, రూ.92,900
భోపాల్- రూ.85,160, రూ.92,900
కోయంబత్తూర్- రూ.85,110, రూ.92,850
పట్నా- రూ.85,160, రూ.92,900
సూరత్- రూ.85,160, రూ.92,900
పుదుచ్చేరి- రూ.85,110, రూ.92,850

**వెండి ధరలు ఎలా ఉన్నాయంటే..**

హైదరాబాద్‌లో కేజీ వెండి రూ. 100 పెరిగి.. రూ. 1,14,100గా ఉంది. దేశ రాజధాని ఢిల్లీలో కిలో వెండికి రూ. 100 పెరిగి.రూ.1,05,100కు చేరింది. ఆర్థిక రాజధాని ముంబైలో కిలో వెండికి రూ. 100 పెరిగి.రూ.1,05,100 వద్ద కొనసాగుతోంది. ఇక విజయవాడలో కేజీ ధర రూ.1,14,100గా ఉంది, విశాఖపట్నంలో కిలో వెండి ధర రూ. 1,14,100 వద్ద కొనసాగుతోంది.

కాగా పసిడి ధరలు మంగళవారం సరికొత్త జీవిత కాల రికార్డు గరిష్ఠానికి ఎగబాకాయి. ఢిల్లీ మార్కెట్లో 99.9 శాతం స్వచ్ఛత బంగారం ధర 10 గ్రాములపై ఏకంగా రూ.2,000 పెరిగి రూ.94,150కి చేరింది. దేశీయంగా మేలి మి బంగారం రూ.94,000కు చేరడం ఇదే ప్రప్రథమం. అంతేకాదు, ఈ విలువైన లోహం రేటు పెరగడం వరుసగా ఇది నాలుగో రోజు. అంతర్జాతీయంగా దీని ధరలు వేగంగా పెరుగుతుండటమే ఇందుకు ప్రధాన కారణం. 99.5 శాతం స్వచ్ఛత లోహం రేటు కూడా రూ.2000 పెరుగుదలతో ఆల్‌టైం రికార్డు స్థాయి రూ.93,700కు ఎగబాకింది. దాదాపు 2 నెలల్లో గోల్డ్‌కు ఇదే అతిపెద్ద ఒక్కరోజు పెరుగుదల. ఈ ఫిబ్రవరి 10న తులం పసిడి రూ.2,400 పెరుగుదలను నమోదు చేసింది. ఈ జనవరి 1న రూ.79,390 పలికిన బంగారం.. గడిచిన మూడు నెలల్లో రూ.14,760 (18.6 శాతం) మేర పుంజుకుంది. వెండి విషయానికొస్తే, కిలో రూ.500 తగ్గుదలతో రూ.1,02,500కు పరిమితమైంది.

## ఏప్రిల్‌లో పర్సనల్ లోన్స్‌పై ప్రధాన బ్యాంకులు వసూలు చేసే వడ్డీ రేట్లు



**న్యూఢిల్లీ-నవభూమి:**దేశంలో ఏప్రిల్ 1, 2025 నుంచి కొత్త ఆర్థిక సంవత్సరం రానే వచ్చేసింది. ఈ సందర్భంగా అనేక మంది పర్సనల్ లోన్స్ తీసుకునే వారు ఉంటారు. అయితే ప్రస్తుతం ఏప్రిల్ నెలలో ప్రధాన బ్యాంకుల్లో ఎంత వడ్డీ రేట్లు ఎలా ఉన్నాయి, ఏంటనే విషయాలను ఇక్కడ తెలుసుకుందాం. ప్రతి బ్యాంకు లేదా బ్యాంకింగ్ సంస్థ తమ వ్యక్తిగత రుణాలపై వడ్డీ రేట్లను నిర్దేశిస్తూ, వాటిని నెల నెలగా లేదా సంవత్సర వారీగా ఎప్పటికప్పుడు మారుస్తుంటాయి. ఈ వడ్డీ రేట్లు సాధారణంగా రుణగ్రహీత క్రెడిట్ స్కోర్, రుణం మొత్తం, బ్యాంకు లేదా %NBFC%తో ఉన్న సంబంధం ఆధారంగా మారుతుంటాయి. ఈ క్రమంలో మీరు బ్యాంకు లేదా బ్యాంకింగ్ సంస్థ నుంచి వ్యక్తిగత రుణం తీసుకోవాలని భావిస్తున్నట్లయితే, వడ్డీ రేట్లు, రుణం ప్రాసెసింగ్ ఛార్జీల వంటి అనేక షరతుల గురించి ముందే తెలుసుకోవడం మంచిది.

**స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా:**

దేశంలో అతి పెద్ద ప్రభుత్వం రంగ బ్యాంకైన ఎస్బీఐలో ప్రస్తుతం పర్సనల్ లోన్స్ విషయంలో వార్షిక వడ్డీ రేటు 11.45%గా ఉంది. దీంతోపాటు 1.50 శాతం ప్రాసెసింగ్ ఫీజు కూడా వసూలు చేస్తారు. అయితే ప్రాసెసింగ్ ఫీజు ప్రతి బ్యాంకులకు ఒక్కో రకంగా మారుతుంటుంది.

బ్యాంక్ భారతదేశంలో అతిపెద్ద ప్రైవేట్ రంగ బ్యాంకులలో ఒకటిగా ఉంది. ఈ బ్యాంకు ప్రస్తుతం జీతం ద్వారా తీసుకునే లోన్స్ విషయంలో వడ్డీ రేటు 10.90% నుంచి 24% వరకు వసూలు చేస్తుంది. ప్రాసెసింగ్ ఛార్జీల పరంగా, ఈ బ్యాంక్ రూ.6,500 చొప్పున ం %GST%గా తీసుకుంటుంది. వడ్డీ రేటు క్లియరింగ్, రుణ అర్హత, రుణ అనుమతిని బట్టి మారుతుంది. ICICI బ్యాంక్ కూడా ప్రైవేట్ రంగంలో ఉన్న ప్రముఖ బ్యాంకు. ఈ బ్యాంకు వడ్డీ రేట్లు 10.85% నుంచి 16.65% మధ్య ఉంది. ఈ వడ్డీని ఖాతాదారులకు అనుకూలంగా అందిస్తాయి. బ్యాంక్ రుణం ప్రాసెసింగ్ ఛార్జీలుగా రుణ మొత్తంపై 2%, ఇతర పన్నులను వసూలు చేస్తుంది.

**కోటక్ మహీంద్రా బ్యాంక్:**

కోటక్ మహీంద్రా బ్యాంక్ కూడా ప్రైవేట్ రంగ బ్యాంకుల్లో ఒకటిగా ఉంది. ఇది 10.99% నుంచి 16.99% మధ్య వడ్డీ రేట్లను వసూలు చేస్తుంది. ప్రాసెసింగ్ ఛార్జీలు తుది రుణ మొత్తంలో 5%, ఇతర పన్నులు ఉంటాయి.

**ఫెడరల్ బ్యాంక్:**

ఈ బ్యాంకు 11.49% నుంచి 14.49% వరకు వడ్డీ రేట్లను వసూలు చేస్తుంది. ఇది సాధారణంగా ప్రతి రుణగ్రహీతకు అనుకూలంగా ఉంటుంది. ఫెడరల్ బ్యాంకు శ్రద్ధ చూపే అంశం రుణ గ్రహీత అభ్యర్థన, వారి క్రెడిట్ స్కోర్.

బ్యాంక్ ఆఫ్ బరోడా:ఈ బ్యాంకు, ప్రైవేట్, ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగులతో ఉన్న సంబంధం ఉండే వారికి 13.05% నుంచి 15.30% వడ్డీ రేట్ల మధ్య వసూలు చేస్తుంది. జీతం పొందే రుణగ్రహీతల నుంచి తీసుకునే వడ్డీ రేటు ప్రత్యేకంగా ఉంటుంది.

**యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా:**

ఈ ప్రభుత్వ రంగ బ్యాంకు కూడా తమ వ్యక్తిగత రుణాలపై 11.50% నుంచి 15.20% మధ్య వడ్డీ రేటును వసూలు చేస్తుంది. ఈ బ్యాంకు కూడా రుణగ్రహీతకు అనుకూలమైన సేవలను అందిస్తుందని చెప్పవచ్చు.

## మార్చి జీఎసటీ వసూళ్లు రూ.1.96 లక్షల కోట్లు

**న్యూఢిల్లీ-నవభూమి:** ఈ ఏడాది మార్చి నెలలోనూ జీఎస్‌టీ వసూళ్లు పెరిగాయి. గత నెల మొత్తానికి ఈ వసూళ్లు రూ.1.96 లక్షల కోట్లకు చేరాయి. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 9.9 శాతం ఎక్కువ. మార్చి నెల మొత్తానికి సీజీఎసటీ రూపంలో రూ.38.100 కోట్లు, ఎస్‌జీఎసటీ రూపంలో రూ.49,900 కోట్లు, ఇంటిగ్రేటెడ్ జీఎసటీ రూపంలో రూ.95,900 కోట్లు, జీఎసటీ సెస్సు రూపంలో రూ.12,300 కోట్లు వసూలయ్యాయి. రిఫండ్స్ తీసివేస్తే గత నెల మొత్తానికి నికరంగా జీఎసటీ వసూళ్లు రూ.1.76 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 7.3 శాతం ఎక్కువ.2024-25లో రూ.22.08 లక్షల కోట్లు మార్చి ముగిసిన 2024-25 ఆర్థిక సంవత్సరం మొత్తానికి చూసినా జీఎసటీ వసూళ్లు రూ.22.08 లక్షల కోట్లకు చేరాయి. 2023-24 ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఇది 9.4 శాతం ఎక్కువ. రిఫండ్స్‌ని తీసివేసినా 2024-25 ఆర్థిక సంవత్సరం మొత్తానికి రూ.19.56 లక్షల కోట్ల జీఎసటీ వసూలైంది. అంతకు ముందు ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఇది 8.6 శాతం ఎక్కువ.

తెలుగు రాష్ట్రాల్లో అంతంతే

గత నెల జీఎస్‌టీ వసూళ్లు దేశవ్యాప్తంగా 9.9 శాతం పెరిగినా, రెండు తెలుగు రాష్ట్రాల్లో మాత్రం పెద్దగా ఎదుగుబొదుగూ లేదు. రెండు రాష్ట్రాల నుంచి గత నెల రూ.9,434 కోట్ల జీఎస్‌టీ వసూలైంది. ఇందులో ఏపీ నుంచి రూ.4,033 కోట్లు, తెలంగాణ నుంచి రూ.5,401 కోట్లు వసూలయ్యాయి. గత ఏడాది ఇదే కాలం తో పోలిస్తే ఏపీలో వసూళ్లు ఒక శాతం పడిపోగా తెలంగాణాలో జీరో శాతం వృద్ధి రేటు నమోదైంది.

## కాగ్నిజెంట్ జీసీసీ సర్వీస్ గ్లోబల్ హెడ్‌గా శైలజ జోస్యుల



**హైదరాబాద్-నవభూమి:** ప్రముఖ టెక్నాలజీ, ప్రొఫెషనల్ సేవల సంస్థ కాగ్నిజెంట్ తన జీసీసీ సర్వీస్ లైన్‌కి కొత్త గ్లోబల్ హెడ్‌ను నియమించింది. ఇప్పటికే కాగ్నిజెంట్‌లో వివిధ ఉన్నత పదవులు నిర్వహించిన శైలజ జోస్యులను ఈ విభాగం గ్లోబల్ హెడ్‌గా నియమించినట్టు తెలిపింది. ఆమె ఈ హోదాలో హైదరాబాద్ నుంచి పని చేస్తారు. శైలజ తన 30 ఏళ్ల ఉద్యోగ జీవితంలో కాగ్నిజెంట్, ఈవై, థామ్సన్ రాయిటర్స్, హెచ్ఎస్‌బీసీ వంటి పలు ప్రముఖ సంస్థల్లో కీలక బాధ్యతలు నిర్వహించారు.






## వక్ఫ్ ప్రాపర్టీల నుంచి 12,000 కోట్ల ఆదాయం రావాలి.. కానీ 163 కోట్లేనా?

న్యూఢిల్లీ: వక్ఫ్ సవరణ బిల్లు 2025ని లోక్‌సభలో ప్రవేశపెట్టారు. కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు దీనిపై ప్రసంగించారు. వక్ఫ్ అంశాన్ని మతపరమైన కోణంలో కాకుండా, ప్రాపర్టీ కోణంలో చూస్తున్నట్లు వెల్లడించారు. రైల్వేలు, రక్షణ రంగం తర్వాత దేశంలో అత్యధిక భూములు ఉన్నది వక్ఫ్ బోర్డు వద్దే అని మంత్రి చెప్పారు. అతిపెద్ద సంఖ్యలో భూములు ఉన్నా.. గడిచిన 70 ఏళ్ల నుంచి ఓటు బ్యాంకు రాజకీయాల కోసం ముస్లింలకు ఆ భూముల నుంచి లబ్ధి అందకుండా చేశారని ఆయన ఆరోపించారు.వక్ఫ్ ప్రాపర్టీలను సాధారణ, పేద, అణగారిన ముస్లింల సంక్షేమం, లబ్ధి కోసం ఎందుకు వాడలేదని ఆయన ప్రశ్నించారు. సాధారణ ముస్లింల సంక్షేమం కోసం వక్ఫ్ ప్రాపర్టీలను వాడాల్సిన సందర్భం వచ్చిందన్నారు. 2004 లెక్కల ప్రకారం. దేశంలో 4.9 లక్షల వక్ఫ్ ప్రాపర్టీలు ఉన్నాయన్నారు. వాటి నుంచి వస్తున్న ఆదాయం 163 కోట్లుగా పేర్కొన్నారు. అయితే 2013లో వచ్చిన సవరణ తర్వాత ఆ ప్రాపర్టీల ఆదాయం 3 కోట్లు పెరిగిందన్నారు. అంటే వక్ఫ్ ఆదాయం 166 కోట్లకు చేరిందన్నారు.అంత భారీగా ఉన్న ప్రాపర్టీల నుంచి తక్కువ స్థాయిలో ఆదాయం వస్తోందని, ఆ ప్రాపర్టీల నుంచి కనీసం 12 వేల కోట్ల ఆదాయం రావాలని మంత్రి రిజిజు పేర్కొన్నారు. వక్ఫ్ ప్రాపర్టీలను పేద ముస్లింల కోసం వినియోగించాలన్నారు. వక్ఫ్ బిల్లును ఆ లక్ష్యం కోసం సిద్ధం చేసినట్లు మంత్రి చెప్పారు. ఎవరి ప్రాపర్టీని లాక్కోవడం లేదన్నారు. 2019లో పౌరసత్వ సవరణ బిల్లును తెచ్చినప్పుడు విపక్షాలు గగ్గోలు పెట్టాయని, కానీ ఒక్క ముస్లిం కూడా తమ హక్కుల్ని కోల్పోలేదన్నారు.

## వక్ఫ్ సవరణ బిల్లును ముస్లింలు ఎందుకు వ్యతిరేకిస్తున్నారు..? వారికి కలిగే నష్టమేంటి?



**న్యూఢిల్లీ-నవభూమి:**వక్ఫ్ చట్టం, 1995కి ప్రతిపాదిత సవరణలను ముస్లిం సమాజంతోపాటు ప్రతిపక్ష రాజకీయ పార్టీలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. ఈ మార్పులు వక్ఫ్ సంస్థల స్వయంప్రతిపత్తిని దెబ్బతీస్తాయని, మత స్వేచ్ఛను ఉల్లంఘిస్తాయని విమర్శకులు వాదిస్తున్నారు. వక్ఫ్ సవరణ బిల్లులో కింద పేర్కొన్న అంశాల పట్ల ముస్లింలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**వక్ఫ్ బోర్డులలో ముస్లింయేతర సభ్యుల చేరిక:**
రాష్ట్ర వక్ఫ్ బోర్డులలో కనీసం ఇద్దరు ముస్లింయేతర సభ్యులను చేర్చాలని బిల్లు ఆదేశిస్తుంది. ఇది వక్ఫ్ బోర్డుల మతపరమైన స్వయంప్రతిపత్తిని దెబ్బతీస్తుందని.. మైనారిటీ సంస్థలకు రాజ్యాంగ రక్షణలను ఉల్లంఘిస్తుందని ప్రత్యర్థులు వాదిస్తున్నారు.

**వక్ఫ్ ఆస్తులపై జిల్లా కలెక్టర్లకు అధికారాలు:**
ప్రతిపాదిత సవరణలు వివాదాస్పద వక్ఫ్ ఆస్తుల యాజమాన్యాన్ని నిర్ణయించే అధికారాన్ని జిల్లా కలెక్టర్లకు ఇస్తాయి. వక్ఫ్ బోర్డుల అధికార పరిధి నుంచి.. ప్రభుత్వం నియమించిన అధికారులకు బదలాయించడం.. అధికార దుర్వినియోగానికి, రాజకీయ జోక్యానికి దారితీస్తుందని విమర్శకులు భయపడుతున్నారు.

**ఆస్తుల రిజిస్ట్రేషన్‌కు కొత్త నిబంధనలు**
వక్ఫ్ బోర్డులు తమ ఆస్తులకు సంబంధించిన ఆస్తి పత్రాలను సమర్పించాలని బిల్లు ఆదేశిస్తుంది. దీని ప్రకారం వక్ఫ్ ఆస్తులకు పూర్తి డాక్యుమెంటేషన్ తప్పనిసరి. కానీ వారసత్వంగా ఉన్న ముస్లింల ఆస్తులకి పాత రికార్డులు ఎక్కడ ఉంటాయనే ప్రశ్న తలెత్తుతోంది. దీంతో అధికారులు కావాలంటే ఏదైనా వక్ఫ్ ఆస్తిని ప్రభుత్వ భూమిగా మార్చేయగలరని ముస్లింలు భయపడుతున్నారు.

**ఆక్రమణలకు అవకాశం:**
నూతన చట్టం వల్ల వక్ఫ్ భూముల సర్వే అధికారాలు కలెక్టర్లకు మారిపోవడంతో భూమి ఆక్రమణలకు అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని ముస్లిం నేతలు ఆరోపిస్తున్నారు. బినామీల ద్వారా వక్ఫ్ భూములను కొట్టేసేందుకు ఇది అవకాశం కల్పిస్తుందనే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

మత స్వేచ్ఛ ఉల్లంఘన:
ముస్లిం సమాజంలో మత, ధార్మిక ప్రయోజనాల కోసం ఉద్దేశించిన వక్ఫ్ ఆస్తుల విషయంలో ప్రభుత్వం జోక్యం చేసుకోవడం మత స్వేచ్ఛకు అడ్డు తగలడమేనని.. ఇది మైనార్టీల హక్కులను కాలరాస్తుందని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి. ఈ బిల్లు దుర్మార్గమైందని.. రాజ్యాంగ విలువలపై జరుగుతున్న దాడిగా ఈ బిల్లును ప్రతిపక్షాలు అభివర్ణిస్తున్నాయి.

**ప్రభుత్వం ఏమంటోంది..?**
వక్ఫ్ చట్టం (1995) సవరణలపై ముస్లిం సంఘాలు, ప్రతిపక్ష పార్టీలు విమర్శలకు ప్రభుత్వం స్పష్టమైన సమాధానం ఇచ్చింది.

**?? మైనారిటీ వ్యవహారాల మంత్రి ఏమన్నారంటే?**
ఈ సవరణలు వక్ఫ్ బోర్డుల నిర్వహణలో పారదర్శకత తీసుకురావడానికి, వెనుకబడిన ముస్లింలను బలోపేతం చేయడానికి ఉపయోగపడతాయని కేంద్ర మైనారిటీ వ్యవహారాల మంత్రి కిరెన్ రిజిజు తెలిపారు. మత స్వేచ్ఛను హరిస్తాయనే విమర్శలను ఆయన తప్పుబట్టారు. ముస్లింలను తప్పుదోవ పట్టించేందుకు ప్రతిపక్షాలు దుష్ప్రచారం చేస్తున్నాయన్నారు.

**వెనుకబడిన ముస్లిం సమూహాలతో సంప్రదింపులు..**
వక్ఫ్ చట్టం సవరణల విషయమై 19 రాష్ట్రాల వక్ఫ్ బోర్డుల అధ్యక్షులతో పాటు సామాన్య ముస్లింలతో కూడా విస్తృతంగా చర్చలు జరిగాయని ప్రభుత్వం తెలిపింది. చాలా మంది వెనుకబడిన ముస్లింలు ఈ సవరణలను స్వాగతించారని.. ప్రస్తుతం వక్ఫ్ బోర్డుల్లో అవినీతి ఎక్కువగా ఉందని వారు అభిప్రాయపడుతున్నారని సర్కారు తెలిపింది.

**బిల్లు పార్లమెంట్ కమిటీకి..**
ప్రతిపక్షాల డిమాండ్ మేరకు ఈ బిల్లును జాయింట్ పార్లమెంటరీ కమిటీకి పంపించాలని ప్రభుత్వం నిర్ణయించింది. తద్వారా అన్ని రాజకీయ పార్టీల సూచనలను పరిగణనలోకి తీసుకుని తుది నిర్ణయం తీసుకోవడం సాధ్యమవుతుందని ప్రభుత్వం తెలిపింది.

**ప్రతిపక్షాలది నటన: బీజేపీ**
ప్రతిపక్షాలు ముస్లింల గురించి చింతిస్తున్నట్లు నటిస్తున్నాయి, కానీ నిజానికి అవి భూకబ్జాదారులకు మద్దతునిస్తున్నాయి. ఈ చట్ట మార్పులు గరిష్టంగా పేద ముస్లింలకు ప్రయోజనం చేకూరుస్తాయని బీజేపీ అధికార ప్రతినిధి షెహ్జాద్ పూనావాల్లా తెలిపారు.

**స్థూలంగా చూస్తే..**
వక్ఫ్ బోర్డుల్లో అవినీతిని తగ్గించి, వ్యవస్థను పారదర్శకంగా చేయడానికే ఈ బిల్లును తెచ్చినట్లు ప్రభుత్వం చెబుతోంది. అయితే, ప్రతిపక్షాలు మాత్రం "ఇది ముస్లింల హక్కులను హరించే కుట్ర" అని విమర్శిస్తున్నాయి.

## మీ వద్ద రూ.2000 నోట్లు ఉన్నాయా.. అయితే మీకో శుభవార్త..



**న్యూఢిల్లీ-నవభూమి:** మోదీ ప్రభుత్వం నల్లధనాన్ని వెలికి తీసే క్రమంలో 2016 నవంబర్ 8వ తేదీన కీలక నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. దీనిలో భాగంగానే పాత నోట్లను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. దీనిలో రూ.1000, రూ.500 పాత నోట్లు ఆ రోజు నుంచి మార్కెట్లో చలామణి నిలిచిపోయాయి. అప్పటికే ప్రజల వద్ద ఉన్న ఆ నోట్లను మార్చుకోవడానికి ఆర్బీఐ సమయం ఇచ్చింది. బడా బాబుల నుంచి గ్రామీణ ప్రజల వరకు ఇంట్లో ఒక్క నోట్ ఉన్నా బ్యాంకులకు వెళ్లి మార్చుకున్నారు. అదే సమయంలో కొత్త నోట్లను కూడా ఆర్బీఐ ప్రకటించింది. రూ.500 నోట్లతో పాటు.. రూ.2000 నోట్లను ముద్రించింది. వీటితో పాటు.. తర్వాత కొత్తగా రూ.10, రూ.20, రూ.50, రూ.100, రూ.200 వంటి నోట్లను కూడా మార్కెట్లోకి విడుదల చేసింది.అయితే 2023 మే 19న రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రూ.2వేల నోట్ల చెలామణిలో నుంచి ఉపసంహరించుకుంటున్నట్లు తెలిపింది. దీంతో మళ్లీ.. ఈ నోట్లను మార్చుకునేందుకు బ్యాంకులకు వెళ్లాల్సి వచ్చింది. దీనికి 2023 అక్టోబర్ 7 వరకు అన్ని బ్యాంకుల్లో రూ.2వేల నోట్లను డిపాజిట్ చేయడం లేదంటే మార్చుకునేందుకు అవకాశం కల్పించింది.

అయితే మొదట నోట్ల రద్దు సమయంలో ఇబ్బందిపడినట్లుగా ప్రజలు ఈ నోట్ల రద్దుతో ఇబ్బంది పడలేదు. చాలా మంది వద్ద ఈ రూ.2000 నోట్లు అందుబాటులో లేకపోవడమే కారణం. అయితే నేటికి రూ.2000 నోట్లు 98.21 శాతం బ్యాంకులకు తిరిగి వచ్చాయని ఆర్బీఐ తెలిపింది. ఇంకా ప్రజల వద్దనే రూ.రూ.6,366 కోట్ల విలువైన నోట్లు ఉన్నట్లు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్పష్టం చేసింది. మొత్తం ముద్రించిన రూ.2000 నోట్ల విలువ రూ.3.56లక్షల కోట్లుగా ఉన్నట్లు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పేర్కొంది. మార్చి 31తో ఆర్థిక సంవత్సరం ముగిసింది. కొత్త ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ 1 నుంచే మొదలైంది. ఈ సందర్భంగా ఆర్బీఐ ఈ నోట్ల గురించి తెలిపింది.2000 రూపాయల నోట్లను డిపాజిట్ చేయడానికి లేదా మార్పిడి చేసుకోవడానికి అక్టోబర్ 7, 2023 వరకు అన్ని బ్యాంకు శాఖలలో సౌకర్యం అందుబాటులో ఉంది. అయితే.. ఈ సౌకర్యం ఇప్పటికీ ఉన్నట్లు ఆర్బీఐ ప్రకటించింది. అయితే ఇంకా ఎవరి వద్దనైనా ఈ నోట్లు ఉంటే.. దేశంలోని ఏ పోస్టాఫీసు నుండి అయినా %=దీ×% జారీ చేసిన ఏ కార్యాలయానికైనా రూ. 2,000 నోట్లను పంపవచ్చు. దీని వలన వ్యక్తులు ఆర్బీఐ కార్యాలయాలను స్వయంగా సందర్శించాల్సిన అవసరం లేకుండానే వారి బ్యాంకు ఖాతాలకు తమ నోట్లను జమ చేసుకోవచ్చు. 2,000 నోట్లను సాధారణ చలామణి నుండి ఉపసంహరించుకున్నప్పటికీ.. ఈ నోట్లు చట్టబద్ధంగా చెల్లుబాటు అవుతాయని ఆర్బీఐ పేర్కొంది.

## రష్యాలో కరోనా తరహా మిస్టరీ వైరస్ విజృంభణ..

### మరో మహమ్మారిగా మారుతుందా?



**న్యూఢిల్లీ-నవభూమి:**ఐదేళ్ల కిందట మొదలైన కరోనా వైరస్ నుంచి ప్రపంచం ఇప్పుడిప్పుడే కోలుకుంటోంది. అయితే, తాజాగా, రష్యాలో అంతుచిక్కని వైరస్ వ్యాప్తి ఆందోళనకు గురిచేస్తోంది. కోవిడ్-19 తరహా ఈ కొత్తరకం వైరస్ వల్ల శ్వాస సంబంధిత సమస్యలు, జ్వరంతో ఆసుపత్రుల్లో చేరుతోన్న బాధితుల సంఖ్య పెరుగుతున్నట్టు అంతర్జాతీయ మీడియా కథనాలు నివేదించాయి. అంతేకాదు, బాధితులు దగ్గినప్పుడు నోటి రక్తం కూడా పడుతోందని కొన్ని నివేదికలు పేర్కొన్నాయి. అయితే, ఈ వార్తలను ఖండించిన రష్యా అధికారులు.. దేశంలో కొత్త వైరస్ వ్యాప్తి చెందలేదని స్పష్టం చేశారు. అయితే, రష్యాలో మిస్టరీ వైరస్ వ్యాప్తి చెందుతోందని, చాలా నగరాల్లో ప్రజలు వారాల తరబడి జ్వరం, ఒళ్లు నొప్పులు, దగ్గుతో బాధపడుతున్నారని నివేదికలు చెబుతున్నాయి. ఈ వైరస్ చాలా వేగంగా వ్యాప్తి చెందుతోందని, కరోనా వైరస్ నిర్ధారణ పరీక్షలు చేసినా నెగటివ్ వస్తోందని, ఇది కొత్త వైరస్ అయి ఉంటుందని అభిప్రాయపడ్డాయి.ఐదు రోజులుగా జ్వరంతో బాధపడుతోన్న అలెగ్జాండ్రా అనే మహిళకు దగ్గుతున్నప్పుడు రక్తం పడుతోందని పేర్కొంది. ఎన్ని మందులు వాడినా తగ్గడం లేదని ఆమె ఆందోళన చెందుతున్నట్లు తెలిపింది. ఇలాంటి బాధితులు చాలా మంది ఉన్నారని పలు నివేదికలు వెల్లడించాయి. కొంతమంది సోషల్ మీడియాలో దగ్గుతున్నప్పుడు రక్తం పడుతోందని పోస్ట్ చేశారు. యాంటీబాడీ చికిత్సకు కూడా ఈ వైరస్ లొంగడం లేదని, వైద్య నిపుణులకు సవాల్ మారిందని తెలిపారు.ఈ వార్తలపై స్పందించిన రష్యా యంత్రాంగం.. దేశంలో ఎలాంటి కొత్త వ్యాధి కారకాలు గుర్తించలేదని ప్రకటించింది. కొత్త వైరస్ వ్యాప్తికి ఎటువంటి ఆధారాలు లేవని స్పష్టం చేసింది. తప్పుడు వార్తలతో ప్రజలు ఆందోళన చెందుతున్నారని, అందులో నిజం లేదని పేర్కొంది. నివేదికల్లో పేర్కొన్న మహిళకు మైకోప్లాస్మా న్యుమోనియా ఉందని వైద్యులు నిర్ధారించారని అధికారులు తెలిపారు. ఒకవేళ కోవిడ్ లాంటి వైరస్ వస్తే ఎదుర్కోవడానికి యంత్రాంగం సిద్ధంగా ఉందని చెప్పారు. 'బాధితులకు నిర్వహిస్తోన్న పరీక్షల్లో ఎలాంటి నూతన వ్యాధి కారకాలు బయటపడలేదు.... కొత్త వైరస్ వ్యాపించినట్లు ఎటువంటి ఆధారాలు లేవు' అని అధికారులు పేర్కొన్నారు.అయితే, వైద్య వర్గాలు కూడా ఈ వ్యాధికి మైకోప్లాస్మా న్యుమోనియా అనే బాక్టీరియంతో సంబంధం ఉందని భావిస్తున్నాయి. ఇది మానవులకు సోకే అవకాశం ఉంది. ఇది సాధారణంగా ఎగువ శ్వాసకోశ ఇన్ఫెక్షన్లకు కారణమవుతుంది. క్రమంగా న్యుమోనియాకు దారితీస్తుంది. ఈ ఇన్ఫెక్షన్ కారణంగా గతేడాది చివర్లో రష్యాలో భారీగా కేసులు నమోదయ్యాయి. కానీ, అప్పట్లో రష్యా అధికారులు దీనిని నిర్ధారించలేదు. సాధారణ ఫ్లూగానే కొట్టిపారేయడం గమనార్హం.

## జువెనైల్ హోమ్ నుంచి తప్పించుకున్న పిల్లలు.. గేట్లు పగులగొట్టి, సీసీటీవీ కెమెరాలు ధ్వంసం

**రాంచీ-నవభూమి:**నేరాలకు పాల్పడిన 21 మంది పిల్లలు జువెనైల్ హోమ్ నుంచి తప్పించుకున్నారు. గేట్లు పగులగొట్టి బయటకు పరుగులుతీశారు. అక్కడున్న సీసీటీవీ కెమెరాలను ధ్వంసం చేశారు. గుంపులుగా రహదారిపైకి చేరుకుని పారిపోయారు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. జార?ండ్‌లోని పశ్చిమ సింగ్‌భూమ్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. చైబాసాలోని జువెనైల్ హోమ్‌లో రిమాండ్‌లో ఉన్న నేర చరిత్ర ఉన్న బాలురు తప్పించుకున్నారు. మంగళవారం సాయంత్రం 6.30 గంటల సమయంలో 21 మంది పిల్లలు గుంపుగా మెయిన్ గేట్‌ను తోసుకుని బయటకు వచ్చారు. కొందరు బాలురు కర్రలు చేతపట్టి హాల్‌చల్ చేశారు. అక్కడున్న సీసీటీవీ కెమెరాలతోపాటు పలు వస్తువులను ధ్వంసం చేశారు. రహదారి వద్దకు చేరుకుని పారిపోయారు.

## రూ.15 వేల జీతగాడికి.. రూ.34 కోట్లు కట్టాలని ఐటీ నోటీసు!




**న్యూఢిల్లీ-నవభూమి:**మొన్న జ్యూస్ అమ్ముకునే వ్యక్తికి రూ.7.8 కోట్లు.. నిన్న ఫ్యాక్టరీలో పనిచేసే ఓ కార్మికుడికి రూ.11 కోట్ల చెల్లించాలని ఆదాయపు పన్ను శాఖ నోటీసులు (ఐటీ నోటీసు) పంపిన సంగతి మరిచిపోకముందే.. నేడు మరో నిరుపేదకు కోట్ల రూపాయలు కట్టాలని నోటీసులు పంపిన ఘటన యూపీలో చోటుచేసుకుంది. పారిశుద్ధ్య కార్మికుడిగా పనిచేస్తోన్న అతడికి.. రెక్కాడితే గానీ డొక్కాడదు. నెలకు జీతం రూ.15 వేలు అయితే.. రూ.34 కోట్లు పన్ను చెల్లించాలని ఐటీ అధికారులు నోటీసులు పంపారు. దీంతో బాధితుడు దిగ్భ్రాంతికి గురయ్యాడు. తన జీతమే 20 వేలులోపు అయితే .. నాకు రూ.34 కోట్లకు నోటీసు రావడం ఏంటి? అని పోలీసుల దగ్గరకు పరుగెత్తుకెళ్లాడు.

ఆగ్రాకు చెందిన కరణ్‌కుమార్ (29) ఎస్బీఐ బ్రాంచ్‌లో పారిశుద్ధ్య కార్మికుడిగా పనిచేస్తున్నాడు. అతడికి నెలకు రూ.15 వేలు జీతంగా వస్తోంది. మార్చి 29న అతడికి ఐటీ శాఖ నోటీసు జారీచేసి... రూ.34 కోట్ల పన్ను కట్టాలని పేర్కొంది. ఐటీ శాఖ నుంచి వచ్చిన నోటీసులో ఏముందో అతడికి ముందు అర్థం కాలేదు. తోటివారి సాయంతో అందులోని వివరాలు తెలుసుకుని షాకయ్యాడు. దీంతో వెంటనే పోలీస్ స్టేషన్‌కు వెళ్లి .. తన పాన్ కార్డు వివరాలను ఎవరో దుర్వినియోగం చేశారని అనుమానం వ్యక్తం చేశాడు.కరణ్ గతంలో పనిచేసిన యజమానికి తన పాన్ వివరాలు ఇచ్చినట్టు చెప్పాడు. వాటిని ఎవరో వాడుకుని ఉండొచ్చని అనుమానిస్తున్నాడు. బాధితుడు టైమ్స్ ఆఫ్ ఇండియాతో మాట్లాడుతూ.. 'ఆగ్రాలోని ఖైరా ఏరియా ఎస్బీఐ బ్రాంచ్‌లో పారిశుద్ధ్య కార్మికుడిగా పనిచేస్తున్నాను.. నాకు నెలకు రూ.15 వేలు జీతం.. 2021లో నేను కాంట్రాక్ట్ పద్ధతిలో చేరాను.. ఐటీ నోటీసులపై పోలీసులకు ఫిర్యాదు చేశాను... 2019లో నేను నొయిడాలోని ఓ ప్రయివేట్ కంపెనీలో చేరాను.. అక్కడ యాజమాన్యం పాన్ కార్డు సహా కొన్ని పత్రాలు తీసుకుంది" అని చెప్పారు.అలీగఢ్ ఐటీ అధికారి నైన్ సింగ్ మాట్లాడుతూ.. కరణ్ పాన్ కార్డు ఐటీ సిస్టమ్‌లో రిజిస్టర్ అయి ఉందని, దీని పేరున భారీగా లావాదేవీలు జరగడంతో నోటీసులు ఇచ్చినట్టు తెలిపారు.

## భార్య చేసిన డ్యాన్స్ రీల్ స్టేటస్ పెట్టుకున్న పోలీస్ ఆఫీసర్.. దెబ్బకు సస్పెండ్



**న్యూఢిల్లీ-నవభూమి:** పోలీస్ కానిస్టేబుల్ భార్య ఇటీవలే చేసిన ఓ రీల్‌ను సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. అందులో ఆమె అద్భుతంగా నృత్యం చేయగా భర్త కూడా దాన్ని పోస్ట్ చేశాడు. అయితే ఆ విషయం గుర్తించిన పైఅధికారులు మాత్రం ఆ పోలీస్ కానిస్టేబుల్‌ను ఉద్యోగంలోంచి సస్పెండ్ చేశారు. అందుకు కారణం ఆయన భార్య చేసిన రీలే కాగా.. ప్రజలంతా షాక్ అవుతున్నారు. ముఖ్యంగా సదరు కానిస్టేబుల్ సైతం సస్పెండ్‌కు గురయ్యాకే తన తప్పును గ్రహించగల్గాడు. మరి ఆ రీల్‌ల్ లో అతడి భార్య అంత చేయకూడదని పని ఏం చేసిందో మనం ఇప్పుడు తెలుసుకుందాం.

ఛండీగఢ్‌కు చెందిన సీనియర్ కానిస్టేబుల్ అజయ్ కుందుకు చాలా ఏళ్ల క్రితమే జ్యోతితో పెళ్లి జరిగింది. అయితే మొదటి నుంచి జ్యోతికి డ్యాన్స్, నటన, రీల్స్ అంటే పిచ్చి. దీంతో వీలు దొరికినప్పుడల్లా ఆమె రీల్స్ చేస్తూ సోషల్ మీడియాలో పెట్టుకునేది. అవి బాగున్నాయని అనిపిస్తే భర్త అయిన కానిస్టేబుల్ అజయ్ కుందు సైతం దాన్ని షేర్ చేసేవాడు. అయితే మార్చి 20వ తేదీ రోజు సాయంత్రం జ్యోతి తన వదిన పూజతో కలిసి గుడికి వెళ్లింది. అయితే ఇంటికి తిరిగి వస్తుండగా.. ఓ చోట ఆగి డ్యాన్స్ చేసింది. ఆమె వదిన ఈ వీడియోను రికార్డ్ చేయగా.. ఆమె మాత్రం పద్ధతిగా పంజాబీ డ్రెస్ వేసుకునే ఓ పాటకు స్టెప్పులు వేసింది.ఆపై దాన్ని సోషల్ మీడియాలో పోస్ట్ చేయగా పెద్దగానే లైకులు, కామెంట్లు వచ్చాయి. ముఖ్యంగా జ్యోతి చేసిన రీల్ నచ్చడంతో.. భర్త అజయ్ కుందు సైతం దాన్ని తన ఇన్‌స్టాగ్రామ్ వేదికగా పోస్ట్ చేశాడు. అయితే దీన్ని చూసిన ఓ హెడ్ కానిస్టేబుల్ వెంటనే పోలీస్ స్టేషన్‌కు వెళ్లి.. అజయ్ కుందు సహా ఆయన భార్య జ్యోతిపై ఫిర్యాదు చేశాడు. ఇందుకు కారణం ఆమె నడిరోడ్డుపై డ్యాన్స్ చేయడం. ముఖ్యంగా సెక్టార్-20 గురుద్వారా చౌక్ వద్ద ఉన్న జీబ్రా క్రాసింగ్‌పై జ్యోతి డ్యాన్స్ చేయగా.. ట్రాఫిక్‌కు అంతరాయం కల్గింది. ఈమె డ్యాన్స్ అయిపోయేవరకు.. అనేక వాహనాలు అక్కడే ఆగిపోవాల్సి వచ్చింది. ఎంత మంది వాహనదారులు ఇబ్బందులు పడ్డా.. జ్యోతి మాత్రం తన డ్యాన్స్ ఆపలేదని ఆమెపై వెంటనే చర్యలు తీసుకోవాలంటూ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. నేరుగా హెడ్ కానిస్టేబుల్ చెప్పిన చోటుకు వెళ్లి సీసీటీవీ కెమెరాలను పరిశీలించారు. ఈక్రమంలోనే కానిస్టేబుల్ భార్య నిజంగానే ట్రాఫిక్‌కు అంతరాయం కల్గించిందని.. అలాగే ప్రజా భద్రతకు ప్రమాదం కల్పించిందంటూ సెక్షన్ 125, 292 మరియు 3(5) కింద కేసులు నమోదు చేశారు. ఆమెపై మాత్రమే కాకుండా వీడియో తీసిన పూజపై కూడా కేసులు పెట్టారు. అలాగే సెక్టార్-19లో పని చేస్తున్న కానిస్టేబుల్ అజయ్ కుందు కూడా ఈ వీడియోను షేర్ చేయడంతో అతడిని ఉద్యోగంలోంచి సస్పెండ్ చేశారు.అయితే త్వరగానే పూజ, జ్యోతిలకు బెయిల్ రాగా.. విడుదల అయి బయటకు వచ్చారు. మరోవైపు కానిస్టేబుల్ అజయ్ కుందును సస్పెండ్ చేయడం బాగాలేదంటూ పలువురు కామెంట్లు చేస్తున్నారు. తప్పు చేసింది భార్య అయితే అతడికి ఎందుకు శిక్ష అని కొందరు, మంచి పని చేశారు.. భార్య తప్పు చేసినా తప్పని చెప్పలేకపోయిన ఆయనకు కూడా శిక్ష పడాలని మరికొందరు చెబుతున్నారు.

## ఆరు వారాల్లోగా రాపిడో, ఓలా, ఉబర్ బైక్ ట్యాక్సీ సర్వీసులను ఆపేయాలి..: కర్ణాటక హైకోర్టు షాక్



**న్యూఢిల్లీ-నవభూమి:** బైక్ ట్యాక్సీ అగ్రిగేటర్ యాప్ రాపిడోకు భారీ ఎదురు దెబ్బ తగిలింది. కర్ణాటక హైకోర్టు బుధవారం రోజు బైక్ ట్యాక్సీ సేవలను నిలిపివేయాలంటూ సంచలన తీర్పును ఇచ్చింది. కర్ణాటకలో రానున్న ఆరు వారాల్లో వీటిని నిలిపి వేయాలని రాష్ట్ర ప్రభుత్వం మరియు రవాణా శాఖను కోర్టు ఆదేశించింది. అలాగే బైక్ ట్యాక్సీ సేవలను మోటార్ వాహనాల చట్టం 1988 కింద చేర్చడానికి కర్ణాటక సర్కారుకు 3 నెలల సమయం ఇచ్చింది. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలు మీకోసం.2021లో అప్పటి బీజేపీ సర్కారు బైక్ ట్యాక్సీ పథకాన్ని ప్రవేశ పెట్టగా.. 2022లో దీన్ని అమలు చేశారు. అయితే ముందే నుంచే ఆటోలు, క్యాబ్‌ల డ్రైవర్లు ఆ అమలును రద్దు చేయాలంటూ ఆందోళన చేశారు. ముఖ్యంగా బైక్ ట్యాక్సీ డ్రైవర్లు మహిళలతో అనుచితంగా ప్రవర్తించడంపై అనేక ఫిర్యాదులు వచ్చాయి. అంతేకాకుండా ఆటో, క్యాబ్ డ్రైవర్లతో గొడలు కూడా పెట్టుకుని.. దాడులకు పాల్పడ్డారు. దీంతో ఈ సమస్యను తీర్చేందుకు కర్ణాటక ప్రభుత్వం.. 25 రోజుల క్రితమే బైక్ ట్యాక్సీల పథకంపై నిషేధం విధించింది. మోటార్ వాహన చట్టం నిబంధనలను పాటించకపోగా.. మహిళలకు ఈ సేవలు ఏమాత్రం సురక్షితం కావని ప్రకటించింది.

దీంతో రాపిడో, ఓలా, ఉబర్ సహా ఇతర బైక్ ట్యాక్సీ సంస్థలు హైకోర్టును ఆశ్రయించాయి. ముఖ్యంగా మోటార్ వాహనాల చట్టం కింద తగిన పర్మిట్లతో ద్విచక్ర వాహనాలను.. రవాణా వాహనాలుగా నమోదు చేయాలని రవాణా శాఖను ఆదేశించాలని కోరుతూ పిటషన్లు వేశారు. దీనిపై నేడు న్యాస్థానం విచారణ జరపగా.. కర్ణాటక మోటార్ వాహన నిబంధనల ప్రకారం తెల్లటి నంబర్ ప్లేట్లు కల్గిన ద్విచక్ర వాహనాలు వాణిజ్య కార్యకలాపాలను నడపలేమని.. ఇలా చేయడం చట్ట విరుద్ధమే అవుతుందని రాష్ట్ర ప్రభుత్వం వాదించింది. మరోవైపు రాపిడో తాము వాహన చట్టాలకు అనుగుణంగానే బైక్ ట్యాక్సీ సేవలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించింది.ఇరువైపులా వాదనలు విన్న న్యాయస్థానం బైక్ ట్యాక్సీలను ఆరు వారాల్లోగా నిలిపి వేయడానికి చర్యలు తీసుకోవాలంటూ జస్టిస్ బీఎం శ్యామ్ ప్రసాద్ ప్రభుత్వాన్ని ఆదేశించారు. అలాగే బైక్ ట్యాక్సీ కార్యకలాపాలకు అవసరం అయిన నియమాలు, మార్గదర్శకాలను రూపొందిం చడానికి రాష్ట్ర ప్రభుత్వానికి మూడు నెలల సమయం ఇచ్చారు. సర్కారు నిబంధనలు అమల్లోకి వచ్చే వరకు మోటార్ సైకిళ్లను రవాణా వాహనాలుగా నమోదు చేయలేమని.. అలాంటి సేవలకు కాంట్రాక్ట్ క్యారేజ్ పర్మిట్లను జారీ చేయమని రవాణా శాఖను ఆదేశించలేమని వెల్లడించారు.

## భర్తను కొట్టి హింసిస్తున్న భార్య.. రక్షణ కల్పించాలని పోలీసులను వేడుకున్న బాధితుడు



**భోపాల్:-నవభూమి:**భార్య, అత్తింటి వారు తనను కొట్టి హింసిస్తున్నారని భర్త వాపోయాడు. భార్య నుంచి తనకు రక్షణ కల్పించాలని పోలీసులను వేడుకున్నాడు. రహస్యంగా రికార్డ్ చేసిన వీడియో క్లిప్‌ను పోలీసులకు అందజేశాడు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. మధ్యప్రదేశ్‌లోని పన్నాలో ఈ సంఘటన జరిగింది. మార్చి 20న భర్త లోకేష్‌ను భార్య హర్షిత దారుణంగా కొట్టింది. చేతులు జోడించి అతడు వేడున్నప్పటికీ కనికరించలేదు. మరో మహిళ అడ్డుకునేందుకు ప్రయత్నించినప్పటికీ ఆమె వినిపించుకోలేదు. లోకేష్ చెంపలు వాయించింది. ముఖంపై కాలితో తన్నింది. కాలర్ పట్టుకుని పలుమార్లు కొట్టింది.కాగా, భార్య హర్షిత, అత్తింటి వారు తనను కొట్టి హింసిస్తున్నారని లోకేష్ వాపోయాడు. పేద కుటుంబానికి చెందిన ఆమెను ఎలాంటి కట్నం తీసుకోకుండా 2023 జూన్‌లో పెళ్లి చేసుకున్నట్లు తెలిపాడు. అయితే పెళ్లి తర్వాత నుంచి భార్య, అత్త, బావమరిది డబ్బులు, బంగారు నగలు కావాలని తనను డిమాండ్ చేస్తున్నారని ఆరోపించాడు. తాను నిరాకరించడంతో మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నారని, చిత్రహింసలకు గురిచేస్తున్నారని వాపోయాడు.మరోవైపు భార్య, అత్తింటి వారి నుంచి తనకు రక్షణ కల్పించాలని కోరుతూ జిల్లా ఎస్పీకి లోకేష్ ఫిర్యాదు చేశాడు. రహస్యంగా రికార్డ్ చేసిన భార్య కొడుతున్న వీడియో క్లిప్‌ను అందజేశాడు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.

## ఆసుపత్రిలో చేరిన లాలూ ప్రసాద్ యాదవ్



**న్యూఢిల్లీ-నవభూమి:** బీహార్ మాజీ ముఖ్యమంత్రి, ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్ అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరారు. బుధవారం మధ్యాహ్నం తర్వాత ఆయన ఢిల్లీకి వెళ్లేందుకు పాట్నా విమానాశ్రయానికి బయల్దేరారు. ఈ క్రమంలో మార్గం మధ్యలో అస్వస్థతకు గురికావడంతో ఆయన్ని హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన పాట్నా లోని పరాస్ ఆసుపత్రి లో చికిత్స పొందుతున్నారు.ఇవాళ సాయంత్రం 4:05 గంటలకు ఎయిర్ ఇండియా విమానంలో ఢిల్లీ వెళ్లాల్సి ఉండగా.. ఆరోగ్యం క్షీణించడంతో ఆసుపత్రిలో చేరినట్లు తెలిసింది. లాలూ ప్రసాద్ యాదవ్ గుండె సంబంధిత సమస్యలతో బాధపడుతున్నట్లు, రక్తంలో చక్కెర స్థాయిలు పెరగడం వల్ల ఆయన ఆరోగ్యం క్షీణించినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఆయన్ని ఈరోజు సాయంత్రం ఎయిర్ అంబులెన్స్‌లో ఢిల్లీలోని ఎయిమ్స్‌కు తీసుకెళ్లే అవకాశం ఉన్నట్లు తెలిసింది.

## తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఆకాశ్ అంబానీ



**న్యూఢిల్లీ-నవభూమి:**తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీ పెద్ద కుమారుడు ఆకాశ్ అంబానీ దర్శించుకున్నారు. బుధవారం ఉదయం వీఐపీ విరామ దర్శన సమయంలో స్వామివారి సేవలో పాల్గొన్నారు. ఉదయం ఆలయానికి చేరుకున్న ఆకాశ్ అంబానీకి తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం రంగనాయకుల మండపంలో అర్చకులు వేదాశీర్వచనం చేశారు. స్వామివారి తీర్థ ప్రసాదాలు, చిత్రపటాన్ని అందజేశారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆకాశ్ అంబానీ తిరుమలలోని ఎస్వీ గోశాలను సందర్శించారు. అక్కడ గోపూజ చేసి.. గోమాతకు దాణ సమర్పించారు.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
12 | హైదరాబాద్ | గురువారం | 03 । ఏప్రిల్ । 2025



## హార్ట్ బ్రేకింగ్ అంటూ అనసూయ పోస్ట్..దేని గురించి అంటే..!

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి సంబంధించిన భూముల వివాదం ఎంత చర్చనీయాంశంగా మారుతుందో మనం చూస్తూనే ఉన్నాం. 400 ఎకరాల భూమిని ఇండస్ట్రియల్ ఏరియాగా డెవలప్ చేయాలని తెలంగాణ ప్రభుత్వం భావించడంతో దీనికి వ్యతిరేఖంగా హెచ్ సి యు విద్యార్థులు గత కొన్ని రోజులుగా నిరసన గళం వినిపిస్తున్నారు. ఈ క్రమంలో విద్యార్థుల అరెస్ట్ వ్యవహారం జాతీయ స్థాయిలో చర్చనీయాంశంగా మారింది. విద్యార్థులకి పలువురు రాజకీయ నాయకులు, సెలబ్రిటీలు సైతం సపోర్ట్ అందిస్తున్నారు. కల్కి డైరెక్టర్ నాగ్ అశ్విన్ స్పందిస్తూ..ఐటీ పార్క్ కోసం 400 ఎకరాల చెట్లని ధ్వంసం చేయడం ఎందుకు .. డెవలప్ చేయాలి అంటే చెట్లు లేని భూములు చాలా ఉన్నాయి కదా అని నాగ్ అశ్విన్ ఇటీవల ప్రశ్నించారు.రేణూ దేశాయ్ కూడా చాలా ఎమోషనల్‌గా దీనిపై స్పందించింది. ఐటీ పార్కులు, ఆకాశాన్ని తాకే భవనాలు అన్నీ అవసరమే. కానీ కుదిరితే ఈ ఒక్క 400 ఎకరాలు వదిలేయండి. తెలంగాణ సిటిజన్ గా నేను వేడుకుంటున్నా. దయచేసి ఏదో విధంగా దీనిని ఆపండి సార్. ఒక తల్లిగా మాత్రమే నేను రిక్వెస్ట్ చేస్తున్నా. ఆ 400 ఎకరాల్లో విధ్వంసం వద్దు అని రేణు దేశాయ్ వేడుకున్నారు. రష్మీ, ప్రకాశ్ రాజ్ ఇలా పలువురు తమ వాదనలు వినిపిస్తున్నారు. ఇప్పుడు ఇదే లిస్ట్‌లో అనసూయ కూడా చేరింది. తన ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ వీడియో షేర్ చేస్తూ.. ఇది నిజంగా హార్ట్ బ్రేకింగ్ అంటూ రాసుకొచ్చింది. పచ్చని అడివి పూడ్చివేసే రోజు వచ్చింది.



## ఇదేం విడ్డూరం అలియాభట్ తో నాకు పోలిక!



బాలీవుడ్ కి తుఫాన్ లా దూసుకొచ్చిన షాలిని పాండే బాలీవుడ్ లో బిజీ అయిన సంగతి తెలిసిందే. తెలుగు సినిమాల అనంతరం అమ్మడు హిందీ సినిమాల్లో స్థిరపడే ప్రయత్నం చేసింది. మధ్యలో కోలీవుడ్ సినిమాలు కూడా చేసింది. టాలీవుడ్ లో పోటీని తట్టుకోలేక అమ్మడు ఎక్కువ సమయం వృధా చేయకుండా షిఫ్ట్ అయిపోయింది. ప్రస్తుతం హిందీ, తమిళ సినిమాల్లో నటిస్తోంది. అయితే ఈ బ్యూటీని కొందరు బాలీవుడ్ స్టార్ హీరోయిన్ అలియాభట్ తో పోల్చుతున్నారు. ఆస్కార్ బరికి పంపిన మూవీపై పెద్ద కాపీ క్యాట్ వివాదం అందంలో..ఆహార్యంలో అలియాభట్ లా ఉంటుందని కంపారిజన్ చేసారు. అయితే ఈ పోలిక షాలిని పాండేకు ఎంత మాత్రం నచ్చలేదు. తాను అలియాభట్ లా ఉండటం ఏంటి? తన కంటూ ఓ సొంత ఐడెంటిటీ ఉండాలి అన్నట్లు వ్యాఖ్యానించింది. ఇండస్ట్రీలో ఇప్పటికే ఒక అలియాభట్ ఉన్నారు. మరో అలియాభట్ అవసరం లేదు. నన్ను ఆమెతో పోల్చోదు. అది నాకెంత మాత్రం నచ్చడం లేదు. ఇది అభిమానంతో చేస్తోన్న పని అయినా? ఎందుకనో నచ్చలేదు. అలియాలా మరోకరు ఉండాల్సిన అవసరం లేదు. ఉండాలని కూడా అనుకోరు. అలియా అద్భుతమైన నటి. ఎంతో అందంగా ఉంటుంది. ఈ విషయాల్లో ఆమెను స్ఫూర్తిగా తీసుకుంటాను. ఆమె ను చూసి ఎన్నో విషయాలు తెలుసుకుంటున్నాను. కానీ ఆమెతో పోల్చితే మాత్రం నచ్చదు. నాకంటూ ఓగుర్తింపు తెచ్చుకో వాలన్నదే నా తాపత్రయం అని నవ్వేసింది. దీంతో ఇప్పుడీ వ్యాఖ్యలు నెట్టింట వైరల్ గా మారాయి. సాధారణంగా ఫేమస్ అయిన బ్యూటీలతో పోల్చితే నవతరం భామలు ఎంతో సంతోషిస్తారు. దాన్ని గొప్ప కాంప్లిమెంట్ గా తీసుకుంటారు. ఆమె స్థాయిని చేరుకోవాలని చెబుతుంటారు. కానీ కొందరు మాత్రమే షాలినీలా సొంత ఐడెంటిటీని కోరుకుంటారు. కష్టపడితే సాధించలేనిది ఏదీ ఉండదు...కొత్తగా తానే సాధించి చూపిస్తానని సవాల్ విసురుతారు. అలాంటి మనస్తత్వం గలది షాలినీ పాండే.

## ఆదిత్య 369 రీ రిలీజ్ : హీరోయిన్ అప్పుడు.. ఇప్పుడు..!








నందమూరి బాలకృష్ణ హీరోగా సింగీతం శ్రీనివాసరావు దర్శకత్వంలో వచ్చిన చిత్రం 'ఆదిత్య 369'. 1991 జులై 18న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ సినిమా అప్పట్లో సెన్సేషన్ క్రియేట్ చేసింది. హాలీవుడ్ కే పరిమితం అయిన సైన్స్ ఫిక్షన్ సబ్జెక్ట్‌ను సింగీతం వారు తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకు వచ్చారు. అంతే కాకుండా ఎవరి ఊహకు సైతం అందని టైమ్ ట్రావెల్ కాన్సెప్ట్‌ను చాలా సింపుల్‌గా ప్రేక్షకులకు అర్థం అయ్యేలా సింగీతం రూపొందించారు. అద్భుతమైన కథ, కథనం, సంగీతం, కాస్టింగ్ కారణంగా ఆదిత్య 369 సినిమా క్లాసిక్‌గా నిలిచింది అనడంలో సందేహం లేదు. అద్భుతమైన కాన్సెప్ట్‌తో రూపొందిన ఈ సినిమాకు భారీ లాభాలు దక్కాయి. ఆస్కార్ బరికి పంపిన మూవీపై పెద్ద కాపీ క్యాట్ వివాదం సినిమా విడుదల అయ్యి మూడు దశాబ్దాలు దాటినా ఇప్పటికీ టీవీలో చూసేందుకు, ఓటీటీలో స్ట్రీమింగ్ చేసేందుకు ప్రేక్షకులు రెడీగా ఉంటారు. బాలకృష్ణ అభిమానులు మాత్రమే కాకుండా రెగ్యులర్ ప్రేక్షకులు సైతం ఆదిత్య 369 సినిమాను పదుల సార్లు చూసి ఉంటారు. టాలీవుడ్‌లో గొప్ప సినిమాల జాబితా తీస్తే అందులో కచ్చితంగా ఈ సినిమా ఉండాల్సిందే. అలాంటి సినిమాను ఎప్పుడెప్పుడు రిలీజ్ చేస్తారా అంటూ ఫ్యాన్స్‌తో పాటు ఇలాంటి సినిమాలను ఇష్టపడే ప్రేక్షకులు ఎదురు చూస్తున్నారు. ఎట్టకేలకు ఈ సినిమా రీ రిలీజ్ కి సిద్ధం అయింది. ఇటీవలే బాలకృష్ణ రీ రిలీజ్ ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో పాల్గొని అప్పటి జ్ఞాపకాలను షేర్ చేసుకున్నారు. ప్రస్తుతం సోషల్ మీడియాలో ఈ సినిమా గురించి ప్రముఖంగా చర్చ జరుగుతోంది. ఈ సమయంలోనే సినిమాలో హీరోయిన్‌గా నటించిన మోహిని అలియాస్ మహాలక్ష్మి శ్రీనివాసన్ గురించి చర్చ జరుగుతోంది. అప్పట్లో సూపర్ హిట్ సినిమాల్లో నటించిన మోహిని పెళ్లి చేసుకున్న తర్వాత ఇండస్ట్రీకి దూరం అయింది. తమిళనాడుకు చెందిన ఈమె 1987లో తమిళ్ సినిమాలతో ఇండస్ట్రీలో అడుగు పెట్టింది. అయితే 1991లో బాలకృష్ణతో కలిసి నటించిన ఈ సినిమాతో సూపర్ హిట్‌ను సొంతం చేసుకుని సౌత్ ఇండియాలోనే స్టార్ హీరోయిన్‌గా నిలిచింది. తమిళ్, కన్నడం, మలయాళం, తెలుగు సినిమాలతో పాటు ఒక హిందీ సినిమాలోనూ నటించింది. అన్ని సౌత్ ఇండియన్ భాషల్లో కలిపి దాదాపు 100 సినిమాల్లో నటించినట్లు తెలుస్తోంది. 2011లో ఈమె చివరి సారి వెండి తెరపై కనిపించింది. అప్పటి నుంచి సినిమాలకు పూర్తి దూరంగా ఉంటూ వచ్చింది. పెళ్లి చేసుకున్న తర్వాత ఇద్దరు పిల్లలకు తల్లి అయిన మోహిని అమెరికాలో సెటిల్ అయ్యారు. సినిమాల్లో నటించిన సమయంలో సన్నగా నాజూకుగా కనిపించిన మోహిని ఆ తర్వాత కాస్త బరువు పెరిగారు. అయితే ఆమె అందం ఏమాత్రం తగ్గలేదని, అప్పుడు ఎలా అందంగా ఉండేవారో ఇప్పుడు అలాగే కనిపిస్తున్నారు అంటూ కొందరు కామెంట్ చేస్తూ ఉంటారు. ప్రస్తుతం అమెరికాలో మత ప్రచారకురాలిగా వ్యవహరిస్తున్నారు. ఫ్యామిలీతో ఈమె ఉన్న ఫోటోలు అప్పుడప్పుడు వైరల్ అవుతూ ఉంటాయి. ఆదిత్య 369 రీ రిలీజ్ సందర్భంగా ఈమె గురించి మరోసారి చర్చ జరుగుతోంది.

## ఆస్కార్ బరికి పంపిన మూవీపై
# పెద్ద కాపీ క్యాట్ వివాదం



బాలీవుడ్ ప్రముఖ హీరో అమీర్ ఖాన్ మాజీ భార్య, దర్శకురాలు కిరణ్ రావు తెరకెక్కించిన లాపాటా లేడీస్ఆస్కార్ రేసులోను పోటీకి దిగిన సంగతి తెలిసిందే. ఇది ఒక సెటైరికల్ కామెడీ మూవీ. ఈ చిత్రం 2019లో వచ్చిన బుర్కా సిటీ అనే అరబిక్ లఘు చిత్రానికి కాపీ అంటూ ఆరోపణలు వస్తున్నాయి. ఇటీవల బుర్కా సిటీ నుండి వచ్చిన ఒక వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరలైంది. ఇది చూశాక.. కిరణ్ రావు బాలీవుడ్ సినిమా ఒరిజినలేనా? కాదా అనే సందిగ్ధత మొదలైంది. వైరల్ అరబిక్‌సినిమా కథాంశం ప్రకారం.. ఒక నూతన వరుడు తన భార్య కోసం వెతుకులాడుతూ ఉంటాడు. ఆమె స్థానంలో బుర్కా ధరించిన మరొక మహిళ పొరపాటున వచ్చి చేరుతుంది. ఆ తర్వాత ఏం జరిగిందనేదే సినిమా. ఇదే లైన్ తో లాపాటా లేడీస్ కూడా తెరకెక్కింది. దీంతో నెటిజనులు ఖంగు తిన్నారు. అంత పెద్ద స్టార్ హీరో వైఫ్.. ప్రముఖ దర్శకురాలు ఇలా కాపీ క్యాట్ సినిమా చేయడమే గాక, ఆస్కార్ అవార్డ్స్ రేసుకి పంపుతారా? అంటూ నెటిజనులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. 'హిట్ ది పోర్త్ కేస్' లో ఎవరు? ఈ వీడియో చూడగానే నెటిజన్లు స్పందిస్తూ.. కిరణ్ రావు అరబిక్ సినిమా థీమ్‌ను కాపీ చేశారా! అంటూ ఆశ్చర్యపోయారు. బాలీవుడ్ లో అన్నీ కాపీ క్యాట్ సినిమాలే. ఏదీ ఒరిజినల్ కళాఖండంలా అనిపించదు. అవన్నీ వేరే చోట నుండి కాపీ పేస్ట్ చేసినవే. సిగ్గులేకుండా ఒరిజినల్ రచనగా పబ్లిసిటీ చేసుకుంటారు! అని ఒక నెటిజన్ ఘాటుగా స్పందించాడు. భారతదేశంలో దోపిడీ కథలే కానీ, కొత్త కథలేవీ ఉండవు.. అని మరొకరు విమర్శించారు. లాపాటా లేడీస్ ఒరిజినల్ సినిమా అని నేను భావించాను.. కాదు అని తేలింది! అని మరో వ్యక్తి అన్నారు. లాపాటా లేడీస్ 2024 మార్చి 1న థియేటర్లలో విడుదలైంది. కిరణ్ రావు దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో స్పర్ష్ శ్రీవాస్తవ, ప్రతిభా రంతా, నితాన్షి గోయెల్, రవి కిషన్ ప్రధాన పాత్రల్లో నటించారు. విలేజ్ నేపథ్యంలో ఆద్యంతం కామెడీ సెటైరికల్ కంటెంట్ తో ఇది రూపొందింది. రైలు ప్రయాణంలో ఇద్దరు పెళ్లి కొడుకులు తమ పెళ్లికూతుళ్లు మారిపోయాక ఎలా షాక్ కి గురయ్యారు? ఆ తర్వాత కథేమిటి? అన్నది తెరపై ఆవిష్కరించారు. మారిపోయిన వధువుల కోసం భర్తల వెతుకులాట, ఆరాటం నేపథ్యంలో సినిమా ఆద్యంతం రక్తి కట్టిస్తుంది. ఆమీర్ ఖాన్ ప్రొడక్షన్స్ -కిండ్లింగ్ ప్రొడక్షన్స్ బ్యానర్లలో నిర్మించిన ఈ చిత్రంలో ప్రధానమైన పాయింట్ ఆకర్షిస్తుంది. ధోబీ ఘాట్ తర్వాత కిరణ్ రావు దర్శకురాలిగా రీఎంట్రీ ఇచ్చిన చిత్రమిది. థియేటర్లలో విడుదలకు ముందు ఈ చిత్రం 2023లో ప్రతిష్టాత్మక టొరంటో ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ప్రదర్శితమైంది. ఉత్సవంలో హాజరైన ప్రేక్షకుల నుండి దీనికి స్టాండింగ్ ఒవేషన్ లభించింది. 2025 ఆస్కార్లలో అంతర్జాతీయ ఫీచర్ ఫిల్మ్ విభాగంలో భారతదేశం తరపున అధికారికంగా లాపాటా లేడీస్‌పోటీబరిలో నిలిచింది.

## కృతిశెట్టి బాటలోనే శ్రీలీల పయనిస్తుందా? ఒకప్పుడు గోల్డెన్ లెగ్, ఇప్పుడు ఐరెన్ లెగ్..!



ఇటీవలి కాలంలో హీరోయిన్స్‌కి లక్ అనేది ఎక్కువ రోజులు ఉండడం లేదు. రెండు మూడు వరుస హిట్స్‌తో గోల్డెన్ లెగ్‌గా పేరు తెచ్చుకున్న ఈ భామలు ఆ తర్వాత వరుస ఫ్లాపులు దక్కించుకొని కెరీర్ సందిగ్ధంలో పడేలా చేసుకుంటున్నారు. రకుల్,తమన్నా, పూజా హెగ్డే, కృతి శెట్టి వంటి వారు ఒకప్పుడు ఊపేశారు. కాని ఇప్పుడు వారికి అవకాశాలే కరువయ్యాయి. ఉప్పెన సినిమాతో ఓవర్ నైట్ స్టార్‌గా మారిన కృతి శెట్టి అదే జోరును కొనసాగిస్తూ హ్యాట్రిక్ హిట్ ను సొంతం చేసుకుంది. అందంతో పాటు అదృష్టం కూడా ఉందని అంతా అనుకున్నారు.కానీ ఆ తరువాతనే కృతి శెట్టికి పరాజయాలు పలకరించాయి . గ్లామర్ విషయంలో వంకబెట్టవలసిన పనిలేదు. డాన్స్ విషయంలోను ఈ బ్యూటీ శభాష్ అనిపించుకుంది. ఇక ఈ ట్రెండ్ కి తగ్గట్టు యాక్టింగ్‌తో అదరగొడుతుంది. కానీ దురదృష్టం కొద్దీ ఆమెను ఫ్లాపులు పలకరించడంతో తెలుగులో అవకాశాలు తగ్గాయి. దాంతో తమిళ .. మలయాళ సినిమాలపై శ్రద్ధ పెట్టింది. ఇప్పుడు ఇదే రూట్లో శ్రీలీల పోతున్నట్టుగా కనిపిస్తుంది. తెలుగులో వరుస హిట్లతో అతి తక్కువ సమయంలోనే స్టార్ స్టేటస్ సంపాదించుకున్న శ్రీలీల బిజీ హీరోయిన్‌గా మారింది. అవకాశాలు పలకరిస్తూ ఉన్నా కూడా అవన్నీ కూడా బాక్సాఫీస్ దగ్గర తేలిపోతున్నాయి.స్కంద, ఆదికేశవ, ఎక్స్?ట్రార్డినరీ మ్యాన్ ఇలా శ్రీలీల నటించిన అన్ని సినిమాలు బాక్సాఫీస్ వద్ద బోల్తా కొట్టాయి. ఆ తర్వాత వచ్చిన గుంటూరు కారం సినిమాతో ఓ హిట్ పడింది. కానీ ఈ సినిమా శ్రీలీలకు అంత ప్లస్ కాలేదు. పుష్ప 2లో కిస్సిక్ పాటతో కాస్త అలరించింది. ఇక ఇటీవల నితిన్ హీరోగా తెరకెక్కిన రాబిన్ హుడ్ సినిమాతో ఆడియన్స్ ముందుకు వచ్చింది.

## ప్రభాస్‌తో మళ్లీ బాలీవుడ్ బ్యూటీ.. సో లక్కీ



పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ ప్రస్తుతం వరుస సినిమాలతో బిజీగా ఉన్న విషయం తెలిసిందే. ఓవైపు మారుతి దర్శకత్వంలో రాజా సాబ్ ను.. మరోవైపు హను రాఘవపూడి డైరెక్షన్ లో పీరియాడిక్ యాక్షన్ డ్రామా కంప్లీట్ చేస్తున్నారు. త్వరలోనే ఆ రెండు సినిమాలతో థియేటర్లలో సందడి చేయనున్నారు మన డార్లింగ్.

అయితే హను రాఘవపూడి మూవీ షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. వరుస షెడ్యూళ్లతో మేకర్స్ చిత్రీకరణను త్వరగా పూర్తి చేసే యోచనలో ఉన్నారు. ఇప్పటికే ఆ సినిమాలో హీరోయిన్ గా కొత్త అందం ఇమాన్వీని ఫిక్స్ చేసిన విషయం తెలిసిందే. ఇన్ స్టాగ్రామ్ ఇన్ఫ్లుయెన్సర్ అయిన ఆమె.. ప్రభాస్ మూవీతో ఎంట్రీ ఇస్తోంది.

ఇప్పుడు ఆ మూవీలో మరో హీరోయిన్‌గా బాలీవుడ్ బ్యూటీని ఫిక్స్ చేసినట్లు టాక్ వినిపిస్తోంది. రీసెంట్ గా దిశా పటానీని మేకర్స్ సంప్రదించినట్లు వార్తలు వస్తున్నాయి. ఆమెతో చర్చలు కూడా జరిగినట్లు తెలుస్తోంది. అదే సమయంలో ఆమెను ఇప్పటికే ఫిక్స్ చేశారని మరికొందరు కామెంట్లు పెడుతున్నారు.

అయితే దీనిపై మేకర్స్ క్లారిటీ ఇవ్వాల్సి ఉంది. అదే సమయంలో దిశా పటానీ ఓకే చెబితే.. ఆమె మరోసారి ప్రభాస్‌తో జత కట్టినట్లు అవుద్దన్న విషయం తెలిసిందే. ఇప్పటికే కల్కి మూవీలో ప్రభాస్, దిశా పటానీ స్క్రీన్ షేర్ చేసుకున్నారు. ఇప్పుడు హను రాఘవపూడి మూవీలో మళ్లీ జోడీగా నటించనున్నట్లు సమాచారం.

ఆ సినిమా తర్వాత కల్కి 2898 ఏడీ సీక్వెల్ లో కూడా ప్రభాస్, దిశా పటానీ జోడీగా సందడి చేయనున్నారని ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే అందుకు దిశా ఓకే చెప్పేసిందని టాక్ వినిపిస్తోంది. త్వరలో స్టార్ట్ కానున్న షూటింగ్ లో కూడా పాల్గొనుందని తెలుస్తోంది. అలా టాలీవుడ్ లో అమ్మడు బిజీ కానుందన్నమాట.

దిశా విషయానికొస్తే.. మోడలింగ్ ద్వారా సినీరంగంలోకి ఎంట్రీ ఇచ్చిన బ్యూటీ.. మిస్ ఇండియా పోటీల్లో పాల్గొని లైమ్ లైట్ లోకి వచ్చింది. ఆ తర్వాత మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ లోఫర్ సినిమాతో టాలీవుడ్ హీరోయిన్ గా పరిచయమైంది. కానీ ఈ సినిమా ఫ్లాప్ కావడంతో బాలీవుడ్ కు షిఫ్ట్ అయిన బ్యూటీ.. కల్కి మూవీతో మళ్లీ అడుగు పెట్టింది. ఇప్పుడు ఇక్కడ మంచి అవకాశాలు అందుకుంటోంది!

## ముంబైని వదిలేసిన యశస్వి జైస్వాల్.. కొత్త జట్టుతో దేశవాళీ క్రికెట్



**ముంబై-నవభూమి:** దేశవాళీ క్రికెట్‌లో కొత్త జట్టుతో యశస్వి జైస్వాలఆడనున్నాడు. 2024-2025 సీజన్‌లో ముంబై జట్టు తరపున జైస్వాల్ ఆడిన విషయం తెలిసిందే. ఇటీవల ముగిసిన రంజీ ట్రోఫీ టోర్నీలో ముంబై తరపున జైస్వాల్ ప్రాతినిధ్యం వహించాడు. అయితే తన కెరీర్‌లో భారీ మార్పు చేసుకున్నాడతను. అండర్-19 క్రికెట్ ఆడుతున్న నాటి నుంచి ముంబై తరపున ఆడిన ఆ టీమిండియా ఓపెనర్ ఇప్పుడు దేశవాళీ క్రికెట్‌లో గోవా తరపున ఆడేందుకు డిసైడ్ అయ్యాడు. వచ్చే సీజన్ నుంచి అతను గోవా తరపున ఆడనున్నాడు. దీని కోసం అతను ముంబై క్రికెట్ అసోసియేషన్ నుంచి నో ఆబ్జెక్షన్ సర్టిఫికేట్ కోసం దరఖాస్తు చేసుకున్నాడు. స్టేట్ క్రికెట్‌ను మార్చుకోనున్నట్లు అతను తెలిపాడు. ఇటీవల ముంబై ప్లేయర్లు అర్జున్ టెండూల్కర్, సిద్దేశ్ లాడ్‌లు.. స్వరాష్ట్రాన్ని వీడి గోవా తరపున రంజీలో ఆడిన విషయం తెలిసిందే.ఆస్ట్రేలియాలో జరిగిన బోర్డర్ గవాస్కర్ ట్రోఫీని నుంచి తిరిగి వచ్చిన తర్వాత జైస్వాల్ దేశవాళీ క్రికెట్‌లో ముంబై తరపున రంజీలో ఆడాడు. టీమిండియా ప్లేయర్లు కచ్చితంగా దేశవాళీ టోర్నీల్లో ఆడాలని బీసీసీఐ నిబంధన పెట్టిన విషయం తెలిసిందే. దీంతో రంజీ ట్రోఫీలో జైస్వాల్‌తో పాటు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ కూడా ఆడారు.ప్రస్తుతం జరుగుతున్న ఐపీఎల్‌లో రాజస్థాన్ రాయల్స్ తరపున జైస్వాల్ ఆడుతున్నాడు. కానీ ఇప్పటి వరకు అతను పెద్దగా స్కోర్ చేయలేదు. మూడు మ్యాచుల్లో అతను కేవలం 34 రన్స్ మాత్రమే చేశాడు. అత్యధిక స్కోరు 29 మాత్రమే. కొత్తగా వచ్చిన పవర్‌ప్లే రూల్స్‌తో జైస్వాల్ సమస్యలు ఎదుర్కొంటున్నట్లు తెలుస్తోంది. గత 18 ఇన్నింగ్స్‌లో అతను 8 సార్లు మొదటి మూడు ఓవర్లలోనే ఔటయ్యాడు. 2024 సీజన్‌లో జైస్వాల్ 31 సగటుతో 435 రన్స్ స్కోర్ చేశాడు. దాంట్లో ఓ సెంచరీ, ఫిఫ్టీ ఉన్నాయి. గత రెండు సీజన్ల నుంచి జైస్వాల్ అటాకింగ్ ఆట తీరు 70 శాతం తగ్గినట్లు అంచనా వేశారు.

## పాయింట్ల పట్టికలో రెండోస్థానికి దూసుకెళ్లిన పంజాబ్ కింగ్స్..!




**ముంబై-నవభూమి**ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2025 సీజన్ కొనసాగుతున్నది. ఇప్పటి వరకు 13 మ్యాచులు పూర్తయ్యాయి. ఇందులో పలు జట్లు మూడేసి చొప్పున మ్యాచులు ఆటగా.. మరికొన్ని జట్లు రెండేసి మ్యాచులు ఆడాయి. 18వ సీజన్‌లో పాయింట్ల పట్టికలో బెంగళూరు రాయల్ చాలెంజర్స్ అగ్రస్థానంలో కొనసాగుతున్నది. కొత్త కెప్టెన్‌తో బరిలోకి దిగిన పంజాబ్ కింగ్స్ ఆడిన రెండు మ్యాచుల్లోనూ విజయం సాధించి.. పాయింట్ల పట్టికలో రెండోస్థానానికి చేరుకుంది. మంగళవారం లక్నో సూపర్ జెయింట్స్‌తో జరిగిన మ్యాచ్‌లో విజయంతో నాలుగు పాయింట్లు సాధించి పాయింట్స్ టేబుల్‌లో రెండోస్థానానికి చేరింది. ఇక డిఫెండింగ్ చాంపియన్ కోల్‌కతా నైట్ రైడర్స్ మూడు మ్యాచుల్లో రెండు ఓటములు, ఒక విజయంతో అట్టడుగుకు చేరింది.ఐపీఎల్‌లో భాగంగా లక్నోలోని ఎకానా స్టేడియంలో లక్నో సూపర్ జెయింట్స్‌తో జరిగిన మ్యాచ్‌లో టాస్ ఓడిపోయింది. తొలుత బ్యాటింగ్ చేసిన లక్నో 20 ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 171 పరుగులు చేసింది. ఆ తర్వాత బ్యాటింగ్ చేసిన పంజాబ్ 16.2 ఓవర్లలో రెండు వికెట్ల నష్టానికి 177 పరుగులు చేసి మ్యాచ్‌ని గెలిచింది. ఐపీఎల్‌లో పంజాబ్ నాలుగోసారి తొలి రెండు మ్యాచుల్లో విజయం సాధించడం విశేషం. అంతకు ముందు 2014, 2017, 2023 సీజన్లలో మాత్రమే తొలి రెండు మ్యాచుల్లో విజయం సాధించింది.



## ఐపీఎల్ మ్యాచ్‌లో లెటర్ రైటింగ్ సంకేతం..



**లక్నో-నవభూమి:** ఐపీఎల్‌లో లక్నోతో మంగళవారం జరిగిన మ్యాచ్‌లో పంజాబ్ 8 వికెట్ల తేడాతో నెగ్గింది. అయితే ఆ మ్యాచ్‌లో అనుచితంగా ప్రవర్తించిన లక్నో సూపర్ గెయింట్స్ బౌలర్ దిగ్వేశ్ సింగ్ రాతీ(కి .. బీసీసీఐ జరిమానా విధించింది. మ్యాచ్ ఫీజులో 25 శాతం కోత విధించింది. ఓ డీమెరిట్ పాయింట్ కూడా జోడించారు. పంజాబ్ కింగ్స్ బ్యాటర్ ప్రియాన్ష్ ఆర్యను ఔట్ చేసిన తర్వాత .. అతని వద్దకు వెళ్లి లెటర్ రైటింగ్ సంకేతం చేస్తూ బ్యాటర్‌ను అవమానించాడు. ఐపీఎల్ ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించినందుకు రాతీకి జరిమానా విధిస్తున్నట్లు బీసీసీఐ తెలిపింది.

ఏకనా స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో లక్నో ఫస్ట్ బ్యాటింగ్ చేసి నిర్ణీత ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 171 రన్స్ చేసింది. ఆ తర్వాత ఆ టార్గెట్‌ను మరో 22 బంతులు మిగిలి ఉండగానే పంజాబ్ అందుకున్నది. కేవలం రెండు వికెట్లు మాత్రమే ఆ జట్టు కోల్పోయింది. పంజాబ్ జట్టులో ప్రభ్‌సిమ్రన్ సింగ్ 69, శ్రేయాస్ 52, వదేరా 43 రన్స్ చేశారు. ఐపీఎల్‌లోని ఆర్టికల్ 2.5 కింద లెవల్ 1 రూల్‌ను ఉల్లంఘించినట్లు లక్నో బౌలర్ దిగ్వేశ్ అంగీకరించాడు. మ్యాచ్ రిఫరీ విధించిన ఫీజును అతను ఆమోదించాడు. మ్యాచ్ రిఫరీ తీసుకున్న నిర్ణయమే ఫైనల్ అని ఐపీఎల్ మీడియా అడ్వైజరీ ఓ ప్రకటనలో తెలిపింది.ఇన్నింగ్స్ మూడవ ఓవర్‌లో షార్ట్ బంతిని పుల్ షాట్ ఆడబోయిన ఆర్యా క్యాచ్ అవుట్ అయ్యాడు. టాప్ హెడ్జ్ తీసుకున్న ఆ బంతిని .. మిడాన్ నుంచి వచ్చి శార్దూల్ అందుకున్నాడు.

Printed,Published & Owned by SHAIK SHAHANAZ, Printed at SUPER PRINTERS Web offset Printers 2-3-655/C/118,Azad Nagar,Amberpet Circle 23,HYDERABAD -500113(T.S.), and Published D.No: 10-2-287/1/,Ground Floor,Santhinagar,A.C Guards,Masabtank,HYDERABAD - 500028,State TELANGANA (India). Editor: **SHAIK SHAHANAZ**, Phone: 9246213493,Email : navabhoomidaily@gmail.com,navabhoomi1@gmail.com **RNI No: TEL TEL: 82083**